www.jagritiweekly.com
సంపుటి : 76 సంచిక : 11 పుటలు : 52

# జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ పుష్య శుద్ధ ద్వాదశి
22-28 జనవరి 2024
వెల : ₹20/-



# ఒకటే భారత్!

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

76 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక


# జాగృతి అయోధ్య ప్రత్యేక సంచిక ఆవిష్కరణ




అయోధ్యలో నిర్మించిన భవ్య రామమందిరంలో జనవరి 22న ప్రాణప్రతిష్ఠ మహా సందర్భంగా జాగృతి వారపత్రిక వెలువరించిన ప్రత్యేక సంచిక (జగదానందకారకా...!)ను, కేలెండర్‌ను కంచి కామకోటి పీఠాధిపతి, జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి సామివారు జనవరి 11న ఆవిష్కరించారు. హైదరాబాద్ లోని స్కందగిరి శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జాగృతి సభ్యులతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్‌వి సుబ్రహ్మణ్యం, సంస్కృత భారతి ప్రముఖులు కాశీవిశ్వనాథ శర్మ కల్లూరి తదితరులు పాల్గొన్నారు. ఈ సంచికకు విశేష ఆదరణ లభించింది. స్వామివారు కూడా పత్రికను ప్రశంసించారు.



# జాగృతి.. ఒక మేలుకొలుపు.. ఒక వేకువ పిలుపు..



జాగృతిని చదువుదాం.. చదివిద్దాం..
జాతీయ భావనను బలోపేతం చేద్దాం..
సాంస్కృతిక వారసత్వాన్ని నిలుపుకుందాం..



జాగృతి చందాను ఆన్‌లైన్‌లో
మీ మొబైల్ నుంచి చెల్లించడానికి
ఇక్కడ ఉన్న క్యు.ఆర్. కోడ్‌లను
గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి.
లేదా క్రిందనున్న లింక్‌లను ఉపయోగించండి.

సంవత్సర చందా రూ.850/-
http://payit.cc/S18970

విడి ప్రతి రూ.20/-

ఐదు సంవత్సరాల చందా రూ.4000/-
http://payit.cc/S18973

## రిజిస్టర్డ్ పార్సిల్ సదుపాయం కోసం...

తక్కువ ఖర్చుతో జాగృతి సంచికను రిజిస్టర్డ్ పార్సిల్ (మ్యాగజైన్ పోస్టు) ద్వారా అందుకోవడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను ఉపయోగించాలి.
(సంవత్సర చందా రూ.850/- + మ్యాగజైన్ పోస్టు సం॥నికి రూ. 624/- )

వెల : రూ.1474/-
https://payit.cc/S32796

**సూచనలు :**

- మీ చందాని చెల్లించేటప్పుడు పూర్తి చిరునామాని పిన్‌కోడ్, ఫోన్ నెం.తో సహా వ్రాయాలి.
- తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీ ఫోన్ కి CP-JAGRIT అనే ఐ.డి.తో ఎస్.ఎమ్.ఎస్. వస్తుంది. ఆ వెంటనే పత్రిక అందుతుంది.
- పత్రిక అందకపోయినా, మీ చిరునామాలో తేడాలున్నా మీ చందా నెం. లేదా ఫోన్ నెం. వివరాలతో మా కార్యాలయానికి ఉ॥11 గంటల నుండి సా॥6 గంటల మధ్య ఫోన్ చేయగలరు.

Bank A/c details :
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch,
Hyderabad
IFSC : UTIB0002157,
PAN : AAATJ3829L

ఇతర వివరాలకు సంప్రదించండి
సర్క్యులేషన్ మేనేజర్ : 040-27561453 / 9959997013

jagritiweekly.com facebook.com Jagriti Telugu Weekly youtube.com/@Jagrititv 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ။11 నుండి సా။ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040–27561453/9959997013



6లో

ముఖపత్ర కథనం

## ఒకటే భారత్!

భారత జాతీయ కాంగ్రెస్ పోరాటం లక్ష్యం దేశం మొత్తానికి స్వాతంత్ర్యం. ఉత్తర భారతం, దక్షిణ భారతం అంటూ విభజన తేవడం కాదు. రెండు భౌగోళిక ప్రాంతాల విభజన కృతకమన్నదే నాటి కాంగ్రెస్ విస్పష్ట విధానం. చిరకాలం పాటు జిన్నా విభజనవాదాన్ని అడ్డుకున్న కాంగ్రెస్ ఉత్తర, దక్షిణ భారత వాదాన్ని ఎలా సమర్థిస్తుంది? ఇప్పుడు ఈ అభిప్రాయాలూ, విలువలు కాంగ్రెస్‌లో లేవు. ఓట్లు తెచ్చుకోవడానికి మాత్రమే గాంధీ–నెహ్రూ పేర్లను కాంగ్రెస్ గౌరవిస్తున్నది. లేకపోతే చాలామంది స్వాతంత్ర్యం సమరయోధులని వదిలిపెట్టినట్టే ఆ రెండు పేర్లనీ కూడా కాలగర్భంలో కలిపేసేది.




**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ။11 నుండి సా။ 6 గంటల మధ్య)**

కె. దుర్గారెడ్డి అసోసియేట్ ఎడిటర్
సబ్ ఎడిటర్ 9959991304

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

ఏ మాత్రం ఆశ్చర్యం కలిగించలేనివి కొన్ని ఉన్నాయి. ఆహ్వానించదగినవి మాత్రం విశేషంగా ఉన్నాయి. దేశ చరిత్ర దిశ మారుతున్న సంకేతాలు కూడా గణనీయంగానే ఉన్నాయి. ఇదీ–అయోధ్య భవ్య రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠ వేళ భారతీయ సమాజంలో కనిపిస్తున్న దృశ్యం. మరొకవైపు ప్రతిష్ఠ కార్యక్రమం కోసం ప్రపంచం ఎదురుచూస్తున్నదన్న వార్తలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ ప్రాణప్రతిష్ఠ భారతీయ నాగరికతలోనే ఒక మలుపు అన్నది ప్రస్తుతానికి ఎందరో విజ్ఞులకు కలిగిన అంచనా. ఐదు వందల ఏళ్ల ఓర్పుకీ, ఎదురుచూపులకీ, పోరాటాల ఫలితాలకీ, త్యాగాలకీ ఇది పరాకాష్ట అన్నారు ప్రధాని నరేంద్ర మోదీ. ఇంతటి మహోన్నత ఆధ్యాత్మిక క్రతువులో భాగస్వామి కావడానికి వీలుగా 11 రోజుల అనుష్టాన దీక్షను కూడా ప్రారంభించినట్టు ఆయన 'ఎక్స్'లో జాతి జనులకు తెలియచేశారు. 12వ తేదీన ఈ విషయం ప్రకటించిన మోదీ, ఆ రోజే నాసిక్‌లో ఒక ఆలయంలో స్వయంగా శుచి కార్యక్రమం నిర్వహించారు. ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో తాను భౌతికంగా ఉన్నప్పటికీ తన గుండెచప్పుళ్లలో 140 కోట్ల మంది భారతీయుల హృదయ స్పందన కూడా ఉంటుందని అన్నారాయన. అయోధ్య ఆలయ నిర్మాణం కోసం భగవంతుడు పంపించిన ప్రతినిధి మోదీ అని లాల్ కృష్ణ అడ్వానీ 'రాష్ట్రధర్మ' పత్రికకు ఇచ్చిన ప్రత్యేక ముఖాముఖీలో వ్యాఖ్యానించారు. 2005లో ఆఖరిసారి సందర్శించిన అడ్వానీ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా విచ్చేస్తే అయోధ్యవాసులంతా ఆనందిస్తారని రామాలయ ప్రధాన అర్చకులు ఆచార్య సత్యేంద్రదాస్ అభిలషించారు. అడ్వానీ వెళతారనే ఎక్కువమంది నమ్మకం. వెళ్లాలన్నదే చాలామంది ఆకాంక్ష. అలాగే అయోధ్య మందిర నిర్మాణం కోసం మూడు నాలుగు దశాబ్దాలుగా తపించిన వారికీ, పోరాడినవారికీ కూడా ఆ మహత్తర కార్యక్రమాన్ని వీక్షించే అవకాశం భగవంతుడు కల్పించాలని ఆశిద్దాం.

ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం ఆహ్వానానికి కాంగ్రెస్ పార్టీ 'గౌరవప్రదమైన'

**శాలివాహన 1945 శ్రీ శోభకృత్ పుష్య శుద్ధ ద్వాదశి**

### లోపలి పేజీలలో...



జాతీయం

**బంగ్లా: పాత నాయకత్వంతో కొత్త ప్రయాణం**

12లో



ప్రత్యేక వ్యాసం

**ఆడబిడ్డలను ఆదరిద్దాం!**

26లో



ప్రత్యేక వ్యాసం

**నేను నేతాజీని కడసారి కలసినప్పుడు... ఆ తర్వాత**

23లో

# జాగృతి

## సంపాదకీయం

నిరాకరణ ఎవరినీ ఆశ్చర్యపరిచేదే కాదు. జనవరి 10న ఈ గౌరవప్రదమైన నిరాకరణ గురించి ఆ పార్టీ నాయకులు ప్రకటించారు. ఇచ్చిన మర్యాదను స్వీకరించడానికి కూడా సంస్కారం కావాలి. కాంగ్రెస్ పార్టీ నుంచి అలాంటి సంస్కారాన్ని ఆశించడం శుద్ధ దండగ. ఆ పార్టీ చరిత్ర అలాంటిది. చింతన అలాంటిది. గాఢమైన జాతీయభావాలనూ, దేశంలోని మెజారిటీ ప్రజల మనోభావాలనూ ఆ పార్టీ ఏనాడూ గౌరవించిన పాపాన పోలేదు. ఆ క్రమంలోనే హిందూత్వ భావనలను కలిగిన ఏ ఒక్క నేతకూ స్వాతంత్ర్య పోరాట సంస్థగా కూడా కాంగ్రెస్ నిలువ నీడనివ్వలేదు. బాలగంగాధర తిలక్, అరవింద ఘోష్,

# అయోధ్య-రాజకీయనేతలు

లాలా లాజ్‌పతిరాయ్, బిపిన్‌చంద్ర పాల్ వంటి వారందరినీ వెళ్లగొట్టేవరకు అది నిద్రపోలేదన్నది చరిత్ర. మరొక గొప్ప ఉదాహరణ సోమనాథ్ ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం. ఆ కార్యక్రమంలో పాల్గొనాలని దృఢ సంకల్పంతో ఉన్న నాటి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్‌ను నిలువరించడానికి ప్రథమ ప్రధాని చేసిన ప్రయత్నం జుగుప్సాకరమైన ఘట్టం. ఇప్పుడు కూడా అంతే. అసలు రాముడి ఉనికే లేదని అత్యున్నత న్యాయస్థానానికి చెప్పేసిన పార్టీ, ఆయన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి వస్తుందని అనుకోలేం. ఇదొక్కటేనా కారణం? ఆ సంస్థకు ఇప్పుడు నాయకత్వం వహిస్తున్న వారి వ్యక్తిగత విశ్వాసాలు కూడా ఈ గౌరవప్రదమైన నిరాకరణకు కారణమే. 'సనాతన ధర్మ' నిర్మూలనే ధ్యేయంగా ఉన్న డీఎంకే ఇచ్చే ముష్టి రాజకీయ దానం చేజారిపోతుందేమోనన్న బెంగ ఎలాగూ ఉంటుంది. నిజానికి ఎన్నికల తేదీని ఇప్పటికే ప్రకటించి ఉంటే, 'జన్యుధారి' రాహుల్‌గాంధీ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి ఎగిరి చక్కా వచ్చేవారే. ఇక కాంగ్రెస్ అధికార ప్రతినిధులుగా చలామణి అయ్యే నెహ్రూ–గాంధీ కుటుంబీకుల బంట్లు చేస్తున్న వ్యాఖ్యలు మరీ వికారంగా ఉన్నాయి. మందిరం బీజేపీ–ఆర్ఎస్ఎస్ రాజకీయ ప్రాజెక్ట్ అట. పిలుపులలో మర్యాద లేదట. అయోధ్య ఉద్యమం ప్రారంభమయ్యే నాటికి ఆర్ఎస్ఎస్ లేదు, బీజేపీ అసలే లేదు. ఇవన్నీ దేశంలోని మెజారిటీ ప్రజల మనోభావాలను దారుణంగా కించపరిచేవేనని తెలియనంత పదవీదాహంతో వీరు వేగిపోతున్నారు. కానీ ఇదంతా పదవీ రాజకీయమేననీ, సెక్యులరిజాన్ని ఇంకా భ్రష్టుపట్టించడమేనని వీళ్లకి అనిపించడం లేదు. కమ్యూనిస్టులు, మమత, నితీశ్ వంటివారిది కూడా ఇదే ధోరణి.

కానీ కాంగ్రెస్ పార్టీలోనే డాక్టర్ కరణ్‌సింగ్ వంటివారు ఆహ్వాన తిరస్కృతిని నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తున్నారు. 'వాళ్లెందుకు (ఆహ్వానం అందినవాళ్లు) వెళ్లడం లేదో నాకు తెలియదు. అందుకు నేను విమర్శించను. కొందరు నాయకులు వ్యక్తిగత హోదాలో వెళ్లినా మంచిదేనని ఆయన హితువు పలికారు. తనకు ఆహ్వానం ఉన్నా 93 ఏళ్లు కాబట్టి కదలలేనని చెబుతున్నారు.

ఐదువందల ఏళ్ల అయోధ్య పోరాటం తుది దశలో అయినా ముస్లింలు ఆ కట్టడాన్ని హిందువులకు స్వచ్ఛందంగా ఇచ్చి ఉంటే భారతదేశ చరిత్రలో గొప్ప ఘట్టం చోటు చేసుకుని ఉండేదని అన్ని వర్గాల వారు అభిప్రాయపడుతున్నారు. చరిత్రలో జరిగిన తప్పుతో జరిగిన ఘోర తప్పిదాన్ని గుర్తించి, నమాజు చేయకుండా విడిచిపెట్టిన ఒక కట్టడాన్ని హిందువులకు అప్పగించి ఉంటే దేశంలో సమైక్యతకూ, మత సామరస్యానికీ గొప్ప మలుపు అయి ఉండేదే. కానీ కాంగ్రెస్, కమ్యూనిస్టులు, ఇతర సెక్యులర్ పార్టీలు ముస్లింలను అందుకు సిద్ధపడనివ్వలేదన్నది ఒక కఠోర సత్యం. ఇప్పుడు ప్రాణప్రతిష్ఠనూ బహిష్కరించాయి. అలా, ఇంత జరిగినా హిందువులకీ, ముస్లింలకీ మధ్య ఘర్షణ వాతావరణం కొనసాగుతూ ఉండడమే తమ అభిమతమని ఈ వైఖరితోనూ నిరూపించాయి. ★


22 జనవరి 2024, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్




కథ

**తక్షణ కర్తవ్యం**

– మాచిరాజు కామేశ్వరరావు






మూడు రాజధానులు ఇక నినాదమే...! (ఆంధ్రప్రదేశ్) – 14
ధరణి పేరుతో 'భూమాయ' (తెలంగాణ) – 16
మతిమాలిన వ్యాఖ్యలు తెచ్చిన అనర్థం! (అంతర్జాతీయం) – 20
పశ్చిమ బెంగాల్‌లో శాంతిభద్రతలు మరీచికేనా? (జాతీయం) – 32
జంబూ ద్వీపంలో సమైక్యత (అంతర్జాతీయం) – 28
క్రీడావని బహూ 'కృతి' (మహిళ) – 36
భారత కుస్తీకి మహా'సుస్తీ'! (క్రీడ) – 43
సంక్రాంతి విజేత 'హనుమాన్' (సినిమా) – 50

**దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన సంస్థ అంటూ కాంగ్రెస్‌ను కీర్తించేవాళ్లు ఇకనైనా కళ్లు తెరవాలి. అసలు కాంగ్రెస్ పార్టీయే స్వాతంత్ర్యం, స్వాతంత్ర్య పోరాటంతో వచ్చిన జాతీయ సమైక్యత, గాంధీజీ, నెహ్రూ వంటి పదాలకు నీళ్లు వదలడం కూడా ధర్మం. అప్పుడే ఆ పార్టీ నిజాయతీ ఏమిటో దేశానికి తెలుస్తుంది. భారత జాతీయ కాంగ్రెస్ పోరాటం లక్ష్యం దేశం మొత్తానికి స్వాతంత్ర్యం. ఉత్తర భారతం, దక్షిణ భారతం అంటూ విభజన తేవడం కాదు. రెండు భౌగోళిక ప్రాంతాల విభజన కృతకమన్నదే నాటి కాంగ్రెస్ విస్పష్ట విధానం. చిరకాలం పాటు జిన్నా విభజనవాదాన్ని అడ్డుకున్న కాంగ్రెస్ ఉత్తర, దక్షిణ భారత వాదాన్ని ఎలా సమర్థిస్తుంది? ఇప్పుడు ఈ అభిప్రాయాలూ, విలువలూ కాంగ్రెస్‌లో లేవు. ఓట్లు తెచ్చుకోవడానికి మాత్రమే గాంధీ-నెహ్రూ పేర్లను కాంగ్రెస్ గౌరవిస్తున్నది. లేకపోతే చాలామంది స్వాతంత్ర్యం సమరయోధులని వదిలిపెట్టినట్టే ఆ రెండు పేర్లనీ కూడా కాలగర్భంలో కలిపేసేది.**

# ఒకటే




స్వరాజ్య సమరస్ఫూర్తికి కాంగ్రెస్ ఏనాడో సుదూరంగా జరిగింది. ఇక దేశానికి స్వాతంత్ర్యం తెచ్చినది కాంగ్రెస్ సంస్థ అన్నది కూడా అర్థసత్యం కాబట్టి ఆ కీర్తి ఇంకా తనకు దక్కాలని అనుకో కూడదు. ప్రస్తుత కాంగ్రెస్ పోకడను చూస్తుంటే ఇదే అనిపిస్తుంది. ఎన్నికలలో విజయం దక్కకపోతే విభజన రాజకీయాలను ఆశ్రయించడమేనా? అధికారపీఠం సుదూరంగా ఉందని తెలిస్తే ఇక విధ్వంసక పోకడలను నమ్ముకోవడమేనా? ఇది ఏ రాజకీయ పార్టీ అయినా ఒక దేశం పట్ల అనుసరించవలసిన వైఖరే అవుతుందా?

2023 ఆఖరులో జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ చేత చాలా విషయాలు మాట్లాడించాయి. అందులో ఉత్తర దక్షిణ భారతాలు అనే అంశం కూడా ఒకటి. 'దక్షిణ భారతం, ఉత్తర భారతం మధ్య సరిహద్దు గీతకు మరింత స్పష్టత వచ్చింది' ప్రవీణ్ చక్రవర్తి అనే కాంగ్రెస్ నాయకుడు 'ఎక్స్'లో పెట్టిన వ్యాఖ్య ఇది (తరువాత ఉపసంహ రించుకున్నారు). సీఆర్ కేశవన్ అనే బీజేపీ నాయకుడు చక్రవర్తి రెండు పోస్టులు పెట్టి, చేసిన ఈ ఘనకార్యం గురించి దేశం దృష్టికి తీసుకువెళ్లారు. సనాతన ధర్మ నిర్మూలన చేయాలంటూ గొడవ తెచ్చి విఫలమైన కాంగ్రెస్, దాని మిత్రపక్షం డీఎంకే ఇప్పుడు మొత్తంగా ఉత్తర దక్షిణ వేర్పాటు గురించి మాట్లాడు తున్నాయని తమిళనాడుకు చెందిన ఆ బీజేపీ నేత వ్యాఖ్యానించడం సరైనదే. సనాతన ధర్మ నిర్మూలన నినాదం, కుల ఆధారిత జనాభా లెక్కలు ఇవన్నీ కూడా కాంగ్రెస్, దాని మిత్రుల కుట్రగానే చాలా మంది భావిస్తున్నారు. అయితే కాంగ్రెస్‌కే చెందిన తహెసిన్ పూనావాలా వంటివారు ఇలాంటి నినాదాలు తెస్తే బెడిసికొడుతుందని హెచ్చరిస్తున్నారు. తహెసిన్ చాలా చక్కని మాటలు చెప్పారు. 'మీరు ఉత్తర దక్షిణ భారతాలు అనే విషయం జోలికి పోవద్దు. బెడిసికొడుతుంది. అసలు కాంగ్రెస్ వారసత్వానికే చేటు చేస్తుంది. కాంగ్రెస్ అంటే ఈ గొప్ప దేశంలో జాతీయవాదాన్ని సమర్థించే అత్యంత పురాతన పార్టీయే కాదు, మొట్టమొదటిది కూడా'

# భారత్!


అని ఆయన గుర్తు చేశారు. ఇంకొక మంచిమాట కూడా ఆయన చెప్పారు. 'సనాతన ధర్మ నిర్మూలన నినాదాన్ని ప్రజలు ఎలా అంగీకరించలేదో, ఉత్తర భారతం, దక్షిణ భారతం అన్న అభిప్రాయాన్ని కూడా వారు గౌరవించరు'. కొందరు బుర్ర తక్కువ జర్నలిస్టులు కూడా ఆ ఎన్నికల ఫలితాలలో ఉత్తర, దక్షిణ భారతాల అంశం తీసుకువచ్చారు. పరంజోయ్ గుహ ఠాకూర్ అలాంటివారిలో ఒకరు. 'ఈ ఎన్నికలలో హిందుత్వ సంకీర్ణమే గెలిచింది. కాంగ్రెస్ చెప్పే సౌమ్య హిందుత్వం విఫలమైంది. ఆ విధంగా ఉత్తర-దక్షిణ భారత విభజన పదునెక్కింది' అన్నాడతడు. మరొక పత్రికా రచయిత ఎంకే వేణు కూడా ఇలాంటి అభిప్రాయమే చెప్పారు. ఇలాంటి చెత్త అభిప్రాయాలు వ్యక్తం చేసినవారంతా తలబొప్పి కట్టేటట్లు జనం చేత చీవాట్లు తినవలసి వచ్చింది. 'ఉత్తర భారతం లేదు. దక్షిణ భారతం లేదు. తూర్పు, పశ్చిమ భారతాలు కూడా లేవు. ఉన్నది ఒక్కటే భారత్. భారతీయులు నివశించే భారత్ ఒక్కటే' అన్నారు మరొక పత్రికా రచయిత సావియో రోడ్రిగ్స్. ఒకవేళ బీజేపీ నెగ్గింది కాబట్టి ఉత్తర భారతదేశాన్ని వేరుగా చూడాలని అనుకుంటున్న అజ్ఞానులకు యశ్వంత్ దేశ్‌ముఖ్ అనే రాజకీయ విశ్లేషకుడు మంచి సమాధానం ఇచ్చారు. గత ఏడాది కూడా అక్కడ బీజేపీ ప్రభుత్వం ఉంది. '2024 లోక్‌సభ ఎన్నికలలో కర్ణాటకలో బీజేపీ ఘనవిజయం సాధిస్తుంది. అప్పుడేమంటారు?' అన్నారాయన. అలాగే ఉత్తర భారతం అంటూ, కాంగ్రెస్‌ను అక్కడే పరిమితం చేయదలుచుకున్నవారి కళ్లు తెరిపిస్తూ దేశ్‌ముఖ్ మరొక విషయం కూడా చెప్పారు. వచ్చే ఎన్నికలలో కేరళలో గెలిచేది కాంగ్రెస్ పార్టీయే అన్నారాయన. ఇలాంటి వాదనలు వింటున్న ఈ తరుణంలో లోక్‌సభలో వాస్తవాలు ఏమిటి? దక్షిణాది నుంచి కాంగ్రెస్ కంటే బీజేపీకే ఎక్కువ స్థానాలు ఉన్నాయి. కర్ణాటక నుంచి 25, తెలంగాణ నుంచి 4 స్థానాలు అంటే 29 స్థానాలు బీజేపీవే. సాగరికా ఘోష్ అనే మరొక కుహనా మేధావి విశ్లేషణ మరీ హాస్యాస్పదం. పుదుచ్చేరి మినహా దక్షిణాది బీజేపీ ముక్త్ దక్షిణ భారత్‌ట! హిమాచల్ మినహా ఉత్తరాది కాంగ్రెస్ ముక్త్ ఉత్తర భారతదేశమట. 2024 ఎన్నికలలో ఈ విభజన మరింత పెరుగుతుందట.

ఉత్తర భారతదేశం, దక్షిణ భారతదేశం.. ఇవి వేర్వేరు అన్న భావన దగ్గరకు భారతీయులను క్రమంగా తీసుకువెళ్లాలని కాంగ్రెస్ పార్టీ, ఈ పార్టీ అనుంగు మిత్రపక్షం ద్రవిడ మున్నేట్ర కళగం కంకణం కట్టుకున్నాయని చెప్పక తప్పదు. జర్నలిస్టుల పేరుతో, ఉదారవాదులుగా చలామణి అవుతున్న వీటి తోకలు, జర్నలిస్టులు కూడా ఈ వ్యర్థ ప్రయత్నానికి కొమ్ము కాస్తున్నాయి. భారత జాతీయ కాంగ్రెస్ వారసత్వం తమదేనని పదే పదే చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ తన మూలాలు ఏక భారత్ భావనలోనే ఉన్నాయన్న సంగతిని తుంగలో తొక్కుతూ ఉంటే, దాని మిత్రపక్షం ఇంతకాలం భయపడి దాచిపెట్టుకున్న ప్రత్యేక తమిళస్థాన్ వాదాన్ని ఇప్పుడు తెంపరితనంతో ముందుకు తెస్తున్నది. ఇందుకు కారణం ఒక్కటే. ఉత్తర భారతదేశంలో కాంగ్రెస్ పార్టీకి నామరూపాలు లేకుండా పోవడం. తమిళనాడులో కూడా జాతీయవాద భావాలు పదునెక్కుతూ ఉండడం, ఫలితంగా ద్రవిడవాదం కాలగర్భం వైపు శరవేగంగా కదలడం రెండవది. కాంగ్రెస్‌ను తుడిచిపెట్టేసి, కాంగ్రెస్ విముక్త భారత్ కోసం తపిస్తున్న బీజేపీ ఉత్తర భారతంలో చాలావరకు తన నినాదాన్ని నిజం చేసేసింది. ఇప్పుడు తమిళనాడులో దాదాపు వందేళ్ల నుంచి వేళ్లూనుకుని ఉన్న ద్రవిడ వాద మూలాలను పెకలించడానికి బీజేపీయే సంసిద్ధమవుతున్నది. ఈ తరుణంలో ఆ రెండు పార్టీలు కలిసి జమిలిగా ఉత్తర భారత, దక్షిణ భారత విభజన నినాదంతో ముందుకు నడిచే ప్రయత్నం చేస్తున్నాయి. తమ రాజకీయ మనుగడకు ఆ విధంగా కొనసాగింపునివ్వాలని ఉవ్విళ్లూరుతున్నాయి. చిత్రంగా ఇది రెండు కుటుంబాల రాజకీయ అస్తిత్వానికి సంబంధించిన బాధ. వారసత్వ



కన్యాకుమారి.. భారత దక్షిణాగ్రం. వంగ దేశంలో పుట్టి హిందూ ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు స్వామి వివేకానంద. ఆయన తపస్సుకు కూర్చున్నది ఈ పవిత్ర సాగర సంగమంలోనే.. ఇదే వివేకానంద రాక్ మెమోరియల్

రాజకీయాలను కాపాడేందుకు కొందరు పడుతున్న ఆరాటం. వాటి కోసం అవి ఉత్తర దక్షిణ వేర్పాటు నినాదాన్ని అస్త్రంగా వాడుకోవడం ఎంత దౌర్భాగ్యం? ఎంత దేశద్రోహం? ఇంతకంటే ఘోర దౌర్భాగ్యం ఇంకొకటి ఉంది. ఈ పార్టీ నాయకులే బీజేపీ, ప్రధాని నరేంద్ర మోదీ విభజన రాజకీయాలు చేస్తున్నారంటూ విమర్శిస్తున్నారు. మోదీ చేసినదేమిటి? తమిళ చరిత్రకు ప్రతీక అనదగిన సెంగోల్‌ను పార్లమెంట్‌లో ప్రతిష్ఠించారు. కేరళీయుల చరిత్ర ఉత్తుంగ శిఖరం ఆది శంకరాచార్యుల శిలా విగ్రహాన్ని హిమాలయాలలో పునఃప్రతిష్ఠించారు. నిన్నగాక మొన్న లక్షద్వీప్‌కు మహా వైభవం తీసుకురావడానికి యోజన చేస్తున్నట్టు చెప్పారు. వరదలతో, వర్షాలతో మునిగిపోతున్న కేరళకు వైద్య బృందం సహా వెళ్లి బాధితుల పట్ల తన సంఘీభావం ప్రకటించి వచ్చారు. వారంతా తమిళులనో, మలయాళీలనో ఆయన చూడలేదు. వారిని భారతీయ సంస్కృతికి మూల విరాట్టులుగా చూశారు. లేదంటే సాటి భారతీయులుగా చూశారు.



కాశీ విశ్వనాథ్ మందిరం

దశాబ్దకాలంలో గణనీయమైన విజయాలు సాధించి మూడోసారి కూడా మోదీ నాయకత్వంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని చాలాముందే పలు సర్వేలు మోత మోగించడం, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్, మధ్యప్రదేశ్‌లలో బీజేపీ తాజాగా అనూహ్య విజయం సాధించడం విపక్షాలను, ప్రధానంగా కాంగ్రెస్‌ను బెంబేలెత్తిస్తున్నది. ఆ క్రమంలో కాంగ్రెస్‌పార్టీ చేస్తున్న విమర్శలు జాతిని విస్తుపోయేటట్టు చేస్తున్నాయి. అలాగే మేధావులుగా చలామణి అవుతున్న వాళ్ల వాచాలత్వం కూడా ప్రమాదకరంగా పరిణమించింది. పదేళ్ల మోదీ నాయకత్వంలో దేశానికి ఒరిగిందేమీ లేదన్నదే వారి ప్రధాన ఆరోపణ. ఇక్కడే ఒక ప్రశ్న. జవాహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, సంజయ్‌గాంధీ, రాజీవ్‌గాంధీ, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ వీళ్లంతా ఉత్తర భారతదేశం నుంచే ప్రధానంగా గెలిచారు. లాల్ బహదూర్ శాస్త్రి, పీవీ నరసింహారావు (మహారాష్ట్ర), మన్మోహన్‌సింగ్ (అస్సాం) కూడా దక్షిణ భారతదేశం నుంచి నెగ్గినవారు కాదని గుర్తుందా? అయినా ఇప్పుడు చిక్కబడిన ఉత్తర దక్షిణ రేఖకు మేం అవతల ఉన్న దక్షిణాదికే చెందుతామని కాంగ్రెస్ ఎలా వాదిస్తుంది? ఇందిర ఒకసారి చిక్‌మగళూరు (కర్ణాటక), మెదక్ (తెలంగాణ) నుంచి పోటీ చేసి గెలిచారు. దాదాపు నలభయ్ ఏళ్లు దేశాన్నీ, కాంగ్రెస్ పార్టీనీ ఏలారు. కాబట్టి ఉత్తర భారతదేశం లేదా మొత్తం భారతదేశం వెనుకబడిపోయిందేమిటని ప్రశ్నించవలసింది ఎవరిని? ఒక్క కర్ణాటకలో విజయాన్ని, తెలంగాణలో తాజా విజయాన్ని చూసుకుని కాంగ్రెస్ దక్షిణ భారతం వేరు అన్న వేర్పాటువాద కుక్కతోక పట్టుకుని అధికార పీఠం దగ్గరకి ఈదాలని ఆశపడుతోంది. కాబట్టి ఇటీవలి ఎన్నికల చరిత్ర ప్రకారం ఉత్తర భారత దేశంలో ఆ పార్టీకి ఇప్పటికీ ఉన్న 40 శాతం ఓట్లను ఆ పార్టీ కాలదన్నాలని అనుకుంటున్నదా? అన్నది విశ్లేషకుల ప్రశ్న. బీజేపీని ఉత్తర భారతదేశపు పార్టీ అని చెప్పడం ఎంత అవివేకమో ఆ పార్టీ ప్రముఖులకు కూడా తెలియడం లేదు. దక్షిణ భారతదేశంలో అసలు బీజేపీ ఉనికే లేదనడం కొందరు చెత్త కాంగ్రెస్ అధికార ప్రతినిధులు, కమ్యూనిస్టులు చేసే వాదన మాత్రమే. ఇటీవల జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికల ఫలితాలు చాలు, బీజేపీ విమర్శకులంతా ఎంతగా ఉష్ట్రపక్షి మాదిరిగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతుంది. 2018లో జరిగిన శాసనసభ ఎన్నికలలో ఆ పార్టీ ఒంటరిగా పోటీ చేసి 6.98 శాతం ఓట్లు సాధించింది. 2023 ఎన్నికలలో ఆ ఓటింగ్‌ను 13.90 శాతానికి పెంచుకుంది. ఇప్పుడు

## కాశీ-తమిళ సంగమం

నిత్య జీవితంలో, పూజలో భారతీయులు దేశం మొత్తాన్ని స్మరించుకుంటారు. గంగా, యమున, గోదావరి, కావేరి వంటి నదులను తలుచుకుంటారు. వారు చేసే స్నానంలో ఈ నదీజలాలన్నీ ఉన్నాయని కల్పన చేసుకుంటూ మంత్రాలు చదువుకుంటారు. సౌరాష్ట్రలోని సోమనాథం నుంచి సేతువు దగ్గరి రామేశం వరకు 12 జ్యోతిర్లింగాలు ఉన్నాయి. ఇవన్నీ భారతీయులకీ, ప్రధానంగా హిందువులకీ ఆరాధనీయ స్థలాలే. దర్శనీయ క్షేత్రాలే. అంటే ఒక ఆధ్యాత్మిక ఏకత్వం ఈ దేశంలో గొప్ప నిజం. ఈ తాత్వికతలో ఈనాడు మనం చూడవల సింది ఐక్య భారతదేశం. దీనిని అనుసరిస్తున్నదే మోదీ ప్రభుత్వం. 'ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్' అన్నది నరేంద్ర మోదీ నినాదం. ఇది ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ నుంచి పుట్టిన నినాదమే. అలాగే 2020 కొత్త విద్యావిధానానికి మద్దతు ఇవ్వడానికి ఉద్దేశించినది కూడా. ఈ క్రమంలోనే ఉత్తర భారతదేశానికీ, దక్షిణ భారతావనికీ యుగాలుగా ఉన్న ఆధ్యాత్మిక తాత్విక బంధాన్ని గుర్తు చేయడానికి తలపెట్టిన కార్యక్రమమే కాశీ-తమిళ సంగమం. దీనిని రెండు ప్రముఖ విశ్వవిద్యాలయాలు ఐఐటీ మద్రాస్, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం కలసి నిర్వహిస్తున్నాయి. ఏటా నెలరోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుంది. ఈ సంగమానికి హాజరయ్యే వారికి భారత రైల్వే ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తుంది. నవంబర్ 19, 2020న ప్రధాని మోదీ ఈ కార్యక్రమాన్ని స్వయంగా ప్రారంభించారు. అయితే దీనికి హిందూ వ్యతిరేక డీఎంకే ప్రభుత్వం, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మద్దతు ఇవ్వడం లేదు. కానీ తమిళనాడుకు చెందిన చాలామంది విద్యావంతులు, పండితుల నుంచి మాత్రం మంచి ఆదరణ లభించింది.

భిన్నత్వంలో ఏకత్వం అంటూ ఉపన్యాసాలు ఇచ్చే వారు ఇప్పుడు ఉత్తర, దక్షిణ భారతాల ప్రస్తావన తీసుకురావడం ఆధునిక భారతదేశ చరిత్రలోనే విషాదం. కొన్ని యుగాలుగా కలసి ఉన్న ఇన్ని వైవిధ్యాలు రెండు మూడు ఎన్నికలలో కొన్ని రాజకీయ పార్టీల ఓటమితో ఈ దేశం నుంచి కనుమరుగు కావాలా? నిజానికి ఆధునిక కాలంలో ఈ వైవిధ్యం మరింత బలపడాలి. అదే ప్రయత్నం మోదీ ప్రభుత్వం చేస్తున్నది.

తమిళనాడు, వారణాసి చరిత్రలో కనిపించే రెండు అత్యున్నత విద్యాకేంద్రాలు. అందుకే వీటిని కలుపుతూ కాశీ-తమిళ సంగమం కార్యక్రమం ఏర్పాటయింది. మొదటి సంగమం నవంబర్ 16 నుంచి డిసెంబర్ 16 వరకు కాశీలో జరిగింది. తమిళనాడులోని 12 రాష్ట్రాల నుంచి 2500మంది పాల్గొన్నారు. వారంతా వారణాసి, ప్రయాగ, అయోధ్య వంటి చుట్టుపక్కల ప్రదేశాలను కూడా సందర్శించారు. ★

కూడా ఒంటరిగా పోటీ చేసినట్టే చెప్పాలి. బీజేపీతో పొత్తు పెట్టుకున్న జనసేన పార్టీ అత్యంత నిరాశాజనకమైన ఫలితాలను ఇచ్చింది. బీజేపీ






**అరవింద ఘోష్ బెంగాల్ నుంచి వచ్చి నాటి మద్రాస్ ప్రెసిడెన్సీలోని పుదుచ్చేరిలో ఆశ్రమం స్థాపించారు. అక్కడి నుంచే ఆయన తన ఆధ్యాత్మిక జీవనం సాగించారు. ప్రపంచ ప్రఖ్యాత 'సావిత్రి' మహా కావ్యం ఇక్కడే రచించారు. స్వాతంత్ర్యోద్యమంలో ఒక ఆలోచనాధారకు ఇదే కేంద్ర బిందువు.**


కర్ణాటకలో చిరకాలం అధికారంలో ఉంది. తమిళ నాడులో పొత్తులతోనే అయినా కొన్ని సీట్లు గెలిచింది. కేరళలో ఇప్పుడిప్పుడు కొన్నిచోట్ల బీజేపీ పట్ల మొగ్గు కనిపిస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు బలహీనంగానే ఉన్నా, ఒకప్పుడు ఇక్కడ నుంచి లోక్‌సభకు బీజేపీ నుంచి అభ్యర్థులు వెళ్లారు.

బీజేపీ వ్యతిరేకత ఆధారంగా కాంగ్రెస్, కమ్యూనిస్టులు, వీళ్ల తైనాతీలు చేస్తున్న వాదనలో గుడ్డి ద్వేషమే ఉంది. బీజేపీ ఉత్తరాదికి పరిమితమైన పార్టీ కాదని చెప్పడానికి ఇవాళ కొన్ని వందల ఉదాహరణలు ఉన్నాయి. ఈశాన్య భారత్‌లో ఇప్పుడు ఆధిక్యం చూపుతున్న పార్టీ బీజేపీయే. మిజోరంలో కూడా ఆ పార్టీ విజృంభించింది. సైహా, పలాక్ అసెంబ్లీ స్థానాల స్వరూప స్వభావాలు, అక్కడ బీజేపీ సాధించిన విజయం భారతదేశానికీ, విపక్షాలకూ పెద్ద పాఠమే చెప్పగలవు. సైహాలో 90.1 శాతం అక్షరాస్యులు. 97.1 శాతం క్రైస్తవులు. పలాక్ నియోజకవర్గంలో 93.6 శాతం అక్షరాస్యులు. 98.2 శాతం క్రైస్తవులు. ఈ రెండు నియోజకవర్గాలలోను బీజేపీయే గెలిచింది. ఈ వాస్తవాలన్నీ ఉన్నా బీజేపీని ఉత్తరాదివారి పార్టీ, అగ్రకులాల వారి పార్టీ అని పాడిందే పాడడం చాలామంది మానడం లేదు. ఇంతటి అజ్ఞానం ప్రదర్శిస్తున్నవారిలో కేవలం రాజకీయ ప్రయోజనాలే కీలకంగా ఉండే నాయకులే కాదు, స్వయం ప్రకటిత మేధావులు కూడా చాలా మందే ఉన్నారని అర్థమవుతుంది. ఈశాన్యం, పశ్చిమ బెంగాల్, జమ్ముకశ్మీర్‌లలో కూడా బీజేపీ ఉనికి తక్కువని ఎవరూ అనలేరు. మరొక వాస్తవం కూడా తెలియాలి. బీజేపీని 1980లో స్థాపించారు. కర్ణాటక అసెంబ్లీకి 1983లో జరిగిన ఎన్నికలలోనే ఈ పార్టీ 18 స్థానాలు గెలిచింది. ఎనిమిది శాతం ఓట్లు వచ్చాయి. హిందీ భాష మాట్లాడే ప్రాంతాల పార్టీగా, కౌబెల్ట్ పార్టీగా, బనియాల పార్టీగా, ఔత్తరాహుల పార్టీగా బీజేపీని ఎంత చిన్నచూపు చూడాలన్నా సాధ్యం కాదు. ఆ పార్టీ నిర్మాణంలోనే ఒక సమున్నత సిద్ధాంతం ఉంది. అదే భారతీయ ఐక్యత. ఈ సిద్ధాంతం ముందు ఉత్తర భారతం, దక్షిణ భారతం వంటి పునాది లేని వాదనలు నిలబడవు.

ఇలాంటి సందర్భంలోనే ఒక వాస్తవం దేశానికి అర్థమై ఉండాలి. భారతీయ జనతా పార్టీకి, అంతకు ముందు భారతీయ జనసంఘ్‌కీ ప్రజలు ఓట్లు వేశారంటే అది చెప్పిన భారతీయతను బట్టే. అది చెప్పిన ఆధ్యాత్మిక ఏకాత్మతతో భారతీయ జనత మమేకం కావడం వల్లనే. ఆ పార్టీ అధికారంలోకి వస్తుందన్న నమ్మకం పూర్తిగా పాదుకొనక పూర్వమే బీజేపీని భారతదేశం ఆదరించింది. మనం ఇంకా కోల్పోవడం కాదు, కోల్పోయినదేమిటో గ్రహించాలంటూ ఆ పార్టీ చెప్పే సిద్ధాంతం కారణంగానే ఆ పార్టీ ప్రజలకు దగ్గరయింది. సరిగ్గా ఇక్కడే కాంగ్రెస్, కమ్యూనిస్టులు విఫలమయ్యారు.

భారతదేశంలో లోపించినది రాజకీయ ఐక్యత అన్న వాదన కొట్టి పారవేయ లేనిది. కానీ సాంస్కృతిక ఏకత్వం ఎవరూ కాదనలేనిదే. రాజకీయాలను దృష్టిలో ఉంచుకుని, పదవీ రాజకీయాల కోసమే పనిచేస్తున్న కొందరు, ఎన్నికల వేళలోనే హంగామా చేసే చాలామంది మరచిపోతున్న విషయం, బీజేపీ రాజకీయ ఏకత్వాన్ని సాధించడంలో చాలా ముందడుగు వేసింది. ఉన్న సాంస్కృతిక బంధాన్ని బలోపేతం చేయడానికి చరిత్రలో ఎన్నడూ జరగనంత కృషి కూడా చేస్తున్నది. జగద్గురువు ఆది శంకరుల తత్వాన్నీ, దేశ సమైక్యతలో ఆయన దృష్టినీ బీజేపీ దేశంలో ఇంతగా ప్రచారం చేయడం వెనుక ఉన్నది ఉత్తర దక్షిణ భారతాల మధ్య వైరుధ్యం ఏనాడూ లేదని చాటడానికే. స్వామి వివేకానంద, సుబ్రహ్మణ్య భారతిలను తరచు గుర్తు చేయడం కూడా ఆ ఉద్దేశంతోనే. 2013 నాటి పెను వర్షాలలో కనుమరుగైన ఆదిశంకరుల ప్రతిమను నరేంద్ర మోదీ

## జండాను సవాలు చేస్తే రాజద్రోహమే



"ఏ వ్యక్తి అయినా సరే – చిన్నవాడుగాని పెద్దవాడు గాని– ఏ విధంగానైనా సరే భారత స్వాతంత్ర్యాన్ని, భారత రాజ్య ధ్వజాన్ని, రాజ్యాంగాన్ని సవాలు చేయ సాహసిస్తే అది రాజద్రోహమవుతుంది. దానిని రాజ్యద్రోహంగా తప్ప అన్యంగా పరిగణించేందుకు వీలులేదు. అది మద్రాసులోని మీకు లేదా మద్రాసు ప్రాంతీయులకే గాదు; సమస్త భారతదేశానికీ సవాలే. ఏం జరిగినా సరే భారతదేశం మాత్రం దీనిని సహించలేదు" – భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1957లో ద్రవిడ కజగానికి చేసిన హెచ్చరిక.

తిరిగి ప్రతిష్ఠించారో కాంగ్రెస్, కమ్యూనిస్టులు తెలుసుకోవడం చాలా అవసరం. కాశీ-తమిళ సంగమ కార్యక్రమం, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో తమిళ భాష అధ్యయనానికి పీఠం ఏర్పాటు దేశ ఐక్యతా సందేశాన్ని చాటడానికే. నాటి కన్నడ తత్త్వవేత్త, గొప్ప సంఘ సంస్కర్త బసవేశ్వరుని విగ్రహాన్ని లాంబెత్ (లండన్)లో మోదీ ఆవిష్కరించడం కూడా మహనీయులు ఎక్కడ పుట్టినా, వారు ఏ ప్రాంతానికి చెందిన వారు అయినా యావద్భారతావనికి ఆరాధనీయులేనని చెప్పడానికే. కవిగా బసవేశ్వరుని సేవలను కూడా మోదీ ప్రశంసిస్తూ ఉంటారు. అలాగే తమిళ మహాకవి తిరుక్కురల్ రచనలను కూడా మోదీ ప్రస్తావిస్తూ ఉంటారు. నాగరికతలకు సంబంధించిన వివాదాల గురించి ప్రస్తావించినప్పుడు మోదీ తిరుక్కురల్ రచనలను ప్రస్తావిస్తారు. ఐక్యరాజ్య సమితిలో ఇచ్చిన ఉపన్యాసంలో కూడా ఆయన తిరుక్కురల్ రచనలను ఉటంకించారంటే దేశంలోని అన్ని భాషలకు గౌరవం ఉందన్న విషయాన్ని తెలియచెప్పడానికే.

చాలాచిత్రంగా, మోదీ చేస్తున్న ఈ ప్రయత్నాన్ని చాలామంది కుహనా మేధావులు, ఉదారవాదులు దేశాన్ని మధ్యయుగాలకు తీసుకువెళ్లే ప్రయత్నంగా చిత్రించడం చూస్తున్నాం. వర్తమాన కాలాన్ని సరిచేసే శక్తి మన గతానికి ఉంటుంది. చరిత్రకు ఆ శక్తి ఉన్నట్టే, నాగరికతకూ, సంస్కృతికీ కూడా ఆ శక్తి ఉంటుందన్న ఇంగిత జ్ఞానం ప్రతిపక్షాలకు లేదు. కారణం- పదవీ రాజకీయాలు. ఎన్నికల రాజకీయాలు కూడా. ఇక బుజ్జగింపు పేరుతో సాగుతున్న సెక్యులర్ రాజకీయాలు ఈ పార్టీలను సర్వ భ్రష్టం చేశాయి. చాలాసార్లు వీటికి దేశం మీద ఉన్న గౌరవమర్యాదలను శంకించవలసిన పరిస్థితి.

ఇంత ప్రచారం చేస్తున్నా, ఉత్తర భారత పౌరులుగాని, దక్షిణ భారత పౌరులుగాని మూకుమ్మడిగా ఘర్షణలకు దిగిన వాతావరణం లేదు. తమిళనాడులో హిందీకి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలు పూర్తిగా రాజకీయ పార్టీల సృష్టి. అందులో సామాన్య ప్రజల ప్రమేయం కనిపించదు. తమ పార్టీ ఉనికికి భంగం వాటిల్లిందన్న అనుమానం వస్తే డీఎంకే హిందీ, హిందూ వ్యతిరేక నినాదం అందుకుంటుంది. ఆఖరికి పక్కనున్న కర్ణాటకను కూడా రాజకీయం కోసం ఉపయోగించుకునే లక్షణం ద్రవిడ పార్టీలకు ఉంది. కావేరీ జల వివాదం ఇప్పటికీ తెగడం లేదు. బ్రిటిష్ ఇండియా పాలనా కాలంలో వచ్చిన ఈ విభేదాలు, దూరాలు స్వతంత్ర భారతదేశంలో తగ్గిపోవాలి. కానీ అవి తగ్గకుండా కాంగ్రెస్ శతథా పాటు పడుతూనే ఉంది.

చారిత్రకంగా, నాగరికత పరంగా ఉత్తర భారతదేశం విదేశీ దండయాత్రలకు గురైన చరిత్ర కలిగి ఉంది. అవి ఉత్తర భారతదేశ చరిత్రను కొంత గాయపరిచాయి కూడా. అయినా ఉత్తర భారతదేశం చాలా సాధించింది. తనదైన అస్తిత్వాన్ని నిలబెట్టుకుంది. సవాళ్లను ఎదుర్కొన్నది. ఆధ్యాత్మిక, విద్యా కేంద్రాలను కాపాడుకున్నది. వారణాసి, అయోధ్య, పాటలీపుత్ర, ఉజ్జయిని అలాంటివే. వంగదేశంలో పుట్టిన వివేకానందుడు కన్యాకుమారి వద్ద తపస్సు చేసి, దివ్యత్వం పొందారు. ఉత్తరయోగిగా ప్రసిద్ధుడై, పుదుచ్చేరిలో ఆశ్రమం ఏర్పాటు చేసుకున్న అరవింద్ ఘోష్ కూడా



రామేశ్వరం దేవాలయం



## పార్లమెంట్‌కు తమిళ సెంగోల్

నూతన పార్లమెంటు భవన ప్రారంభ సమయంలో 'సెంగోల్'ను లోక్‌సభ స్పీకర్ ఆసనం పక్కన ఉంచుతామంటూ భారత ప్రభుత్వం ప్రకటించినప్పుడు పలు పార్టీలకు చెందిన నాయకులు దానిని ఎంతగా రాజకీయం చేశారో మనందరం చూశాం. ధర్మానికి పర్యాయ తమిళ పదమైన 'సెమ్మయ్' నుంచి పుట్టిన 'సెంగోల్' అన్నది ఒక చారిత్రిక రాజదండం. బ్రిటిష్ పాలకుల నుంచి భారతీయులకు అధికారం మారిన సందర్భంగా ఆగస్టు 1947లో తమిళనాడుకు చెందిన 'ఆధీనం' దానిని తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు అందించడం, దానికి సంబంధించిన ఫోటోలు ఈ సందర్భంగానే బయిటకు వచ్చాయి. నిజానికి, దీని గురించి ప్రజలు మర్చిపోయారు. ఈ విషయాలు బయిటకు వచ్చిన తర్వాతే అలహాబాద్ మ్యూజియంలోని నెహ్రూ గ్యాలరీలో ఉంచిన సెంగోల్‌ను ఢిల్లీకి తరలించారు. తమిళ రాజులు ఈ రాజదండాలను సుపరిపాలన, న్యాయానికి సంకేతంగా ఉంచుకు నేవారంటూ తమిళ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ రాజవేలు వెల్లడించారు. దీని చరిత్ర తమిళనాడులోని చోళ వంశంనాటి కాలానిది. ఒక చక్రవర్తి నుంచి మరొక చక్రవర్తికి అధికారాన్ని బదిలీ చేస్తున్నప్పుడు దీనిని అందించేవారు. తమిళ ప్రాచీన రచన, 'తిరుక్కురల్' సెంగోల్ ప్రాముఖ్యతను ప్రశంసిస్తుంది. 'సెంగోనమెయ్' అన్న శీర్షికతో ఒక అధ్యాయమంతా దీనిని గురించి చర్చిందని ఎస్ రాజవేలు వివరించారు. అంతేకాదు, తమిళ ఇతిహాసమైన 'శిల్పతికారం' కూడా సెంగోల్ ప్రాముఖ్యతను వివరిస్తుంది. సెంగోల్‌ను పార్లమెంట్ భవనంలో ప్రతిష్ఠించడం భారత ఐక్యత కోసమేనని ఇప్పటికైనా కుహనా రాజకీయనాయకులు గుర్తిస్తారా?

వంగదేశీయుడే కదా! వీరందరి కంటే ఎంతో ముందే శంకర భగవత్పాదులు భారతభూమి నాలుగు మూలలా నాలుగు పీఠాలు, కంచిలో మరొక ముఖ్య మఠం స్థాపించారు. వీటి ఆంతర్యం గ్రహించవలసి ఉంటుంది. దీనినంతనీ ఆధ్యాత్మికవేత్తల వ్యవహారమంటూ గుర్తించడానికి నిరాకరిస్తే అదొక సామాజిక ద్రోహమే అవుతుంది. భారత స్వాతంత్ర్య పోరాటంలోని అంతస్సూత్రాన్ని అవమానించడమే అవుతుంది.

అధికారమే పరమావధిగా కాంగ్రెస్ పార్టీ మనుగడ సాగిస్తున్నది. ఒకే కుటుంబ పాలన ఇంకా ఈ దేశం మీద రుద్దాలన్నదే బీజేపీ వ్యతిరేకుల వ్యర్థ ప్రయత్నం. 2023 చివర జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ అధికారం కోల్పోయింది. దీనిని ప్రజా విజయంగా గౌరవించ కుండా అత్యంత హేయమైన రీతిలో గౌతమ్ ఆదానీ విజయంగా కాంగ్రెస్ అభివర్ణించింది. ఆదానీని అడ్డు పెట్టుకుని మోదీని అపఖ్యాతి పాలు చేయాలన్న ప్రతి ప్రయత్నం వ్యర్థమైంది. ఆఖరికి కోర్టులు కూడా ఆదానీ గురించి కాంగ్రెస్ చేస్తున్న వాదనలను అంగీకరించలేదు. అయినా ప్రజా విజయాన్నీ, అభిప్రాయాన్నీ కాంగ్రెస్ ఈ విధంగా అవమా నించింది. ఇది ప్రజాస్వామ్యాన్ని అవమానించడమో, మోదీని అవమానించడమో ప్రజలు గ్రహించవలసి ఉంటుంది. ఇక్కడ కూడా ఒక వాస్తవాన్ని గమనించడం దగ్గర కాంగ్రెస్ దారుణంగా విఫలమైంది. ఆదానీ వ్యవహారంలో అక్రమాలు లేవని కోర్టులు చెప్పాయి. అదే కాదు, ఆదానీ ఈ దేశం మొత్తం మీద అనేక సంస్థలు నడుపుతున్నారు. ఆయన పెట్టుబడులు అన్ని రాష్ట్రాలలోను ఉన్నాయి. కృష్ణపట్టణం (ఏపీ), కరైకాల్ నౌకాశ్రయం (పుదుచ్చేరి), కామరాజర్, కట్టుపల్లి నౌకాశ్రయాలు (తమిళనాడు), విజింజామ్ (కేరళ), వైజాగ్ టెర్మినల్‌లలో ఆయన పెట్టుబడులు ఉన్నాయి. ఈ రాష్ట్రాలలో ఎక్కువ చోట్ల కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండీ కూటమిలో సభ్యులదే పరిపాలన. అంటే కోర్టులు క్లీన్‌చిట్ ఇచ్చిన వ్యాపారవేత్త పెట్టుబడులను కూడా వీరు నిరాకరిస్తారా? ఆదానీతో ముడిపెట్టి బీజేపీ వ్యతిరేక ప్రచారం చేయడం ఒక్కటే కాదు. ఛత్తీస్‌గఢ్ ఫలితం విషయంలోనే కాంగ్రెస్ ఓటర్లను ఇంకా దారుణంగానే అవమానించింది. ఓటర్లు ఫాసిజాన్ని బుజ్జగిస్తున్నారని కూడా కాంగ్రెస్ నుంచి వ్యాఖ్యలు వినిపించాయి.


సోమనాథ్ మందిరం..
హిందువుల ఆత్మగౌరవాలయం

తమిళనాడులో అన్నామలై (రాష్ట్ర అధ్యక్షుడు, బీజేపీ) ద్రవిడవాదపు మంచుకోటను కరిగిస్తున్న మాట నిజం. అది కుటుంబ పార్టీ డీఎంకెకు దడ పుట్టిస్తున్న మాట కూడా నిజమే. అందులో భాగమే సనాతన ధర్మాన్ని నిర్మూలించాలన్న అత్యంత నీచపు వ్యాఖ్య. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కుమారుడు ఉదయనిధి స్టాలిన్ అక్కడ, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ తమ్ముడు అక్బరుద్దీన్ ముస్లిం మతోన్మాద భాషతో తెలంగాణలోను అవే వ్యాఖ్యలను పలికారు. ఉత్తరాది రాష్ట్రాలను గోమూత్ర రాష్ట్రాలు అని సాక్షాత్తు పార్లమెంట్ సాక్షిగా కూసినవాడు కూడా డీఎంకే సభ్యుడే. కానీ ద్రవిడ రాజకీయంతో, సనాతన ధర్మ వ్యతిరేకతతో సాగుతున్న తమిళనాడులో గోవు పూజనీయం కాదా? సనాతన ధర్మం లేదా? హిందుధర్మం మీద కత్తి కట్టిన కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకలలో సనాతన ధర్మ ఆచరణ ఉనికే లేదని చెబుతారా? కానీ హిందువులు గొంతు విప్పరు. విప్పినా మీడియాకు పట్టదు. బాబా సాహెబ్ అంబేద్కర్ సహా పెద్దలంతా ఆర్యద్రావిడ సిద్ధాంతాన్ని ఎప్పుడో నిరాకరించారు. ఆ వాస్తవాన్ని గమనించకుండా ఈ పార్టీలు మాట్లాడుతున్నాయి. కానీ మోదీ ఈ వాతావరణం నుంచి దేశాన్ని విముక్తం చేయాలని భావిస్తున్నారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ నినాదం అందుకు సంబంధించినదే. ఇది మోదీ చేస్తున్నందువల్ల గొప్పది కాదు. ఎన్నికల రాజకీయం అసలే కాదు.

భారత్ అంతా ఒక్కటే. ఉత్తర భారతం, దక్షిణ భారతం అన్న విభజనే ప్రమాదకర ప్రహసనం. దానిని రుజువు చేసిన వారు ఎవరైనా గౌరవనీయులే. ఐక్య భారత్ భ్రమ కాదు. అదొక చారిత్రక అవసరం. ఉత్తర దక్షిణ భారతాల ఆలోచన బయటపెడుతున్న వాళ్లు, 1947 నాటి విభజన ఆచరణలో ఎంత పెను ఉత్పాతం సృష్టించిందో గుర్తుకు తెచ్చుకోవడం అవసరం. కానీ ఈసారి అలాంటి పప్పులు ఉడకక పోవచ్చు. అది కూడా ఈ నయా వేర్పాటువాదులు గుర్తిస్తే మంచిది.

**– జాగృతి డెస్క్**


తిరుమల..
భారతీయులందరికి
పవిత్రక్షేత్రం

# బంగ్లా: పాత నాయకత్వంతో కొత్త ప్రయాణం

**'భారత్ మాకు మిత్రదేశం. ఇరుగుపొరుగు దేశాలయిన భారత్-బంగ్లాదేశ్ కలిసి ఎన్నో సమస్యలను పరిష్కరించుకున్నాయి. 1971, 75లలో భారత్ మాకు అండగా ఉంది. నాకు, సోదరికి, కుటుంబ సభ్యులకు ఆశ్రయం ఇచ్చింది. భారత్‌తో మాకు అద్భుత సంబంధాలు ఉన్నాయి'. (ఎన్నికలలో విజయం సాధించిన అనంతరం షేక్ హసీనా వ్యాఖ్య)**


బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో అధికార అవామీ లీగ్ పార్టీ మూడింట రెండొంతుల స్థానాలను కైవసం చేసుకుని మరోసారి విజయం సాధించింది. 76 ఏళ్ల షేక్ హసీనా మరోసారి ప్రధాని పీఠాన్ని అధిష్టించనున్నారు. బంగ్లాదేశ్ పార్లమెంటు 300 సీట్లలో 299 స్థానాలకు జరిగిన ఎన్నికలలో అవామీ లీగ్ 223 సీట్లను కైవసం చేసుకుంది. ప్రధాన ప్రతి పక్షమైన జతియా 11 సీట్లు గెలుచుకుంది. బంగ్లాదేశ్ కల్యాణ్ పార్టీ కేవలం ఒక్క స్థానంలో గెలుపొందింది. 62 స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు జయకేతనం ఎగురవేశారు. అలాగే జతియా సమాజ్ తాంత్రిక్ దళ్, వర్కర్ పార్టీ ఆఫ్ బంగ్లాదేశ్ ఒక్కో స్థానం వంతున గెలుచుకున్నాయి. గోపాల్ గంజ్ 3 నుంచి పోటీ చేసిన అవామీ లీగ్ అధినేత ప్రధాని హసీనా 2,49,965ఓట్లను సాధించారు. తన సమీప ప్రత్యర్థి బంగ్లాదేశ్ సుప్రీంపార్టీకి చెందిన నిజాముద్దీన్ లష్కర్‌కు కేవలం 469 ఓట్లు లభించాయి. 1986 నుంచి ఈ స్థానంలో షేక్ హసీనా ఎనిమిదోసారి గెలవటం గమనార్హం.

హసీనా 2009 నుంచి ప్రధానిగా కొనసాగు తున్నారు. ఇప్పుడు వరుసగా నాలుగోసారి బాధ్యతలు స్వీకరిస్తున్నారు. మొత్తంగా ఆమె ప్రధాని కావటం ఇది ఐదోసారి. బంగ్లా చరిత్రలో అత్యధిక కాలం పనిచేసిన ప్రధానిగా రికార్డు సృష్టించబోతున్నారు. మాజీ ప్రధాని ఖలీదా జియా నేతృత్వంలోని బంగ్లా దేశ్ నేషనలిస్టు పార్టీతో పాటు మరో 15 పార్టీలు ఈ సారి ఎన్నికలకు దూరంగా ఉన్నాయి. కేవలం 41.8 శాతం పోలింగ్ నమోదైంది. 2018 ఎన్నికల్లో 80 శాతానికి పైగా పోలింగ్ నమోదయ్యింది.

నరేంద్ర మోదీ, షేక్ హసీనా ఇద్దరు భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను 'సోనాలి అధ్యాయ్' లేదా ఒక స్వర్ణ అధ్యాయం అని పేర్కొంటారు. గత కొన్ని దశాబ్దాలుగా ఈ రెండు పొరుగు దేశాల మధ్య వేర్వేరు రంగాల్లో సహకారం పెరుగుతూ వస్తోంది. వాణిజ్యం నుంచి వ్యూహాత్మక భాగస్వామ్యం వరకూ అనుసంధానం, శక్తి సరఫరా వరకూ ఉన్నాయి. బంగ్లాదేశ్ భారతదేశానికి చాలా కీలకమైనది. భారతదేశం 'నైబర్ హుడ్ ఫస్ట్ పాలసీ'కి అది కేంద్రంగా ఉంది. అలాగే భారతదేశం, ఆగ్నేయాసియాల మధ్య సంబంధాలను సుస్థిరం చేయటానికి మోదీ ప్రభుత్వం ఉద్దేశించిన 'యాక్ట్ ఈస్ట్ పాలసీ'కి బంగ్లాదేశ్ కీలకం. అది కాకుండా ఈశాన్య ప్రాంత భద్రత, ఆగ్నేయాసియాకు వంతెన, కమ్యూనికేషన్, సముద్రజలాలను భద్రపరచటం, తీవ్రవాదంపై పోరాటం, దృఢమైన చైనాను సమ తుల్యం చేయటం వంటి అంశాలలో భౌగోళికంగా బంగ్లాదేశ్ భారత్‌కు ముఖ్య భాగస్వామి అవుతుంది.

బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ప్రకటించిన నాటి నుంచి నేటి వరకూ రెండు దేశాల మధ్య సంబంధాలు ఒకే రకంగా లేవు. అవి ఉత్థాన పతనాలతో సాగాయి. మార్చి 26, 1971న బంగ్లాదేశ్‌ను స్వతంత్ర దేశంగా ప్రకటించారు. పాకిస్తాన్‌నుంచి అది విముక్తి పొందేందుకు దాదాపు 9 నెలలు పట్టింది. డిసెంబరు 1971లో బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం ముగిసింది. దాన్ని స్వతంత్ర దేశంగా గుర్తించి దౌత్య సంబంధా లను ఏర్పరచుకున్న తొలిదేశం భారత్. బంగ్లాదేశ్ యుద్ధంలో భారతదేశం పాత్ర ముఖ్యమైంది. 1972లో భారత్, బంగ్లాదేశ్‌లు స్నేహ, సహకార ఒప్పందంపై సంతకం చేశాయి. 1997లో దీని గడువు ముగిసింది. కొత్త దేశం నేత ముజిబూర్ రెహ్మాన్ సోషలిజం, లౌకికవాదం ఆదర్శభావాలను సమర్థించారు. భారత్‌తో సత్సంబంధాలు ఉండాలని ఆశించారు. 1975లో ముజిబూర్ రెహ్మాన్ తిరుగు బాటుదారుల చేతిలో హత్యకు గురయ్యారు. దీనితో ఆయన కుమార్తెలు షేక్ హసీనా, రిహానా తమ కుటుంబ సభ్యులతో కలిసి 1991 వరకూ భారత్‌లో ఆశ్రయం పొందారు. సైన్యం, పౌర సమాజంలోని వివాదాలు, యూఎస్, పాకిస్తాన్, సౌదీ అరేబియా, చైనాల మద్దతుతో తిరుగుబాటు వచ్చింది. జనరల్ జియా-ఉర్-రెహ్మాన్ బంగ్లాదేశ్ ముస్లిం గుర్తింపును నొక్కి చెప్పి అధికారంలోకి వచ్చారు. ఇస్లాం మతం రాష్ట్ర మతంగా ప్రకటించారు. దీనితో భారతదేశంతో ఢాకా సంబంధాల్లో మార్పువచ్చింది. మిత్రదేశ స్థానాన్ని అది కోల్పోయింది. ఈ సమయంలో పాకిస్తాన్ వంటి ఇస్లాం శక్తులతోనూ, అమెరికా, చైనా వంటి పెద్ద దేశాలతో సంబంధాలు మెరుగు పడ్డాయి. 1970ల్లో వచ్చిన తుపాను,కరవు, అంతర్గత అంశాలు బంగ్లాదేశ్‌ను విదేశీ సాయంపై ఆధారపడేలా చేశాయి. 1990 నాటికి బంగ్లాదేశ్ విదేశాంగ విధానంలో విదేశీ సాయం అనేది ప్రముఖంగా ఉండిపోయింది. భారత్ వివిధ రకాల సాయం అందించినా, బంగ్లాదేశ్ ప్రముఖ దాతల సూచికలో లేదు. సౌదీ అరేబియా లాంటి దేశాలు అందించే సాయం ఇస్లామిక్ కారణాలతో ముడిపడి ఉండేవి. ముజీబ్ అనంతరం పాలకులకు ఇస్లాం ప్రాథమిక జాతీయ గుర్తింపుగా, సమీకరణ శక్తిగా మారింది.

పాకిస్తాన్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కో ఆపరేషన్‌తో బంగ్లాదేశ్ సంబంధాలు పునరుద్ధ రించు కుంది. భారతదేశంతో క్షీణించిన సంబంధాల



**డాక్టర్ పార్థసారథి చిరువోలు**
సీనియర్ జర్నలిస్ట్

పునరుద్ధరణకు అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ దశలో ఫరక్కా బ్యారేజీ వివాదం సంచలనం సృష్టించింది. బంగ్లాదేశ్ సరిహద్దుకు 11 మైళ్ల దూరంలో పశ్చిమబెంగాల్ లోని పరక్కాలో గంగానదిపై భారత్ ఆనకట్ట నిర్మించింది. 1976-77లో ఆ దేశంతో అధికారిక ఒప్పందం లేకుండానే డ్యామ్ నిర్మించటం ప్రారంభించింది. హుగ్లీ నదిని సిల్ట్ చేయడానికి, ఓడరేవును వినియోగించటానికి బ్యారేజీ అవసరం అని భావించింది. దీనితో గంగానదిలో న్యాయమైన వాటా కోసం బంగ్లాదేశ్ భారత్‌ను డిమాండ్ చేసింది.



షేక్ హసీనా, నరేంద్ర మోదీ

జియా-ఉర్-రెహ్మాన్ సార్క్ (సౌత్ ఏషియన్ అసోసియేషన్ ఫర్ రీజనల్ కోఆపరేషన్) ఆలోచనను ప్రతిపాదించారు. దక్షిణా సియాలోని చిన్నదేశాల న్నింటిని ఏకం చేయాలని ప్రతిపాదించారు. 1981లో జియా-ఉర్-రెహ్మాన్ హత్య, మరో తిరుగుబాటు కారణంగా ఆ ఆలోచన కార్యరూపం దాల్చలేదు. జియాఉర్ రహ్మాన్ హత్యానంతరం బంగ్లాదేశ్ వ్యవసాయ సమాజం నుంచి తయారీ కేంద్రంగా మారటం ప్రారంభించింది. భారతదేశంలో విదేశీ అప్పులు పేరుకు పోవటం, చెల్లింపుల బ్యాలెన్స్ సంక్షోభానికి దారితీసింది. దీనితో రెండు దేశాలకు సార్క్ అనేది ప్రయోజనకరమైన ఆలోచనగా మారింది. 1985లో సార్క్ 8 సభ్యదేశాలతో ఉనికి లోకి వచ్చింది. ఇండో బంగ్లా సంబంధాలలో సాను కూలమైన మార్పు వచ్చింది. 1991లో బంగ్లాదేశ్ బహుళ పార్టీ ప్రజాస్వామ్యానికి తిరిగి వచ్చింది. బంగ్లాదేశ్‌లో రెండు ప్రధాన పార్టీలు న్నాయి. బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్ పీ), అవామీ లీగ్ (ఏఎల్). బెంగాలీ జాతీయవాదం, ఇస్లామిక్ గుర్తింపును ప్రవచించే ఖలీదా జియా (జియా-ఉర్-రెహ్మాన్ భార్య) బీఎన్ పీకి నాయకత్వం వహించేవారు. ఈమె భారత దేశంవైపు మొగ్గు చూపేవారు కాదు. మరో వైపు అవామీ లీగ్‌కు చెందిన షేక్ హసీనా(ముజిబుర్ రెహ్మాన్ కుమార్తె) భారత్‌తో సానుకూల సంబంధాలు కలిగి ఉన్నారు. అవామీ లీగ్ ఉన్నప్పుడల్లా భారత్, బంగ్లా సంబంధాలు తరచూ మెరుగుపడుతూ వచ్చాయి. 1991లో బీఎన్‌పీ అధికారంలోకి వస్తే, 1996-2001 మధ్య షేక్ హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ అధికారంలోకి వచ్చింది. ఈ సమయంలోనే గంగానదిపై నీటి పంపిణీపై ఒప్పందం కుదిరింది. దేశం ఆర్థికంగా సాయం చేయటానికి బంగ్లాదేశ్‌కు భారతదేశం సుంకం రాయితీలను ఇచ్చింది. 2001-2006 మధ్య సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. బీఎన్పీ-జేఈఎల్ (జమాయితీ ఇస్లామీ) నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటయింది. ఇది ఉల్ఫా (యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ అసోసియేషన్ ) వంటి సంస్థలకు ఆశ్రయం కల్పించటమే కాదు, బంగ్లాదేశ్ వెలుపల అనేక భారత వ్యతిరేకశక్తులకు ప్రోత్సాహాన్ని అందించింది. లెట్, హుజ్జీ వంటి తీవ్రవాద గ్రూపులు బంగ్లాలో స్థావరాలను ఏర్పరచుకున్నాయి. అల్ కాయిదా, దాని మిత్రపక్షాలు భారత వ్యతిరేక జిహాద్‌కు బంగ్లా తన గడ్డమీద మద్దతు ఇచ్చింది. దీనితో ఈ కాలంలో సంబంధాలు క్షీణించాయి. 2009లో తిరిగి అవామీలీగ్ అధికారంలో రావటం, 2014, 2019లో దానివరస విజయాలతో భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య సంబంధాల్లో కొత్త దశ ప్రారంభ మైంది. అప్పటి నుంచి ఇండో-బంగ్లా సంబంధాల్లో స్థిరమైన మెరుగుదల ఉంది. ఈ దశలో రెండు దేశాలు పొరుగుదేశాల నుంచి వృద్ధి, ఆర్థిక సంబంధాల్లో భాగస్వాములుగా మారాయి.

యూపీఏ2 హయంలో రెండు దేశాల భూ సరిహద్దు ఒప్పందం, తీస్తా నీటి భాగస్వామ్య ఒప్పందానికి అంగీకరించాయి. అయితే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అభ్యంతరం వ్యక్తం చేయటంతో ఈ ఒప్పందాన్ని సమర్థించలేక పోయాయి. మిలిటెంట్లు, తీవ్రవాద గ్రూపులను ఎదుర్కోవటంలో భారత్, బంగ్లాలు సమన్వయంతో పని చేశాయి. 2013లో నేరస్తుల అప్పగింత ఒప్పందంపై సంతకం చేసి, బంగ్లాదేశ్ అనేక మంది ఉగ్రవాదులను భారత్ కు పంపింది.

2015లో ఇరుదేశాల మధ్య భూసరిహద్దు ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం రెండు దేశాల మధ్య అనేక వివాదాలను పరిష్కరించుకునేందుకు దోహదం చేసింది. రాడ్ క్లిఫ్ ఒప్పందం ప్రకారం, బంగ్లాదేశ్ (15వేల హెక్టార్లు) వైపున భారత్ 111 ఎన్ క్లేవ్‌లను కలిగి ఉండగా, బంగ్లాదేశ్ భారత వైపును (ఏడు వేల హెక్టార్లు) 55 ఎన్ క్లేవ్ లను కలిగి ఉంది. ఈ సమస్య 100వ రాజ్యాంగ సవరణ (2015) ద్వారా పరిష్కరించారు. ఇరువైపులా శంకుస్థాపనలు జరిగాయి. పౌరులకు వారి జాతీయతను నిలుపుకోవటానికి లేదా కొత్తదనాన్ని పొందేందుకు అవకాశం ఏర్పడింది.

మోదీ ప్రభుత్వ హయాంలో భారత్, బంగ్లా సంబంధాలు మరింత మెరుగుపడ్డాయి. బంగ్లాదేశ్ దక్షిణాసియాలో భారత్‌కు అతి పెద్ద భాగస్వామి అయితే, భారతదేశం బంగ్లాదేశ్‌కు రెండో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. 2023 ఆర్థిక సంవత్సరంలో రెండు దేశాల మధ్య వాణిజ్యం 14.22 బిలియన్ డాలర్లకు చేరుకుంది. భారతదేశం 2011 నుంచి సౌత్ ఏషియన్ ఫ్రీ ట్రేడ్ ఏరియా (సాఫ్టా) కింద పొగాకు, ఆల్కహాల్ మినహా అన్ని వస్తువులపై బంగ్లాదేశ్‌కు డ్యూటీ ఫ్రీ యాక్సెస్‌ను అందించింది.

ఏప్రిల్ 2023లో, ద్వైపాక్షిక వాణిజ్య లావా దేవీలలో కొంత భాగాన్ని వారి సొంత కరెన్సీలలో సెటిల్ చేయటానికి రెండు దేశాలు అంగీకరించాయి. రెండు దేశాల మధ్య వాణిజ్య భాగస్వామ్యాన్ని గణనీయంగా పెంపొందించేందుకు సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ)పై సంతకం చేసేందుకు రెండు దేశాలు సిద్ధమవుతున్నాయి. దీనితో రెండు దేశాల్లోనూ ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయి. రెండు దేశాల మధ్య భారీ వాణిజ్య అసమానత, నాన్ టారిఫ్ అడ్డంకుల సమస్య, వస్తు వులు సజావుగా రాకపోకలకు మౌలిక సదుపాయాలు లోపించటం వంటి కొన్ని సమస్యలు ఉన్నాయి.

భారత్, బంగ్లాదేశ్ ఇంధన రంగంలో పరస్పరం సహకరించుకుంటున్నాయి. ప్రస్తుతం బంగ్లాదేశ్ భారతదేశం నుంచి 116ఎంవి ఇంధనాన్ని దిగుమతి

చేసుకుంటోంది. సరిహద్దులో విద్యుత్ వాణిజ్యంలో ద్వైపాక్షిక సహకారాన్ని అందించటానికి సంస్థాగత ఫ్రేమ్‌వర్క్‌ను అందించటానికి జాయింట్ వర్కింగ్ గ్రూపు (జెడబ్ల్యుజి), జాయింట్ స్టీరింగ్ కమిటీ (జెఎస్ సీ) ఏర్పాటయింది. భారత్ బంగ్లాదేశ్ సంబంధాల్లో పర్యాటకం ఒక పెద్ద అంశం. ముఖ్యంగా మెడికల్ టూరిజం. బంగ్లాదేశ్ నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు వైద్య చికిత్స కోసం భారత దేశానికి వస్తారు. భారతదేశంలో అంతర్జాతీయ వైద్యా విద్యార్థులలో 35 శాతం మంది కంటే ఎక్కువ బంగ్లాదేశ్‌కు చెందినవారు. భారతదేశం, బంగ్లాలు సార్క్, బిమ్‌స్టిక్, అయోరా (ఐఓఆర్ఏ–ఇండియన్ ఓషన్ రిమ్ అసోసియేషన్) వంటి సంస్థల్లో భాగస్వాములు. కొవిడ్ సమయంలో దక్షిణాసియా ప్రాంతంలో ప్రపంచ మహమ్మారి ప్రభావాలను ఎదుర్కోవటానికి సార్క్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ ఫండ్‌ను ఏర్పాటు చేయటంలో రెండు దేశాలు సంఘీభావం తెలిపాయి. ప్రపంచ వేదికలపైన కూడా సంఘీభావాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ వేసే బిడ్‌కు బంగ్లాదేశ్ మద్దతు ఇస్తుంది. అలాగే ఎడీజీలను సాధించటంలో రెండు దేశాలు కలిసి పనిచేస్తున్నాయి.

ఇకపోతే కనెక్టివిటీ.. రెండు దేశాలను కలుపుతూ హల్దాబారి–చిలాహుతి రైలు లింక్ 2020 నుంచి పనిచేస్తోంది. అంతకు ముందు మైత్రీ ఎక్స్‌ప్రెస్, మిథాలీ ఎక్స్‌ప్రెస్ వంటివి రెండు దేశాల మధ్య నడుస్తున్నాయి. కొల్‌కతా–ఢాకా బస్సు (1999), ఢాకా–అగర్తాలా బస్సు (2001) రెండు దేశాల మధ్య ప్రధాన రహదారి లింకు. భారతదేశం ఈశాన్య ప్రాంతాలకు బంగ్లాదేశ్ ఓడ రేవులను ఉపయోగిస్తుంది. బంగ్లాదేశ్ కూడా ఓడరేవుల ద్వారా వచ్చే ట్రాఫిక్ వల్ల ప్రయోజనం పొందుతుంది.

**బంగ్లాతో కొన్ని చిక్కు సమస్యలు**

2009 నుంచి భారత్, బంగ్లాదేశ్ సంబంధాలు అభివృద్ధి చెందుతున్నప్పటికీ, ఈ స్నేహపూర్వక సంబంధాలకు సవాలుగా నిలిచే సమస్యలు కొన్ని ఉన్నాయి. వీటిలో భూమి, సరిహద్దుల విభజన, భారత వ్యతిరేక తిరుగుబాటు ముఠాలకు ఆశ్రయం, అక్రమ వలసలు, నీటి భాగస్వామ్యం, మానవ అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వాణిజ్య సమతుల్యత, రవాణా హక్కులు, చైనా అంశం ప్రధానమైనవి.

బంగ్లాదేశ్ నుంచి శరణార్థులతో పాటు ఆర్థిక వలసదారులతో సహా పెద్ద సంఖ్యలో జనం భారత్‌లోకి అక్రమంగా ప్రవేశిస్తున్నారు. ఇది భారత్‌లో, ముఖ్యంగా బంగ్లా సరిహద్దులో ఉన్న ఈశాన్య రాష్ట్రాలలో ఉన్న సమూహాల వనరులు, భద్రత, సంస్కృతికి హాని చేస్తోంది. అసోంలో నేషనల్ రిజిస్ట్రేషన్ ఆఫ్ సిటిజన్ షిఫ్ (ఎన్‌ఆర్‌సీ) నిర్వహించాలని ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలు బంగ్లాదేశ్ లో ఆందోళనకు దారితీసింది. రొహింగ్యా సమస్యను మరింత జటిలం చేసింది. సరిహద్దు దాటి డ్రగ్స్ స్మగ్లింగ్, మానవ అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. వీటిని అరికట్టటానికి జాయింట్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు, స్మార్ట్ సరిహద్దు నిర్వహణ అమలు చేయటం, డిజిటల్ కనెక్టివిటీ కారిడార్‌ను ఏర్పాటు చేయటం వంటి కొన్ని చర్యలు చేపట్టాలి. అలాగే తీస్తా నీటి వివాదం భారతదేశం – బంగ్లాదేశ్ సత్సంబంధాలకు అవరోధంగా ఉంది. తీస్తా హిమాలయంలో పుట్టి, సిక్కిం, పశ్చిమబెంగాల్ మీదుగా ప్రవహించి బంగ్లాదేశ్ లోని బ్రహ్మపుత్ర (జమున)లో కలుస్తుంది. బంగ్లాదేశ్ 1996 గంగా జలాల ఒప్పందం ప్రకారం నదీజలాల సమాన పంపిణీ కోరగా, పశ్చిమబెంగాల్ ప్రభుత్వ ఒప్పందాల కారణంగా పరిష్కారం కాలేదు. తీస్తాతో బాటు ఫెని, బరాక్ నదిపై కూడా చర్చలు సాగుతున్నాయి. షేక్ హసీనా మరోమారు బాధ్యతలు చేపడుతూండంతో ఈ సమస్యలన్నీ కొలిక్కివచ్చే అవకాశం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

★



**అమరావతి రాజధాని కేసు విచారణను సుప్రీంకోర్టు ఏప్రిల్‌కు వాయిదా వేయడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతానికి వైసీపీ ప్రభుత్వంలో మూడు రాజధానుల బెడద, విశాఖకు సీఎం క్యాంపు కార్యాలయం తరలింపు ప్రక్రియ ఆగినట్లేనని అధికార పార్టీ నేతలు, అధికారులు పేర్కొంటున్నారు. త్వరలో సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కూడా విశాఖకు తరలివెళ్లే సాహసం చేసే అవకాశం లేదు. మొత్తానికి వైసీపీ ప్రభుత్వ మూడు రాజధానుల నిర్ణయం నినాదానికే పరిమితమయ్యే పరిస్థితి ఏర్పడింది. దీంతో పాటు ఆర్ 5 జోన్ కేసు విచారణను కూడా సుప్రీం కోర్టు ఏప్రిల్‌కు వాయిదా వేయడంతో రాజధాని ప్రాంతంలో 2024 ఎన్నికల్లో విజయం సాధించాలనే వైసీపీ ఆలోచనకు తెరపడింది.**



రాజధాని అమరావతి నిర్మాణానికి 29 గ్రామాల పరిధిలోని 34,322 ఎకరాల భూములను 29,881 మంది రైతులు భూ సమీకరణ కింద ఇచ్చారు. వారిలో చిన్న, సన్నకారు రైతులే ఎక్కువ. ఎకరంలోపు భూమి ఉన్నవారు 20 వేల మంది, 5 ఎకరాలలోపు వారు 8,500మంది ఉన్నారు. రాజధాని నిర్మాణంతో తమ బతుకులు బాగుపడతాయన్న ఆశతో వారు ఎదురు చూస్తున్నారు. కానీ, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం తమను ఊహించని విధంగా మోసం చేసిందని అంటున్నారు. 2019 డిసెంబరు 17న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శాసన సభలో చేసిన 'మూడు రాజధానుల' ప్రకటన ఆ ప్రాంతవాసులను కుదిపేసింది. ఆ మర్నాడే రాజధాని ఉద్యమం ఊపిరి పోసుకుంది. తుళ్లూరు, మందడం, కృష్ణాయపాలెం, ఎర్రబాలెం గ్రామాల్లో మొదలైన ఉద్యమం క్రమంగా రాజధాని గ్రామాలకు విస్తరించింది.

మూడవనాడు (19వ తేదీన) రైతులు బంద్ నిర్వహించారు. వారికి మద్దతుగా గుంటూరు, విజయవాడతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. వారి ఉద్యమానికి అధికారపక్షం మినహా పార్టీలన్నీ సంఘీభావం ప్రకటించాయి. ఆయా పార్టీల నాయకులు రాజధాని గ్రామాల్లో పర్యటించి రైతులకు మద్దతు తెలిపారు.

**ప్రభుత్వంపై సమరశంఖం**

రాజధాని కోసం వేలాది ఎకరాలు తృణప్రాయంగా ఇచ్చిన రైతులు తమను వైసీపీ ప్రభుత్వం తమను నమ్మించి నట్టేట ముంచిందని విమర్శిస్తూ ప్రభుత్వంపై సమరశంఖం పూరించారు. అనతి కాలంలోనే రాజధాని సమరం రాష్ట్ర ప్రజలందరి ఉద్యమంగా మారింది. రాజధాని రైతులు, మహిళలు, రైతుకూలీలు, దళిత బహుజన వర్గాలు ఏకమై మొక్కవోని దీక్షతో ఉద్యమాన్ని ఉరకలెత్తించాయి. పోలీసుల నిర్బంధాలు, కవాతులు, లాఠీల కరాళ నృత్యాలు, రక్తమోడుతున్న గాయాలు.. ఇవేవీ పోరాట పటిమను దెబ్బతీయలేకపోయాయి. అందుకే ఈ మహా ఉద్యమం

టిఎన్. భూషణ్

# మూడు రాజధానులు ఇక నినాదమే...!

దేశ చరిత్రలో సుదీర్ఘ సమరశీల పోరాటంగా నిలిచి పోయింది. మూడు రాజధానుల ప్రకటన వెల్లడై నప్పటి నుంచి ఆర్ జోన్-5 ఏర్పాటు, అందులో ఇళ్ల నిర్మాణం వరకు వైసీపీ ప్రభుత్వం అమరావతిపై చేయని కుట్ర లేదని రైతులంటున్నారు. ప్రజా రాజధానిపై పగబట్టిన ప్రభుత్వం.. ఉద్యమ గళాలను అణిచేయడానికి చేయని ప్రయత్నమూ లేదు. తాము స్నానంచేసే సమయంలో ప్రభుత్వం డ్రోన్ కెమేరాలు తిప్పినట్లు ఆరోపిస్తూ మహిళలు తీవ్రంగా తప్పు పట్టారు. ఈ దుశ్చర్యలను అడ్డుకున్న 40 మందిపై కేసులు పెట్టి 20 రోజులపాటు జైలుపాలు చేశారు. ఎస్సీ, ఎస్టీ రైతులపైనే ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టి నాలుగేళ్ల ఉద్యమ క్రమంలో 2000 మందిపై 600కు పైగా కేసులు బనాయించారు. మరోవైపు అమరా వతిపై బెంగతో గడిచిన నాలుగేళ్లలో 240 మంది రైతులు గుండెలు పగిలి చనిపోయారు. దీక్షా శిబి రాలు, దేవస్థానాలు, న్యాయస్థానాలే పోరాట వేదికలుగా నాలుగేళ్లపాటు సాగిన ఉద్యమంలో మరిచిపోలేని విజయాలను రైతులు సొంతం చేసు కున్నారు. పలు సందర్భాల్లో న్యాయస్థానాల్లో ఎదురైన అనూహ్య ఓటములను సైతం విజయ సోపానాలుగా మలుచుకున్న రైతు ఉద్యమం తాజాగా ఆర్-5 జోన్‌లో ఇళ్ల నిర్మాణాన్ని నిలువరించి మరో విజయాన్ని నమోదు చేసింది.

**హై కోర్టు చరిత్రాత్మక తీర్పు**

అమరావతి వ్యవహారంపై మార్చి 4, 2023న హైకోర్టు చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. మూడు రాజధానుల చట్టాన్ని కొట్టివేస్తూ అమరావతిని అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. రైతులకు ఇవ్వాల్సిన ప్లాట్లను అభివృద్ధిచేసి మూడు నెలల్లోగా ఇవ్వాలని, ఆరు నెలల్లోగా రాజధానిలో మౌలిక సదుపాయాల కల్పన పూర్తిచేయాలని సూచించింది. కానీ ప్రభుత్వం మాత్రం పట్టించుకో లేదు. తీర్పు వచ్చిన 8నెలల వరకు మౌనంగా ఉన్న ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయిం చింది. కాని విశాఖపై మాత్రం ఆశను చంపుకోలేదు. వచ్చే సాధారణ ఎన్నికల్లోపు ఎలాగైనా విశాఖకు తరలివెళ్లి తమ పంతం నెగ్గించుకోవాలని మరో ప్రయత్నం చేసింది. ఉత్తరాంధ్ర అభివృద్ధి పేరుతో తరచూ సమీక్షలు నిర్వహించాల్సి ఉంటుందనే నెపంతో, సీఎం క్యాంపు కార్యాలయం, మరికొన్ని ముఖ్యమైన ప్రభుత్వ శాఖల కార్యాలయాలు తరలించేందుకు ప్రణాళిక రచించారు. ముఖ్యమంత్రి రాష్ట్రంలో ఎక్కడ నుంచైనా సమీక్షలు నిర్వహించే వెసులుబాటు ఉన్నందున, ఆ కారణంతో విశాఖకు వెళ్లాలని ప్లాన్ చేశారు. ఇందుకోసం విశాఖలో కార్యాలయాల ఏర్పాటుకు భవనాలను కూడా గుర్తించారు. 2023 ఏడాది దసరా నాటికి విశాఖకు తరలివెళ్లేందుకు గట్టి ప్రయత్నమే చేశారు. కానీ రైతులు మళ్లీ కోర్టును ఆశ్రయించడంతో తరలింపు ప్రక్రియ వాయిదా పడుతూ వచ్చింది. ఈలోగా కార్యాలయాల తరలింపు ప్రక్రియను ఆపాలని హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశించడంతో వైసీపీ సర్కార్‌కు మరలా ఎదురుదెబ్బ తగిలింది. ఇక సుప్రీంపై చివరి ఆశలు పెట్టుకోగా, అక్కడ కూడా కేసు విచారణ ఏకంగా ఏప్రిల్ నెలకు వాయిదా పడింది. దీంతో వైసీపీ ప్రభుత్వ మూడు రాజధానుల కల కలగానే మిగిలిపోయే పరిస్థితి ఏర్పడింది. ఈలోగా సాధారణ ఎన్నికలు ముగియ నున్నాయి. ఈసారి మూడు రాజధానుల పేరుతో వైసీపీ, అమరావతి రాజధాని పేరుతో టీడీపీ, మిగిలిన రాజకీయపక్షాలు ప్రజల తీర్పు కోరను న్నాయి. వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడితే ఇక మూడు రాజధానులు శాశ్వతంగా అటకెక్కినట్టే.

**ఆర్ -5 జోన్ గతీ అంతే**

రాజధాని ప్రాంతంలో ఆర్-5 జోన్ వ్యవహారంలో జగన్ సర్కార్‌కు సుప్రీంకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. ఆర్-5 జోన్ ఏర్పాటుపై దాఖలైన పిటిషన విచారణను ఏప్రిల్‌కు వాయిదా వేస్తూ ఆదేశాలిచ్చింది. రాజధానేతర ప్రాంత వాసులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం అమరావతిలో ఆర్-5 జోన్ ఏర్పాటు చేసింది. రాజధాని అమరావతిలో ఆర్-5 జోన్‌కి సంబంధించి సీఆర్డీఏ చట్టాన్ని సవరించి యాక్ట్ 13/2022, జీవో 45ని తీసు కొచ్చారు. మొత్తం 1402 ఎకరాలను గుంటూరు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్లకు బదిలీ చేస్తూ ఇచ్చిన జీవోలు, ఇళ్ల నిర్మాణ ప్రక్రియ మొదలు పెట్టిన సంగతి తెలిసిందే. అమరావతి సీఆర్డీఏ పరిధిలో 1,402.58 ఎకరాల్లో పేదల కోసం మొత్తం 25 లే అవుట్‌లలో 50,793 మందికి గతేడాది మే 26న ఉచితంగా ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అలాగే మరో నెల తర్వాత నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శంకుస్థాపన కూడా చేశారు. ఇంతలో హైకోర్టు స్టే ఇవ్వడంతో పనులకు బ్రేకులు పడ్డాయి. దీంతో.. ఇతర ప్రాంతాలకు చెందిన సుమారు 50 వేలమంది పేదలకు రాజధాని ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇచ్చి తాడికొండ, మంగళగిరి నియోజక వర్గాల్లో మరోసారి వైసీపీ జెండా ఎగురవేయాలన్న ప్రయత్నాలు విఫలమయ్యాయి. దాంతో ఆర్5 జోన్ ఏర్పాటుపై సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, ఈ పిటిషన్ విచారణను ఏప్రిల్‌కు వాయిదా వేస్తూ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం ఆదేశా లిచ్చింది. దీనిపై తక్షణమే జోక్యం చేసుకుని పిటి షన్లపై విచారణ జరపాలని ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది



వైఎస్ జగన్

అభిషేక్ సింఘ్వీ కోరినప్పటికీ ధర్మాసనం ఒప్పుకో లేదు. నాన్ మిస్‌లేనియస్ డేలో ఈ వ్యవహారాన్ని విచారిస్తా మని తేల్చిచెప్పింది. రాజధాని అమరావతికి సంబంధించిన ప్రధాన పిటిషన్ కూడా ఇదే ధర్మాసనం వద్ద పెండింగ్‌లో ఉందని రైతుల తరపు సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సింఘ్వీ వాదనలు వినిపిస్తూ పేదలకు సెంటు భూమి ఇచ్చి నివాస గృహాలు నిర్మిం చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను అడ్డుకున్నారని చెప్పారు.

దీనిపై జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పందిస్తూ ఏం జరుగుతుందో తమకు తెలుసని వ్యాఖ్యా నించారు. మొత్తానికి ఈ పరిణామంతో రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులు ఊపిరి పీల్చుకోగా, రాష్ట్ర ప్రభుత్వ దూకుడుకి కళ్లెం పడింది.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**

# ధరణి పేరుతో




**తెలంగాణలో సమగ్ర భూమి రికార్డుల యాజమాన్యం పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌లో లోపాలు, సమస్యలు క్రమంగా బయట పడుతున్నాయి. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ తీరుతెన్నులపై పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. ప్రత్యేకంగా ఓ కమిటీనే నియమించింది.**

వాస్తవానికి కాంగ్రెస్ ప్రతిపక్షంగా ఉన్నప్పటి నుంచే ధరణి పోర్టల్‌లోని సమస్యలు, లోపాలపై ఆక్షేపణలు లేవనెత్తింది. తాము అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్ స్థానంలో మరో ఉత్తమమైన వ్యవస్థను తీసుకొస్తామని చెబుతూ వచ్చింది. ఆ హామీ మేరకు ధరణిని విశ్లేషిస్తూ పోతే పలు లోపాలు బయట పడుతున్నాయి. ఆ పోర్టల్ కారణంగా, భూ యాజమానులు... ముఖ్యంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొందన్న అంశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తి చూపుతోంది. ఇందులో భాగంగానే పలు కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చిన తర్వాత, నిషేధిత జాబితాలోని అనేక భూములు ఆక్రమణలకు గురైనట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాథమికంగా గుర్తించినట్లు తెలుస్తోంది. ధరణిలో నమోదై, పాస్ పుస్తకాల్లో చూపిస్తున్న భూవిస్తీర్ణానికి.. క్షేత్రస్థాయిలో ఉన్న భూమికి చాలా తేడాలున్నట్లు రెవెన్యూ శాఖ గుర్తించింది.

1956 నాటి సేత్వార్ ఆర్ఎస్ఆర్ రికార్డుతో పోల్చితే గడిచిన 60 ఏళ్లలో భూమి రికార్డుల్లో సుమారు 6 లక్షల 50 వేల ఎకరాలు ఎక్కువగా నమోదైనట్లు లెక్కలు చూపిస్తున్నాయి. దీంతో పాస్ పుస్తకాల్లో అధికంగా ఉన్న భూ విస్తీర్ణాన్ని సవరించాల్సి ఉందని అధికారులు అంటున్నారు.

నిషేధిత జాబితాలో నమోదు చేసి ఉన్న అనేక భూములు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఆక్ర మణలకు గురైనట్లు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాథమికంగా గుర్తించింది. రికార్డుల్లో నిషేధం పేరుతో ఉన్న భూములను అక్రమార్కులు, అధికారులు పట్టా భూమిగా మార్పు చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో వేల కోట్ల రూపాయల విలువైన అవినీతి జరిగినట్లు ఈ ప్రభుత్వం గుర్తించింది. ప్రత్యేకంగా ఏర్పాటైన ధరణి కమిటీ ఈ అన్ని అంశాలపైనా దృష్టి సారించింది. అనుమానిత భూముల వివరాలు ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు జారీచేసింది. అలాగే, అనుమానాస్పదంగా కనిపిస్తున్న లావాదేవీలను కూడా పరిశీలించాలని నిర్ణయం తీసుకుంది. అంతేకాదు.. భూములకు సంబంధించి ఎదురవు తున్న సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయికి వెళ్లాలని కమిటీ భావిస్తోంది.

ఈ మొత్తం వ్యవహారం వెనక ఎవరున్నారు? వాళ్లకు సహకరించిన అధికారులు ఎవరన్న దానిపై ధరణిపై నియమించిన కమిటీ ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు నిషేధిత జాబితాలో ఉండి అన్యాక్రాంతమైన ఆయా భూముల వివరాలు అందజేయాలని అధికారులను సదరు కమిటీ ఆదేశించింది. కమిటీ కన్వీనర్, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ చైర్మన్‌గా.. సభ్యులు, కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి, భూ పరిపాలన పూర్వ ప్రధాన కమిషనర్, రిటైర్డ్ ఐఏఎస్ రేమండ్ పీటర్, నల్సార్ యూనివర్సిటీకి చెందిన భూ చట్టాల నిపుణుడు సునీల్, మాజీ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మధుసూదన్, సీఎంఆర్వో ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చిరెడ్డి సభ్యులుగా ధరణి వాస్తవ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేశారు.

ధరణి పోర్టల్ అమలులోకి వచ్చాక ఏ రకమైన లావాదేవీలు జరిగాయి? నిషేధిత జాబితాలో ఉన్న భూములను కూడా ధరణి పోర్టల్ ద్వారా ప్రైవేట్ వ్యక్తులకు చెందేలా నిర్ణయాలు తీసుకున్నారా? అలాగే, అసైన్డ్ భూములను కూడా ఆ జాబితా నుంచి తొలగించారా? ప్రభుత్వ భూముల పరిస్థితి ఏంటి? అనే అంశాలపై ధరణి కమిటీ తొలి సమావేశంలో ఆరా తీశారు. ధరణి అమలులోకి వచ్చిన తర్వాత ఈ పోర్టల్ ద్వారా గత మూడేళ్లలో జరిగిన అనుమానాస్పద లావాదేవీలన్నీ పరిశీలించాలని నిర్ణయించారు. ధరణికి సంబంధించిన పూర్తి లావాదేవీలను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వాస్తవానికి, ధరణి పోర్టల్ అమలులోకి రాకముందు రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం విక్రయించడానికి వీల్లేని భూములను 22 (ఏ) కింద నిషేధిత జాబితా (ప్రొహిబిషన్ ఆర్డర్ బుక్– పీవోబీ)లో ఉంచారు. అయితే , అలా ప్రత్యేకించిన భూములు చాలాచోట్ల మాయమైనట్లు తాజా ప్రభుత్వం గుర్తించింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జీవో 59 కింద అన్యాక్రాంతమైన కొన్ని భూములు కూడా ఈ జాబితాలోనివే అని ధరణి కమిటీ గుర్తించినట్లు సమాచారం.

ప్రొహిబిషన్ ఆర్డర్ బుక్‌లోని నిషేధిత భూములను ధరణి పోర్టల్‌లోకి కూడా యథాతథంగా ఎక్కించారు. ఆ తర్వాత కొందరు అనుయాయులు, అయిన వారి కోసం ఆ నిషేధిత జాబితాలోని భూములను ధరణి పోర్టల్‌లో గుట్టుగా తొలగించారని ప్రస్తుత ప్రభుత్వం భావిస్తోంది.

ప్రధానంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్ శివారు జిల్లాల్లోని కలెక్టర్ల పనితీరుపై ఆరోపణలు బలంగా ఉన్నాయి. దాంతో, నిషేధిత జాబితా నుంచి మాయమైన భూముల చిట్టాను పరిశీలించాలని ధరణి కమిటీ నిర్ణయం తీసుకుంది. ఆ జాబితాలోని భూములను ఎలా బదలాయించారు? దీని వెనక ఎవరెవరుండే అవకాశం ఉంది? ఈ తతంగానికి సహకరించిన అధికారులు ఎవరు? అనే అంశాలపై ధరణి కమిటీ సీరియస్‌గా దృష్టిపెట్టింది. అంతేకాదు.. ప్రభుత్వ, ఈనాం, అసైన్డ్ భూములను నిషేధిత జాబితా నుంచి పెద్దఎత్తున తొలగించి పట్టా భూములుగా మార్చినట్లు కూడా గుర్తించి.. వాటిని



కేసీఆర్

సుజాత గోపగోని, 6302164068

# 'భూమాయ'




ఎలా మార్చారని ఆరా తీస్తోంది. ఈనాం భూములకు ఓఆర్సీ సర్టిఫికెట్ లేకుండా వేల ఎకరాల భూములను కొనుగోలు చేసి పట్టా భూములుగా కొందరు మార్చుకున్న అంశంపైనా చర్చ జరుగుతోంది. 1955 తరువాత ఈనాందారుల నుంచి ఓఆర్సీ లేకుండా కొనుగోలు చేసిన ఈనాం భూములు చెల్లవని కోర్టు కూడా పేర్కొంది. అయినా.. ఈ లావాదేవీలు ఆగలేదు.

రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, యాదాద్రి జిల్లాలకు చెందిన వేల కోట్ల విలువైన ఈనాం, అసైన్డ్ భూములను ధరణి ద్వారా రియల్ ఎస్టేట్ సంస్థలకు కట్టబెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ లావాదేవీలు అన్నిటినీ పరిశీలించాలని ధరణి కమిటీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల్లో ఇచ్చిన 8,05, 618 ఎకరాల ఈనాం భూమికి 92,250 మంది ఈనాందారులు ఉన్నట్లు 1966లో జాతీయ భూ సంస్కరణల అమలు కమిటీ పేర్కొంది. ఓఆర్సీ పొందకుండానే దాదాపు 6 లక్షల ఎకరాల ఈనాం భూములు చేతులు మారాయి. ఇందులో చాలా భూములు ధరణి వచ్చిన తర్వాతనే అన్యాక్రాంతమైనట్లు ప్రభుత్వం భావిస్తోంది.

అంతేకాదు.. ధరణిలో నమోదై, పాస్ పుస్తకాల్లో చూపుతున్న భూవిస్తీర్ణానికి..క్షేత్రస్థాయిలోని భూమికి చాలా తేడాలున్నట్లు రెవెన్యూ శాఖ గుర్తించింది. 1956 నాటి సేత్వార్ (రీసర్వే సెటిల్‌మెంట్ రిజిస్టం–ఆర్ఎస్ఆర్) రికార్డుతో పోల్చితే గత 60 ఏళ్లలో రికార్డుల్లో సుమారు 6 లక్షల 50వేల ఎకరాల భూమి ఎక్కువగా నమోదైనట్లు తెలిసింది. దీంతో పాస్ పుస్తకాల్లో అధికంగా ఉన్న విస్తీర్ణాన్ని సవరించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే చాలా మంది రైతులు తమకు ఫీల్డ్‌లో ఉన్న భూమికి, పాస్ పుస్తకాల్లో నమోదైన విస్తీర్ణానికి సరిపోలడం లేదంటూ తహశీల్దార్ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు పాస్ పుస్తకాల్లో భూమి ఎక్కువగా నమోదైన వారు మాత్రం తమకు రైతుబంధు లాంటి పథకాలు వస్తుండటంతో పాస్ పుస్తకాల్లోని విస్తీర్ణం తగ్గించుకునేందుకు ముందుకు రావడం లేదు.

గతంలో నల్గొండ జిల్లా పానగల్లును శాంపిల్ విలేజీగా తీసుకుని భూరికార్డులను కాగ్ బృందం పరిశీలించింది. సేత్వార్ రికార్డుకు, పహాణీలకు మధ్య 819.35 ఎకరాల భూమి తేడా ఉన్నట్లు గుర్తించింది. ఈ గ్రామ సేత్వార్ రికార్డు ప్రకారం 3,073 ఎకరాలు ఉండగా.. పహాణీల్లో మాత్రం 3,893.33 ఎకరాల భూమి నమోదైంది. రెవెన్యూ రికార్డుల్లో ఏటేటా రెవెన్యూ సిబ్బంది భూవిస్తీర్ణాన్ని బై నంబర్లతో పెంచుతూ పోవడంతోనే ఇలా పాస్ పుస్తకాల్లో విస్తీర్ణానికి మించి నమోదైనట్లు గుర్తించారు. ఇలా అనేక గ్రామాల్లో 10 నుంచి 20 శాతం భూమి అదనంగా నమోదైంది.

వీటితో పాటు.. రాష్ట్రంలో సాదాబైనామాతో పాటు, ఇతర కారణాలతో డిజిటలైజ్ చేయకపోవడం వల్ల ధరణి పోర్టల్‌లో పట్టా భూములు 18లక్షల 50 వేల ఎకరాల దాకా ఉన్నట్లు తేలింది. ఆయా భూములపై పట్టాదారు కాలమ్‌లో కొన్ని చోట్ల రైతుల పేర్లు కనిపిస్తున్నా, వివిధ కారణాలతో పాస్ పుస్తకాల జారీ ప్రక్రియ నిలిపివేశారు. ఇందులో సాదాబైనామా కింద కొనుగోలు చేసిన భూములే ఎక్కువగా ఉన్నాయి. గత ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఆర్వోఆర్ యాక్ట్ ప్రకారం పాత సాదా బైనామా దరఖాస్తులను పరిష్కరించే మార్గం లేకుండా పోయింది. అందుకే ఈ చట్టానికి సవరణ చేస్తేనే పాస్ పుస్తకాలు జారీ చేయొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

భూరికార్డుల ప్రక్షాళనలో పాత పహాణీలు, పాస్ పుస్తకాల ఆధారంగా కొత్త పాస్ పుస్తకాలు జారీ చేశారు. ఈ క్రమంలో సేత్వార్‌లో ఉన్న విస్తీర్ణానికి మించి పాస్ పుస్తకాల్లో భూవిస్తీర్ణం నమోదైంది. సేత్వార్ డేటాను కూడా ధరణి పోర్టల్‌లో గ్రామాలు, సర్వే నంబర్ల వారీగా అప్‌డేట్ చేశారు. దీంతో సేత్వార్ రికార్డుకు, పాస్ పుస్తకాలకు మధ్య భూ విస్తీర్ణంలో తేడాలున్న వారు ధరణి పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్, ఇతర అప్‌డేషన్ కోసం అప్లై చేస్తే ఆర్ఎస్ఆర్ మిస్ మ్యాచ్ అని చూపిస్తోంది. దీంతో ఎలాంటి లావాదేవీలు జరగకపోవడంతో పట్టాదారులు ఇబ్బందులు పడుతున్నారు.



రేవంత్

తెలంగాణలో నిజాం హయాంలోనే చివరిసారిగా 1940లో సమగ్ర భూసర్వే జరిగింది. ప్రతి 30 ఏళ్లకోసారి జరగాల్సిన రీసర్వే 80 ఏళ్లు దాటినా జరగలేదు. ఈ క్రమంలోనే కొందరు తమ వద్ద లేని భూమికీ హక్కులు పొందారు. రెవెన్యూ యంత్రాంగం చాలా చోట్ల తమ రికార్డుల్లో భూమిని పెంచేశారు. కొన్ని చోట్ల అమ్మిన భూమిని సంబంధిత రైతు ఖాతా నుంచి తొలగించకుండానే కొత్త సబ్ డివిజన్ ఏర్పాటు చేశారు. ఇలాంటి ఆర్ఎస్ఆర్ మిస్ మ్యాచ్‌ను సరిదిద్దాలంటే సమగ్ర భూసర్వేతోనే సాధ్యమవుతుందని రెవెన్యూ చట్టాల నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సమగ్ర భూసర్వే నిర్వహిస్తామని బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. సీఎం హోదాలో చంద్రశేఖరరావు పలుమార్లు ప్రకటించినా ఇది అమల్లోకి రాలేదు. దీంతో హద్దుల సమస్యలు.. రికార్డుకు, ఫీల్డ్‌లో తేడాలు పెరిగిపోయాయి.

ఈ పరిస్థితుల నేపథ్యంలో ధరణి పోర్టల్ ద్వారా రైతులకు, ఇతర భూముల యజమానులకు ఎదురవుతున్న సమస్యలను ధరణి కమిటీ సభ్యులు అడిగి తెలుసుకున్నారు. ఆ పోర్టల్‌లో నమోదైన డాటా వివరాలు కావాలని అధికారులను కోరారు. అదే సమయంలో, ధరణిని సంస్కరించేందుకు చేపట్టాల్సిన మార్గాలను అన్వేషించేందుకు క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లి, ప్రజలు, బాధితులతో నేరుగా మాట్లాడాలని నిశ్చయించారు. అందరికీ అందుబాటులో ఉండేలా సీసీఎల్ఏలోనే కమిటీ కార్యాలయం ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించారు.

ధరణిపై లోతుగా అధ్యయనం చేయడం, బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించడం, ఏయే సమస్యలు ఎక్కువగా ఉన్నాయో నమోదు చేసుకోవడం, ఎక్కువ సమస్యలున్న బాధితులు, గ్రామాలను గుర్తించి వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించడం, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడానికి రూట్ మ్యాప్ ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయానికి వచ్చారు. అనుమానాస్పద లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక రూపొందించనున్నారు. ధరణి సమస్యలపై దశల వారీగా నివేదికలు ఇవ్వనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్




# 9 గంగా యమునల పావన సంగమం

## రామాయణకాలపు సామాజిక జీవనం

గత చరిత్రను రాసేటప్పుడు చరిత్రకారుడు తన కాలంలోని సిద్ధాంతాల వల్ల ప్రభావితుడవుతాడనీ, కనుక గతచరిత్ర చరిత్రకారుని కాలం నాటి సిద్ధాంతాలకు చాల వరకు ప్రతిబింబమవుతుందనీ కొందరు చరిత్రకారులంటారు. కాని వాల్మీకి మహర్షి విషయంలో ఇలా చెప్పడానికి వీలులేదు. రామాయణంలో వర్ణితమైన ఆదర్శాలు శ్రీరామచంద్రుని జీవన కాలంలోనే లిఖింపబడ్డాయి. రామచంద్రుని పుత్రులు దానిని కంఠస్థంచేసి వినిపించారు. బాలకాండలో వాల్మీకి మహర్షి రామాయణ కాలంలోని సమాజస్థితిని వర్ణించారు. దాన్నిబట్టి ఆనాడు సమాజజీవనం ఎంత సహృద్యంగా, సుఖవంతంగా, శీలసంపన్నంగా ఉన్నదో మనకు తెలుస్తుంది. అయోధ్యలోని ప్రజలను వర్ణిస్తూ వాల్మీకి రాసిన శ్లోకాలను మానికొండ రామాయణం (బాలకాండలో) ఇలా అనువదించింది. .

నరులు హృష్టులు తుష్టులా పురవరమున
తమతమ ధనాల సంతృప్తుల మలయశులు
సత్యవాదు లలుబ్ధులు శాంతమతులు
వితత ధర్మాత్ములును బహుశ్రుతులు ఘనులు
అల్పకోశు డసిద్ధార్థు డచటలేడు
లేదు గజవాజిగోతతుల్ లేనివాడు
లేదు ధనధాన్యపూర్ణుండు కానివాడు
వెదకిచూచిన పురి కుటుంబీకులందు .6-7
అరయ పురిలోన కామైకపరుడు లేడు
ఘాతుకుండు కదర్యుండు గానరాడు
చూడ నాస్తికుడెందును లేడు నిజము
లే డవిద్వాంసు డావీటి జాడనెందు .8
నరులు నారులు పురిలోన నఖిల జనులు
ధర్మశీలురు సంయుతుల్ కర్మరతులు
శీలవృత్తంబు లుగ్గతో గ్రోలువారు
అమలు లహహ మహర్షులట్లలరువారు .9
లేడకుండలి, లేడమృష్టుండు పురిలోన
లేడల్పభోగియు లేడస్రగ్వి
లేడనలిప్తాంగు డేడను వెదుకంగ
లేడసుగంధుండు లేడమకుటి
లేడదాతయు నిక లేడనిష్కధరుండు
లేడనంగదుడు నమృష్టభోజి
లేడజితేంద్రియుం డేడను లేడింక
హస్తాభరణధారి కానివాడు
లేడనాహితాగ్ని లేడయజ్వయు నెందు
లేడు తస్కరుడును లేడుగర్వి
లేడు క్షుద్రజనుడు లేడింక నిర్వృత్త
సంకరుండు నగరి జాడనెందు 10-12
నిత్యము స్వకర్మనిరతులు సత్యపరులు
అధ్యయన దానశీలు రాచారపరులు
శాంతమతులు, పరిగ్రహ సంయుతులను
బ్రాహ్మణులు బొల్తు రా పురి బ్రహ్మవిదులు .13
దేవతాతిథి పూజల దేలువారు
శూరులు కృతజ్ఞులును వదాన్యులును గలరు
భూరి విక్రమ సంయుతుల్ పురినిగలరు
బ్రాహ్మణాదుల నాల్గు వర్ణాలలోన .17
అరయ దీర్ఘాయుషుల్ పురి నఖిల జనులు
ధర్మమును సత్యమును వార లాశ్రయింత్రు
నిత్యమిక పుత్ర పౌత్రుల నెలమిగూడి
తనియుచుందురు గృహిణులు తమ్ము గొలువ.

అయోధ్య ప్రజలను గురించిన ఈ వర్ణనను సూక్ష్మంగా పరిశీలించే పక్షంలో ఆర్థిక సుసంపన్న తతో పాటు వారి జీవనంలో శ్రేష్ఠ శ్రేణికి చెందిన జాతీయ శీలం కూడా సంపాదించినట్లు తెలుస్తుంది. అలుబ్ధ, సత్యవాది, అలంపట, ఆస్తిక, క్రియాశీల ఇత్యాది గుణగణాలు కేవలం మానసికమైనవి. అబద్ధం చెప్పడం, మత్సరబుద్ధితో ప్రవర్తించడం అనే ఆలోచనలు వారి మనస్సులలో సైతం ప్రవేశించవు. వారు ఇంద్రియాలను స్వాధీనం చేసుకున్నారు. ఇన్ని గుణాలను వర్ణించిన తరువాత కూడా వాల్మీకి 'మహర్ష ఇవామలాః' అంటే..మహర్షుల వలె వారు నిష్కంళకులని చెబుతున్నారు.

**– బాలశాస్త్రి హరదాస్**

**'జాగృతి' 13.04.1962 సంచిక నుంచి**



# ఆధ్యాత్మికం

పురాణాలు ఏడుగురు ప్రముఖులను చిరంజీవులుగా పేర్కొంటున్నాయి. చిరంజీవిత్వం అంటే మృత్యువు లేకపోవడం అని సాధారణార్థంలో చెబుతారు. చిరంజీవులు అంటే చిరకాలం జీవించే వారని అర్థం తప్ప శాశ్వితులు (అంతంకానివారు) అని కాదు. వాస్తవానికి ఈ ప్రకృతి/సృష్టిలో ఏ జీవి శాశ్వతం కాదు. 'జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ..' అని గీతాచార్యుడు

# 9 మహాభారతం ప్రజాపరిస్థితి



ద్రుపదపురంబున పాండవులు సుఖులై యున్నారని తెలిసి ప్రజలు సంతసించిరి. వారిని చూచుటకు ప్రజలందరును ఉవ్విళ్ళూరుచుండిరి.

.............నీ
యల్లురఁ బాండుపుత్రులఁ
బ్రియంబునఁ జూడఁగఁ గోరుచున్నవా
రెల్లజనంబులం గురుకులేశ్వరుఁ
డాదిగ బంధువర్గమున్ (అది. 8.67)

అని విదురుడు ద్రుపదునితో నన్నాడు.

ప్రజలు పాండవుల శుభాగమనమునకు సంతసించిరి. వారిని నిస్సంకోచముగా ఆశీర్వదించిరి. పాండవులు హస్తినాపురమును ప్రవేశించు సమయమున ప్రజల దృష్టిలో పాండుమహారాజే తిరిగి జీవించి వేంచేయుచున్నాడా యన్నట్లు ధర్మజుడుండెను.

పురజనులెల్లను కర మనురక్తులై
ధర్మస్వరూపుఁడీధర్మతనయుఁ
డనుజులఁ దానును జనుదెంచెఁ బాండు భూ
జనపతి జీవించి మనలఁగావఁ
బ్రీతితోఁ దానిప్పు డేతెంచె మేలయ్యె
నిమ్మహాత్ములకు దైవమ్ము బురుష
కారంబుఁగలుగంగ ధారిణీరాజ్యంబు
వాయునే, యాపదల్ వాయుగాక
దానహోమజప విధానముల్ మన కివి
గలపయేని ధరణి వలయరాజ్య
మిందయుండి ధర్మనందనుఁ దొనరించు
చుండుఁ గావుతమ యఖండితముగ
ఆది. 8.62

ఎంతటి దీవన యిది. పాండవుల యెడ ప్రజలకు గల గాఢాదరమున కిది నిదర్శనము. మఱి పాండవులు తాము మహా ప్రస్థానమునకు ఉద్యుక్తులై, పరీక్షిత్తును రాజుగా నియమించి యాతనిని ప్రజకు ఇల్లడ పెట్టిరి.

ఇట్లు పాలక పాలిత సంబంధము సుస్థిరమై నెలకొన్నది.

వీనినంతయు నౌపచారిక విధులుగా త్రోసి వేయవచ్చును. కాని కౌరవ వంశము విషయమున ఇది కేవలము ఔపచారికము గాదు.

రాజ్య వ్యవహారములందు ప్రజలు శ్రద్ధ వహించుచుండిరి. తమ యిష్టానిష్టములను వారు వ్యక్తీకరించుచుండిరి. ధర్మజుని రాజుగా ప్రతిష్ఠించెదమని ప్రజలు భావించినట్లుగా దుర్యోధనుడు వినినాడు. మూగ ప్రజ అటుల జేయుటకు సమర్థులా? కాదే! వదరుకొననిమ్ము నాకేమి? అని ఉపేక్షించుటకు వలనుపడని శక్తి ఏదేని యొక్కటి ప్రజలయందు ప్రతిష్ఠితము కాకున్న యెడల దుర్యోధనుడు జాగరూకుడు కానక్కరలేదు. అతడు మంచిదనమునకు మాత్రమే కట్టువడు సుజనుడు మాత్రము గాడు గదా! అవశ్యకత యున్నది కనుకనే పాండవులను మృదూపాయముచేత తొలగించ యత్నించెను. (ఆ140.25 నుండి 27)

ద్రుపద నగరమునుండి విచ్చేసిన పాండవులను బాహాటముగానే ప్రజలు ఆశీర్వదించుటయును ఆ దీవించిన విధానమును మూగ ప్రజ చేయదగినది గాదు.

ఇంతియగాదు, దుర్యోధనుడు జన్మించిన సందర్భమున ఉత్పాతములు ఆనేకములు కలిగినవి. అప్పుడు ధృతరాష్ట్రుడు భీష్మాదులతోపాటు, పౌరజానపదులను గూడ గావించి, ధర్మజునే రాజు చేసెద నని వారికి వాగ్దానం చేసెను.

**...తతస్తు భీత పద్రాజాధృతరాష్ట్రో బ్రవీదిదమ్**
**నమానీయ బాహూన్ విప్రాన్ భీష్మం విదుర మేవచ**
**అన్యాంశ్చ సుహృదోరాజన్ కురూన్ సర్వాన్స్త దైవతా**
**యుధిష్ఠిరో రాజపుత్రో జ్యేష్ఠోనః కులవర్ధనః**
**ప్రాప్తహః స్వగుణతో రాజ్యం నతస్మిన్ వాచ్యమస్తినః**
**అయం త్వనంతరస్తస్మాదపి రాజా భవిష్యతి**
**ఏతద్ విబ్రూత మే తథ్యం యదత్ర భవితా ధృవమ్**
**(ఆది 114.29.32)**

బంధువర్గంతోను భీష్మాదులతోను తృప్తి పడక పౌర జానపదులను గూడా రావించుట ఏల? వారికి రాజ్యాంగ విషయాలను నివేదించుట ఏల? పౌర జానపదులును రాజ్యాంగ విషయములందు శ్రద్ధ వహించుటయే దానికి కారణముగా భావించవచ్చును. ప్రజాభిప్రాయము ఎంతటి శక్తిమంతమైనదో కౌరవులకు తెలియనివి కాదు. ప్రజాభిప్రాయమునకు వ్యతిరేకముగా రాజు నిరంకుశముగా ప్రవర్తింపలేదు.

**–డా॥ చిలుకూరి సుబ్రహ్మణ్య శాస్త్రి**
**'జాగృతి' 19-07-1965** సంచిక నుంచి

# సప్త చిరంజీవులు..

స్పష్టం చేశాడు. పుట్టిన వారికి మరణం తప్పనట్లే, మృతులకు పునర్జన్మ తప్పదనీ సూత్రీకరించాడు. పుట్టుట గిట్టుట కొరకే అన్నట్లు ప్రతి జీవి అంతరించపోవలసిందే. చివరికి బ్రహ్మ స్థానంలోనూ మరొకరు వచ్చి చేరవలసిందే. కాకపోతే, సుదీర్ఘకాలమో లేదా యుగాంతం వరకు ఆయుష్మంతులుగా ఉండే అవకాశం కొందరికి కలిగింది. వారే సప్త చిరంజీవులు..

'అశ్వత్థామా బలి ర్వ్యాసో హనుమాంశ్చ విభీషణః
కృపః పరశురామశ్చ సప్తైతే చిరంజీవినః
సప్తైతాన్ సంస్మరేన్నిత్యం
మార్కండేయమథాష్టమం జీవేద్వర్షశ్శతమ్ సోపి
సర్వవ్యాధి వివర్జిత –అశ్వత్థామ, బలిచక్రవర్తి, వ్యాసుడు, హనుమ, విభీషణుడు, కృపాచార్యుడు, పరశురాముడు.. ఈ ఏడుగురిని చిరంజీవులుగా చెబుతారు. వీరిలో ఆరుగురు తమతమ ప్రతిభ, వ్యక్తిత్వాలతో చిరంజీవిత్వం పొందగా అశ్వత్థామ శాపవశాత్తు ఆ జాబితాలో చేరిన విచిత్ర సన్నివేశం కనిపిస్తుంది. మార్కండేయుడు,ధ్రువుడు తదితర మరికొందరని కూడా చిరంజీవులుగా పేర్కొంటారు. శివుడు, శ్రీమహావిష్ణువుల అనుగ్రహంతో మార్కండేయుడు, ధ్రువుడు చిరంజీవులుగా ప్రసిద్ధులు. వీరందరిని నిత్యం స్మరించుకోవడం వల్ల సర్వ వ్యాధులకు దూరమై శతాయుష్కులవుతారని భావం. వారి గురించి వారం...వారం....

## వివేకానంద సూక్తిశతి

Have faith in yourself-all power is in you be consious and bring it out. say, "I can do Everything". Even the poison of a snake is powerless it you can firmly deny it. Beware! No saying 'nay'' no nagative thoughts!



**అంతులేనిశక్తి అంత నీలోనుండ**
**పాము విషము గూడ పలుచ నగును**
**చేయలేనుయంచు చెప్పకుమేనాడు**
**వినుడి స్వామి సద్వివేకవాణి!!**



బండిరాజుల శంకర్

# మతిమాలిన వ్యాఖ్య

**కొన్నిసార్లు చేసే పనులు అవి యాదృచ్ఛికమైనా లేక రోజువారీ కార్యక్రమాల్లో భాగమైనా వాటివల్ల కలిగే ఫలితాలు అనూహ్యంగా ఉంటాయి. ప్రధాని నరేంద్రమోదీ జనవరి 3,4 తేదీల్లో లక్షద్వీప్‌లో జరిపిన పర్యటన సరిగ్గా ఈ కోవకు చెందిందే. ఆయన అక్కడ జరిపిన పర్యటనకు హేతువు ఒకటైతే, దీని పరిణామాలు భిన్నదృశ్యాన్ని ఆవిష్కరింపజేయడం విచిత్రం. ఇందుకు ప్రధాన కారణం ముగ్గురు మాల్దీవుల మంత్రులు!**

వారి అనాలోచిత వ్యాఖ్యలు భారత్–మాల్దీవుల దౌత్య సంబంధాలు కుదుపునకు లోనయ్యేలా చేసి, చైనాను ఇరకాటంలోకి నెట్టి, ఇజ్రాయిల్ ఆగ్రహానికి కారణమైంది. ఇంతకూ ప్రధాని లక్షద్వీప్‌కు వెళ్లింది అక్కడ రూ.1150కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించ డానికి! ఇందులో అతిముఖ్యమైంది కోచి–లక్షద్వీప్ సబ్‌మెరైన్ ఆప్టికల్ ఫైబర్ కనెక్షన్. దీనివల్ల కోచితో లక్షద్వీపాల్లోని 11 దీవులకు నేరుగా సమాచార అనుసం ధానత ఏర్పడింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత లక్షద్వీప్‌కు ఇటువంటి సదు పాయం కలగడం ఇదే ప్రథమం! ఇంతటి ముఖ్యమైన ఈ అంశం మీడియాలో ప్రధానంగా చోటుచేసుకోక పోవడం ఒక విచిత్రమైతే, ప్రధాని లక్షద్వీప్ తీరంలో తాను విహరించిన ఫోటోలను అప్‌లోడ్ చేసిన తర్వాత, ఈ పర్యటనపై మాల్దీవుల మంత్రి మరియం షియునా మోదీని జోకర్‌గా, ఇజ్రాయిల్ దేశపు తోలుబొమ్మగా పేర్కొంటూ ట్వీట్లు చేయడం, మంత్రులు మహ్జూమ్ మజీద్, మల్షా షరీఫ్ కూడా ఇవే రకమైన వ్యాఖ్యలు చేయడం, ఇందుకు ఇజ్రాయిల్ ఆగ్రహం, మాల్దీవుల అధ్యక్షుడు పర్యటిస్తుండటంతో ఇరకాటంలో పడినప్పటికీ చైనా దాన్ని తనకు అనుకూలంగా మలచుకోవడానికి యత్నించడం వంటి పరిణామాలు శరవేగంగా చోటుచేసుకున్నాయి. ఇంతకూ ప్రధాని నరేంద్ర మోదీ మాల్దీవులకు వ్యతిరేకంగా మాట్లాడారా అంటే అటువంటిదేమీ లేదు. లక్షద్వీప్‌లో పర్యటించండి అంటూ దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో వ్యాఖ్యానించారు. దీనివల్ల తమ దేశంలో పర్యాటకం దెబ్బతింటుందన్న ఉద్దేశంతో హ్రస్వ దృష్టితో మాల్దీవుల మంత్రులు చేసిన వ్యాఖ్యలు అసలుకే మోసం తెచ్చాయి.




మొయిజ్జు

### ప్రధాని వెళ్లడానికి కారణం

జనవరి 3, 4 తేదీల్లో మోదీ లక్షద్వీప్‌లకు వెళ్లడానికి ఒక కారణముంది. ఆగస్టు 15, 2019న ఆయన ఎర్రకోట నుంచి మాట్లాడుతూ లక్షద్వీప్‌కు వెయ్యి రోజుల్లోగా ఆప్టికల్ ఫైబర్ కనెక్షన్‌ను కల్పిస్తామని హామీ ఇచ్చారు. తర్వాత రెండు నెలలకు మంత్రివర్గ ఆమోదం లభించింది. కొవిడ్ కారణంగా పనులు ఆలస్యమైనప్పటికీ ఇప్పటికి ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ కనెక్షన్ వచ్చింది. దీన్ని ప్రారంభించడానికి మోదీ అక్కడకు వెళ్లారు. ఇదీ అసలు సంగతి! నిఘాకు కీలకమైన ప్రదేశం లక్షద్వీప్. కొచ్చి (కొచ్చిన్)కి సుమారు 320 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్షద్వీప్ సమాచార పరంగా ప్రధాన భూభాగంతో అనుసంధానించే ప్రక్రియ ఇది. ఇందులో టూరిజం అభివృద్ధి ఒక భాగం మాత్రమే. దీన్ని ప్రోత్సహించడంలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ ఇక్కడ స్నార్కెలింగ్ చేశారు. ఇది ఒక తరహా డైవింగ్. స్నార్కెల్ అనే ట్యూబ్, డైవింగ్ మాస్క్ వేసుకొని సముద్రం అడుగున ఈత కొడుతూ అక్కడి జీవరాసులను వీక్షించవచ్చు. దీంతోపాటు అక్కడి బీచ్‌ల్లో ఆయన విహరించిన ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అసూయకు గురైన మాల్దీవుల మంత్రులు విపరీత వ్యాఖ్యలు చేశారు. ఇవి వివాదం సృష్టించిన నేపథ్యంలో లక్షద్వీప్ టూరిజం ఒక్కసారిగా తెరపైకి వచ్చింది.

### రూ.1150కోట్ల అభివృద్ధిపనులు

లక్షద్వీప్ పర్యటనలో ప్రధాని ప్రారంభించిన అభివృద్ధి పనుల విలువ రూ.1150 కోట్లు. ఇవి టెక్నాలజీ, విద్యుత్, నీటి వనరులు, ఆరోగ్యం, విద్యా రంగాలకు సంబంధించినవి. వీటిల్లో ప్రధానంగా చెప్పుకోవలసింది కొచి–లక్షద్వీప్ సబ్‌మెరైన్ ఆప్టికల్ ఫైబర్ కనెక్షన్ (కె.ఎల్.ఐ–ఎస్.ఒ.ఎఫ్.సి) ప్రారంభం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొట్టమొదటిసారి లక్షద్వీప్ భారత ప్రధాన భూభాగంతో కె.ఎల్.ఐ–ఎస్.ఒ.ఎఫ్.సి. ద్వారా అనుసంధానమైంది. దీనివల్ల ఇప్పుడున్న దానికంటే వందరెట్ల వేగంతో ఇంటర్నెట్ సదుపాయం లక్షద్వీప్ వాసులకు అందుబాటులోకి వస్తుంది. సమాచార మౌలిక సదుపాయాల రంగంలో లక్షద్వీప్‌లో ఓఎఫ్‌సీ విప్లవాత్మక మార్పు తీసు కొచ్చింది. అంతకు ముందు కేవలం ఉప గ్రహ వ్యవస్థ ద్వారా మాత్రమే లక్షద్వీప్‌కు కమ్యూనికేషన్ సదుపాయం ఉండేది. అదీ పరిమితమైన బ్యాండ్ విడ్త్‌తో ఉండటంవల్ల పెరుగుతున్న డిమాండ్‌కు, అందుబాటులో ఉన్న సదుపాయానికి పొంతన ఉండేది కాదు. ప్రస్తుతం ఎస్ఓఎఫ్‌సీ అందుబాటు లోకి రావడంతో పదకొండు ద్వీపాలు కవరత్తి, అగత్తి, అమితి, కద్మత్, ఛట్లెట్, కల్పేనీ, మినుకోయ్, అంద్రోత్, కిల్టన్, బంగారం, బిత్రా ద్వీపాలు, కోచితో నేరుగా సమాచార సదుపాయాన్ని పొందుతాయి. ఈ ప్రాజెక్టుకు అయిన మొత్తం ఖర్చును టెలికమ్యూనికేషన్ శాఖకు చెందిన యూనివర్సల్ సర్వీసెస్ ఆబ్లిగేషన్ ఫండ్ భరించింది. గ్లోబల్ టెండర్ ప్రాతిపదికన ఎన్ఈసీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఈ పనులను పూర్తిచేసింది. అయితే ఈ ప్రాజెక్టును అమలు చేసింది ప్రభుత్వరంగ సంస్థ



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

# యి తెచ్చిన అనర్థం!

బీఎస్ఎన్ఎల్.

**వెల్లువెత్తిన నిరసనలు**

మోదీ పర్యటనపై మాల్దీవుల మంత్రులు చేసిన వ్యాఖ్యలతో భారతీయుల్లో ఆగ్రహం పెల్లుబికింది. సోషల్ మీడియా ద్వారా వారు తమ నిరసనలను తెలియజేయడమే కాదు బాయ్‌కాట్ మాల్దీవుల ఆన్‌లైన్ ఉద్యమాన్ని ఉధృతం చేశారు. మనదేశానికి చెందిన ప్రముఖులతో పాటు, వాణిజ్యవేత్తలు కూడా తమ అభిప్రాయాలను మార్చుకోవడం మొదలుపెట్టారు. చివరకు ఈజ్ మై ట్రిప్ విమానాల బుకింగ్‌ను నిలిపేసింది. దాదాపు పదివేల హోటల్ బుకింగ్స్, ఐదువేల ఫ్లైట్ బుకింగ్స్ రద్దయినట్లు సోషల్ మీడియాలో ప్రచారమైంది. దీంతో అక్కడి మాల్దీవ్ అసోసియేషన్ ఆఫ్ టూరిజం ఇండస్ట్రీ (మాటి) ఈజ్ మై ట్రిప్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని మళ్లీ తమ దేశానికి బుకింగ్స్ తెరవాలని కోరింది. తమ నేతలు కొందరు చేసిన విచారకర వ్యాఖ్యలు, దేశ ప్రజల అభిప్రా యం కాదని స్పష్టంచేయడమే కాదు, తమ దేశ పర్యాటకరంగ అభివృద్ధిలో భారత్ పాత్ర కీలకమన్న సంగతిని గుర్తుచేసింది. ఇదిలావుడగా మాల్దీవుల పర్యాటక శాఖ ఇటీవల విడుదల చేసిన జాబితా ప్రకారం 2023లో ఈ ద్వీప దేశాన్ని అత్యధికంగా సందర్శించింది భారతీయులే. వీరి సంఖ్య 2,09,198 కాగా 2,09,146తో రష్యా రెండో స్థానంలో ఉంది. 1,87,118తో చైనా మూడో స్థానంలో ఉంది. 2022లో కూడా మాల్దీవులను అత్యధికంగా 2,40,000 మంది భారతీయులు సందర్శించారు. 198,000తో రష్యా రెండో స్థానాన్ని, 177,000తో బ్రిటన్ మూడోస్థానంలో నిలిచింది. మాల్దీవులకు భారత పర్యాటకులు ఎంత ముఖ్యమో ఈ సమాచారం వెల్లడిస్తుంది.

**మారని మొయిజ్జు**

ఇంత జరుగుతున్నా చైనాలో ఐదురోజుల పర్యటనలో ఉన్న మాల్దీవుల అధ్యక్షుడు మొయిజ్జు వ్యవహారశైలిలో మార్పు కనిపించకపోవడం గమనార్హం. ప్రస్తుతం నెలకొన్న వివాదం నేపథ్యంలో చైనా తన దేశం నుంచిపెద్ద మొత్తంలో పర్యాటకును మాల్దీవులకు పంపాలని కోరడమే ఆయన వైఖరికి నిదర్శనం. ఫ్యూజియన్ ప్రావిన్స్‌లోని బిజినెస్ ఫోరమ్ సమావేశంలో మాట్లాడుతూ చైనా తమకు అత్యంత సన్నిహిత అభివృద్ధి భాగస్వామిగా పేర్కొనడంతో పాటు, బెల్ట్ అండ్ రోడ్‌ను పొగడ్తలతో ముంచెత్తాడు. కేవలం దీనివల్లనే మాల్దీవుల్లో ఎన్నడూ లేని రీతిలో మౌలిక సదుపాయాలు ఏర్పడ్డాయని చెప్పాడు. కొవిడ్–2019కి ముందు మాల్దీవుల మార్కెట్‌లో చైనా అగ్రస్థానంలో ఉండేదని, దాన్ని మళ్లీ పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని అభ్యర్థించాడు. చైనాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నామని కూడా ఫోరం సమావేశంలో పేర్కొనడం గమనార్హం. ఇదే సమయంలో తమ దేశంలో చైనా పర్యాటకుల సంఖ్య తగ్గిపోందని, వీరి సంఖ్యను మరింతగా పెంచాలని కోరాడు. ఇదిలావుండగా మొయిజ్జు చైనా పర్యటన సందర్భంగా మాల్దీవుల్లో పర్యాటక అభివృద్ధి కోసం రెండు దేశాల మధ్య 50మిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన ఒప్పందం కుదిరిందని మాల్దీవుల మీడియా వెల్లడించడం గమనార్హం. మంత్రుల వ్యాఖ్యల నేపథ్యంలో అధ్యక్షుడు మొయిజ్జు దిగిపోవాలన్న డిమాండ్లు దేశంలో జోరందుకున్నాయి. ఆయన ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని పార్లమెంటరీ మైనారిటీ నేత అలీ అజీం పిలుపు నివ్వడం కొసమెరుపు. అయితే మొహమ్మద్ మొయిజ్జు త్వరలో అంటే జనవరి నెలాఖరు లేదా ఫిబ్రవరి మొదటి వారంలో మనదేశంలో అధికార పర్యటన జరిపే అవకాశాలున్నాయి. గత ఏడాది యూఏఈలో జరిగిన పర్యావరణ సదస్సులో భారత ప్రధాని మోదీతో, మొయిజ్జు భేటీ అయినప్పుడు ఢిల్లీ పర్యటనపై చర్చజరిగినట్టు తెలుస్తోంది.

**లక్షద్వీప్‌పై పెరిగిన క్రేజ్**

మోదీ పర్యటన తర్వాత ప్రపంచవ్యాప్తంగా లక్షద్వీప్‌పై ఒక్కసారిగా క్రేజ్ పెరిగిపోయింది. ఈ ప్రాంతం గురించి ఇంటర్నెట్‌లో విపరీతంగా వెతికేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా లక్షద్వీప్‌ల గురించి ఇంటర్నెట్‌లో వెతికేవారి సంఖ్య ఒకేసారి 3400 రెట్లు పెరిగింది. ప్రస్తుతం లక్షద్వీప్‌లో పెద్ద ఎత్తున పర్యాటకులు వచ్చినట్లయితే అందుకు తగిన సౌకర్యాలు ఇంకా ఏర్పడలేదు. పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాల్సి వుంది. ఇప్పుడు లక్షద్వీప్‌లో ఐదు నక్షత్రాల హోటల్స్, విమానాశ్రయం మెరుపు వేగంతో ఏర్పాటు కానున్నాయి. ఈ నేపథ్యంలో తాజ్ బ్రాండ్ కింద లక్షద్వీప్‌లో రిసార్ట్‌లు నెలకొల్పడానికి టాటా గ్రూప్ నిర్ణయించింది. తాజ్ సుహెలీ, తాజ్ కద్‌మత్ బ్రాండ్‌ల ద్వారా దేశ, విదేశీ టూరిస్టులను ఆకర్షించాలని భావిస్తోంది. కేరళ తీరం నుంచి 200 –300 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్షద్వీప్ అత్యల్ప జనాభా కలిగిన కేంద్రపాలిత ప్రాంతం. ప్రస్తుతం



లక్షద్వీప్‌లో మోదీ

పది దీవుల్లో మాత్రమే జనాభా ఉన్నారు. మిగిలిన 17 దీవులు నిర్మానుష్యంగా ఉంటాయి. కొచ్చిన్ నుంచి ఇక్కడకు విమాన రాకపోకలున్నాయి. ఇక్కడి జనాభా మొత్తం ముస్లింలే. మలయాళం యాసలో మాట్లాడతారు. ఒకప్పుడు పల్లవుల పాలనలో కొనసాగిన ప్రాంతంగా చెప్పే లక్షద్వీప్‌లో ప్రస్తుత జనాభా 70వేలు. మలయాళం, జెసేరీ, తమిళం, మలయాళ యాసతో అరబిక్, మహ్ల్ భాషలు ఇక్కడ వాడుకలో ఉన్నాయి. ప్రధానంగా మలయాళం, అరబిక్ సంస్కృతి ఇక్కడ వ్యాప్తిలో ఉంది. ఇవి మాల్దీవుల్లోని చాగోస్ దీవులను పోలి వుంటాయి. మాల్దీవులు పర్యాటకులకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి.

**మినికోయ్‌లో విమానాశ్రయం**

లక్షద్వీప్‌లో మౌలిక సదుపాయల అభివృద్ధిలో భాగంగా మినికోయ్ దీవుల్లో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని కేంద్రం భావిస్తోంది. ఫైటర్ జెట్లు, సైనిక రవాణా ఎయిర్‌క్రాఫ్ట్‌లతోపాలు వాణిజ్య విమానాల నిర్వహణ సామర్థ్యం వుండేలా ఈ విమానాశ్రయాన్ని నిర్మించాలన్నది కేంద్రం లక్ష్యం. హిందూ మహాసముద్రం, అరేబియా సముద్రాలకు బేస్‌గా పెరుగుతున్న పైరసీని అరికట్టేందుకు, సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు ఇది మరింత వెసులుబాటు కలిగి స్తుంది. ప్రస్తుతం లక్షద్వీప్‌లో అగట్టిలో మాత్రమే విమానాశ్రయం ఉంది. మినికోయ్ లో విమానాశ్రయం వస్తే పర్యాటకం కూడా బాగా అభివృద్ధి చెందుతుంది. మాల్దీవులకు కేవలం 564 కిలోమీటర్ల దూరంలో వున్న మినికోయ్ ద్వీపంలో ఇప్పుడు అతిపెద్ద నేవెల్ బేస్ రాబోతున్నది. ఈ మార్గంలో ప్రతి నిముషానికి 12 ఓడలు ప్రయాణిస్తాయంటే ఈ ప్రాంతం వాణిజ్యపరంగా ఎంతటి ప్రాధాన్యం కలిగిందో వేరే చెప్పాల్సిన పనిలేదు.




**దెబ్బతిన్న చైనా వ్యూహం**

మాల్దీవుల్లో భారత బలగాలను తొలగించి తన సైనికులను ఉంచాలన్న చైనా వ్యూహానికి మాల్దీవుల మంత్రుల అనాలోచిత వ్యాఖలతో దెబ్బ బలంగానే తగిలింది. లద్దాక్, అరుణాచల్ ప్రదేశ్‌లో భారత బలగాలను అత్యధిక సంఖ్యలో మోహరించేలా చేయడం ద్వారా డిఫెన్స్ బడ్జెట్‌ను పెంచకుండా చేయాలన్న వ్యూహాన్ని అమలుపరుస్తోంది. ఇందువల్ల తాను కూడా నష్టపోతున్న సంగతి వేరేమాట. అయితే ఇప్పుడు మాల్దీవుల మంత్రులు చేసిన నిర్వాకంతో లక్షద్వీప్‌లో ఏర్పాటు చేయబోయే విమానాశ్రయం వల్ల చైనాకు మొదటికే మోసం వచ్చినట్లయింది. హిందూ, అరేబియా మహాసముద్రాల్లో మన నిఘా మరింత పెరగనుండటం, ఆ దేశానికి మరింత ఇబ్బందికరం. అండమాన్ నికోబార్ ఐలాండ్ వద్ద మనకు ట్రైసర్వీస్ కమాండ్ ఉంది. ఇప్పుడు లక్షద్వీప్‌లో ఎయిర్ స్ట్రిప్ ఏర్పాటుతో అరేబియా సముద్రంపై మన నిఘా మరింత పెరుగుతుంది.


మాల్దీవుల మాట ఎట్లా ఉన్నా మోదీ రాజతంత్రం ఇప్పుడు చైనా తలపట్టుకొని కూర్చోవాల్సిన పరిస్థితిని తెచ్చిపెట్టింది. రాజకీయ చదరంగంలో ఇది అద్భుతమైన ఎత్తుగడ అని ఆనంద్ మహీంద్రా పేర్కొనడంలో ఇంతటి నిగూఢ అంతరార్థం దాగివున్నదని అర్థం చేసుకోవాలి. జనవరి 12వ తేదీతో మాల్దీవుల అధ్యక్షుడు మొయిజ్జు ఐదురోజుల చైనా పర్యటన ముగుస్తున్న నేపథ్యంలో చైనా ఒక ప్రకటన చేస్తూ, మాల్దీవుల అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యాన్ని గట్టిగా వ్యతిరేకిస్తున్నామని, మాల్దీవుల సార్వభౌమత్వం, స్వాతంత్ర్యానికి తమ మద్దతుంటుందని పేర్కొనడం వెనుక, మాల్దీవుల్లో ఉన్న భారత సైనికులను ఉపసంహరించుకుంటే, తమ సైనికులు ఆ స్థానాన్ని భర్తీ చేస్తారన్న అర్థం దాగివుంది.

మోదీ ప్రతిష్టను దెబ్బతీసే రీతిలో మాల్దీవుల మంత్రులు చేసిన వ్యాఖ్యను చైనా పేర్కొన్నట్టు విశాల దృష్టితో ఆలోచించడం ఎలా సాధ్యం? నీతులు ఒకరికి చెప్పడానికి తప్ప తనకు వర్తించవన్న చైనా వైఖరికి ఇది నిదర్శనం. మాల్దీవులను సమాన భాగస్వామిగా పరిగణిస్తాం తప్ప, ఢిల్లీకి దూరంగా ఉండాలన్నది తమ అభిమతం కాదని గ్లోబల్ టైమ్స్ తన సంపాదకీయంలో చెప్పిన సుద్దులు పైపైన చెప్పేవి మాత్రమేనన్నది సుస్పష్టం. చైనాను నిందించడం మానమంటూ పేర్కొంది. అసలు చైనాను ఎవరు నిందించారు? లక్షద్వీప్‌లో పర్యాటక అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడానికి, చైనాను నిందించడానికి సంబంధ మేంటి? విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో చైనా సలహాలు మనదేశానికి అవసరంలేదు. మాల్దీవుల అధ్యక్షుడు మొయిజ్జు చైనా పర్యటనలో ఉండగా గ్లోబల్ టైమ్స్‌లో ఈవిధమమైన వ్యాఖ్యలు రావడం గమనార్హం.

నిజానికి చైనాను నమ్ముకున్న ఏదేశం బాగుపడ్డ దాఖలాలు లేవు. శ్రీలంక, నేపాల్ దేశాలు చైనా పంచన చేరి తీవ్రంగా నష్టపోయాయి. పాక్ పరిస్థితి చెప్పాల్సిన అవసరమే లేదు. ఇప్పుడు భూటాన్ పరిస్థితీ ఇదే చందంగా మారింది. భారత్ ఎంత చెప్పినా వినకుండా చైనాకు సన్నిహితంగా మెలగాలని ప్రయత్నించినందుకు ప్రతిఫలం ఏంటంటే, సాంస్కృతికంగా అత్యంత విలువైన బెయుల్ ఖెన్‌పజాంగ్ ప్రాంతంలోని భూటాన్ రాజు భూములను చైనా కబ్జా చేసి అక్కడ అక్రమ నిర్మాణాలను చేపట్టింది. ఇప్పటికే ఆ దేశానికి చెందిన ఉత్తర, పశ్చిమ, నైరుతి ప్రాంతాలోని భూములను సలామీ స్లైస్ పద్ధతిలో ఆక్రమిస్తోంది. భూటాన్ నెత్తినోరూ బాదుకున్నా ఫలితం లేదు.

**అనవసరంగా ఇజ్రాయిల్‌ను...**

పప్పెట్ ఆఫ్ ఇజ్రాయిల్ ఇన్ లైఫ్ జాకెట్ అంటూ మాల్దీవుల మంత్రి మరియం ఎక్స్‌లో పేర్కొనడం ద్వారా ఇజ్రాయిల్‌ను అనవసరంగా లాగింది. మాల్దీవులకు ఇజ్రాయిల్‌కు పడదు. ఇజ్రాయిల్ పౌరులను మాల్దీవులు బ్యాన్ చేసింది. ఇజ్రాయిల్ ప్రభుత్వం కూడా మాల్దీవులకు వెళ్లవద్దని తన పౌరులకు ట్రావెల్ అడ్వయిజరీ విడుదల చేసింది. రెండు దేశాల మధ్య ఉప్పు నిప్పులా ఉన్న సంబంధాలను, మోదీపై చేసిన వ్యాఖ్యలు మరింతగా దిగజార్చాయి. ఇది జరగడానికి కొద్దిరోజుల క్రితం భారత్, ఇజ్రాయిల్ నుంచి నిపుణులను పిలిపించి, లక్షద్వీప్‌లో డిశాలినేషన్ చేసే ప్రాజెక్టును అప్పగించారు. అంటే మంచినీరుగా మార్చే ప్రక్రియ. మంత్రుల వ్యాఖ్యల నేపథ్యంలో ఈ ప్రాజెక్టును ఇజ్రాయిల్ నిపుణులు తక్షణమే చేపట్టారు. ఇది పూర్తయితే లక్షద్వీప్‌లో తాగునీటి సమస్య తీరి, పర్యాటకం ఊపందుకోగలదు. ★



రెండో ప్రపంచ యుద్ధం సమయంలో విదేశాలలో సుశిక్షితులైన భారత జాతీయ సైన్యం బ్రిటిష్ ఇండియా మీద దండెత్తి రావడానికి అనువుగా ఉంటుందని, కాబట్టి ఈ కీలక సమయంలో జైలులో మగ్గిపోయేందుకు సిద్ధం కావద్దని సుభాస్‌చంద్ర బోస్‌కు సలహా ఇచ్చారు వినాయక్ దామోదర్ సావర్కర్. కలకత్తాలో ముస్లిం లీగ్ శ్రేణులను తనవైపు తిప్పుకోవడానికి సుభాస్‌చంద్ర హాల్‌వెల్ స్మారకస్తూపం కూల్చివేత ఉద్యమం ఆరంభించారు. ఈ స్తూపాన్ని 1760లో కొద్దికాలం మాత్రమే కలకత్తా ప్రెసిడెన్సీ గవర్నర్‌గా పనిచేసిన జి. హాల్‌వెల్ నిర్మించాడు. 1757 నాటి ప్లాసీ యుద్ధంలో జరిగిన బ్లాక్‌హోల్ ఉదంతంలో చనిపోయిన బ్రిటిష్ సైనికుల 'త్యాగానికి' గుర్తుగా ఇది నిర్మించారు. ఇది బ్రిటిష్ వారికి అనుకూలం. బెంగాల్ నవాబు సిరాజుద్దౌలాకు అవమానం. బ్లాక్‌హోల్ విషాదంగా పేరు పడిన ఆ ఉదంతం ఇది: సిరాజుద్దౌలా సేనకు దొరికిన ఈస్టిండియా కంపెనీ సైనికులు కొందరిని ఒక చీకటిగదిలో బంధించారు. వారంతా చనిపోయారు. కాగా, సావర్కర్ హెచ్చరించినట్టే బోస్‌ను బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసింది. ఆయన జైలు నుంచి తప్పించుకుని దేశం వీడి వెళ్లవలసి వచ్చింది. రెండో ప్రపంచయుద్ధంలో ఖైదీలుగా పట్టుబడ్డ భారతీయుల జాతీయసైన్యంతో విదేశీ గడ్డ మీద నుంచి బ్రిటిష్ ఇండియా మీద ఆయన దండయాత్ర ఆరంభించారు. ఈ పరిణామం క్రమాన్నీ, ప్రాధాన్యాన్నీ సావర్కర్ సరిగ్గా గుర్తించారు. అసలు బ్రిటిష్ వారు 1857 నుంచి జరుగుతున్న సైనిక తిరుగుబాట్లు వల్లనే భారత్ విడిచివెళ్లారు గాని, ఇతర పోరాటాల వల్ల కాదని సావర్కర్ ఉద్దేశం. ఈ రెండు అంశాలను సావర్కర్ ఈ వ్యాసంలో వివరించారు. చిత్రంగా హిందువులకు ప్రతినిధిగా సావర్కర్‌నే జిన్నా గుర్తించిన విషయం కూడా ఈ వ్యాసం ద్వారా తెలుస్తుంది. బ్రిటిష్ ఇండియా సైన్యంలో మన యువకులు చేరి, యుద్ధవిద్య నేర్చి ప్రభుత్వం మీద తిరగబడాలన్న సావర్కర్ వాదనలోని నిజం నేతాజీ చర్య ద్వారా వ్యక్తం కావడమే ఇక్కడ గమనించాలి.

సుభాస్‌చంద్ర బోస్

# నేను నేతాజీని కడసారి కలసినప్పుడు... ఆ తర్వాత

జూన్ 22, 1940. నాటి దేశాభిమాని, నేటి నేతాజీ సుభాస్‌చంద్ర బోసు తలవనితలంపుగా బొంబాయిలో నన్ను కలుసుకున్నారు. రెండవ ప్రపంచ యుద్ధం ముమ్మరంగా సాగుతున్న రోజులవి. హిందూ మహమ్మదీయ విభేదాలను శాశ్వతంగా పరిష్కరించాలనే స్థిర సంకల్పంతో ఆయన బొంబాయి వచ్చారు.

జిన్నాతో సంప్రతింపులకు వెళ్లడంతో సుభాస్ "గాంధీజీని గూడ త్రోసిరాజన్నాడు" అని వ్యాఖ్యానించాయి పత్రికలు. నా యెదుటికి వచ్చి కూర్చోవడంతోనే "నాతో సంప్రతించడానికి జిన్నా అంగీకరించలేదు. ఆయన ఉద్దేశం ప్రకారం మీరే హిందువులకు ప్రాతినిధ్యం వహిస్తున్నారట. నేను కాదట" అన్నారు.

**జైళ్లు నింపడంవల్ల ప్రయోజనం**

ఆ విషయాన్నప్పటికి విడిచిపెట్టేశాం. నేను ఆయనను సూటిగా ప్రశ్నించాను. "ఒక్క విషయం చెప్పండి. బ్రిటిష్‌వాళ్లు యిప్పుడు పూర్తిగా యుద్ధం విషయంలో మునిగి వున్నారు. ఇలాంటప్పుడు మీవంటి గొప్ప నాయకులు 'హాల్‌వెల్ స్మారకాన్ని తొలగించాలి' వంటి చిల్లరమల్లర ఆందోళనలు లేవదీసి జైళ్లను నింపడంలో ప్రయోజనం యేమైనా వుందంటారా?"

"అది ప్రజానీకంలో బ్రిటిష్ వ్యతిరేకతను రెచ్చగొట్టడానికి తోడ్పడుతుంది" అని ప్రత్యుత్తరమిచ్చారు సుభాస్‌బాబు. నేను దాని కంగీకరిస్తూ "అవును, అయితే ఈ బ్రిటిష్ వ్యతిరేకత బ్రతికి వుండి తమ నిరంకుశత్వంతో మన దేశంపై అధికారం చలాయించే వేలాది బ్రిటిష్‌వాళ్లవైపు గాక చచ్చిపోయిన హాల్‌వెల్ వంటి నిరంకుశ ప్రభువుల వైపు మళ్లడం వృథా కాదా" అన్నాను.

"మీరు అంత చిన్న చిన్న వాటిని గురించి జైళ్లకు వెళ్లడంవల్ల శత్రువులకు చిక్కిపోతున్నారు. సుభాస్‌బాబూ! నిక్కచ్చిగా, నిర్మోహమాటంగా మాట్లాడుకుందాం. మీకు సాయుధ విప్లవకారులతో ఎల్లప్పుడు సన్నిహిత సంబంధం వుండేది కదూ? సేనలను హిందువులతో నింపి తద్వారా హిందూ జాతిని పౌరుషవంతంగా చేయాలి, అని నేను తలపెట్టిన ఉద్యమం మీకు నచ్చుతుందనుకుంటాను. ఇట్టి ఉద్యమం విజాతీయ శక్తులకు బలం చేకూరుస్తుందని తదేకంగా దీనిని దుయ్యబట్టే కాంగ్రెసు నాయకులతో మీరు ఏకీభవిస్తున్నారని తెలిసే నేను మీతో ఈ సంగతి చెబుతున్నాను."

**రాస్‌బిహారీతో తాదాత్మ్యం**

ఈ సందర్భంలోనే నేను ఆయనకు మొదటి ప్రపంచ యుద్ధంలో జరిగిన కొన్ని సంఘటనలను వివరంగా చెప్పాను. ఆనాడు జర్మనుల వల్ల దొరికిన మన భారత సైనికులనందరిని మన విప్లవవీరులు సంఘటితపరచి జర్మనులతో మైత్రి నెరపి ముక్తిసేనలను నిర్మించిన విధానాలను వివరించాను. "ఇటీవలనే రాస్‌బిహారీ బోస్ నాకు రాసిన ఉత్తరం ఈ సంవత్సరంలోగా జపాన్ యుద్ధం ప్రకటిస్తుందని

సూచిస్తున్నది. అదే కనుక నిజమైతే అధునాతన పద్ధతులలో జపాన్, జర్మనీ, ఆయుధాలతో సుశిక్షితులై విదేశాలలోనుంటున్న వేలాది భారతీయులు బయట నుండి భారతదేశం మీదికి దండెత్తడానికి ఒక మహదవకాశం లభిస్తుంది. అలాంటప్పుడు మీ వంటి దేశ నాయకులు అల్పమైన అనవసరమైన క్షుద్రాందోళనలో దిగి నిర్బంధితులై వుండటం దేశానికెంతో ప్రమాదకరం. మిమ్ము పట్టుకోవడానికని అధికారులు తెగ తిరుగుతున్నారు, క్షణమాత్రమైనా వృథా చేయకుండా దేశ సంరక్షణ కోసం రాస్‌బిహారీ బోస్ తదితర విప్లవవీరులతో మీరు ఏకం కావాలి. ఒక్కసారిగాని మీరు భారతదేశాన్ని దాటి బయటకి వెళ్లితే జర్మనీ ఇటలీ దేశాలలో వేలాది భారత యుద్ధ ఖైదీలకు బాహాటంగా నాయకత్వం వహించవచ్చు. మీ ప్రధాన లక్ష్యమైన భారతదేశ సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని నిరాఘాటంగా ప్రకటించవచ్చు.

జపాన్ యుద్ధరంగంలోకి దూకగానే బర్మా మీదుగా గాని బంగాళాఖాతం ద్వారాగాని లేక మీ ఇష్టం వచ్చిన మార్గంలో బ్రిటిష్ ఇండియాపై దండెత్తి రావచ్చు. నా దృష్టిలో ఈ మహత్తర కార్యాన్ని సాధించగల ధైర్యసాహసాలు శక్తి సామర్థ్యాలు కలిగిన మహావీరులు ఇద్దరో ముగ్గరో మాత్రమే వున్నారు, వారిలో మీరు ఒకరు".

మౌనంగా ఆలోచిస్తూ కూర్చున్నారు సుభాస్ బాబు. "కలకత్తాలో ఏం జరుగుతుందో ముందు చూడాలి. తర్వాత నేను నా కార్యక్రమాన్ని నిర్ణయించుకుంటాను" అని ప్రత్యుత్తరమిచ్చి వెళ్లిపోయారు.

**అటు పిమ్మట**

తర్వాత నేనూహించుకున్నట్లుగానే హాల్‌వెల్ ఉద్యమంలో ఆయన పాల్గొన్నట్లు, అందుకు గాను వారిని నిర్బంధించినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఎప్పుడైతే జైలుకి వెళ్లారో అప్పుడే ఆయన తన పథకాలన్నీ వదులుకోవలసి వచ్చింది. ఆ క్షణంలో ఆయన ముందున్న ఏకైక లక్ష్యం, ఎలాగైనా సరే జైలు నుంచి తప్పించుకొనే సాహసాన్ని ప్రదర్శించి జర్మనీకిగాని జపాన్‌కుగాని వెళ్లిపోవడం.

మనకు చేరిన వార్తలను బట్టి ఇదే ధృవపడింది. ఆయన జైలులో నిరశన వ్రతం పూనారు. అంతే కాదు, తన కప్రతిష్ట తెచ్చిపెడుతుందన్న శంకను గూడ లెక్కచేయక, ప్రపంచాన్ని సంభ్రమపరిచేట్టుగా రహస్యంగా తప్పించుకొని బయటపడ్డారు.

**వీరసావర్కరుకు నేతాజీ అభినందనలు**

జర్మనీలో ప్రవేశించగానే సుభాస్‌చంద్ర బోసు హిట్లరు, ముసోలనీలతో ఒప్పందం చేసుకొన్నారు. భారత స్వాతంత్ర్య సంగ్రామాన్ని ప్రకటించారు. ఆధునిక జర్మనీ యుద్ధ సామగ్రితో సుశిక్షితులైన భారత యుద్ధ ఖైదీలను సంఘటితపరచి, ముక్తి సేనలను నిర్మించారు. జర్మనీ సబ్‌మెరీన్లలో ప్రయాణంచేసి జపాన్ ఆక్రమిత సింగపూర్ భూభాగం



వ్యాసకర్త: స్వాతంత్ర్య వీర్ సావర్కర్

చేరుకున్నారు. జపానీయుల సహాయంతో రాష్‌బిహారీబోస్ నిర్మించిన 50వేలమంది సుదృఢ సైనికులు గల భారత జాతీయసేనకు అధిపతి అయ్యారు. స్వతంత్ర భారత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 'ఛలో ఢిల్లీ' అనే సింహగర్జనతో జయ నినాదంతో అస్సాం పొలిమేరలో బ్రిటిష్‌వారి నెదిరించి పోరాడారు. ఇదంతా ఎలా జరిగిందో చెప్పనక్కరలేదు.

నేను బ్రిటిష్ సేనలను హిందూ యువకులతో నింపివేయటంవల్లనే ఆధునిక యుద్ధసామాగ్రితో శిక్షణ పొందిన సుమారు 60 వేలకు పైబడ్డ సైనికులు గల సేనను నిర్మించడానికి, బోసుకు సాధ్యమయింది. ఈ విషయాన్ని సుభాస్‌బాబే స్వయంగా అంగీకరించారు. 1944 సం॥ జూన్ 25వ తేదీన సింగపూర్ నుండి ఆజాద్ హింద్ రేడియోలో ప్రసంగిస్తూ స్వతంత్ర భారత సైన్యాధిపతి నేతాజీ "కాంగ్రెసుపార్టీ నాయకులందరు దూరదృష్టి లేకపోవడంవల్లనూ, తమ తప్పుడు రాజకీయ సిద్ధాంతాలవల్లనూ భారతసేనలోని సైనికులనందరిని విదేశీ తొత్తులని తూలనాడుతున్నపుడు వీర సావర్కరు ధైర్యంగా ముందుకు వచ్చి భారత యువకులంతా ప్రభుత్వసేనల్లో చేరాలని సలహా నివ్వడం వింటే ఉత్తేజాత్మకంగా వుంది.

తమంతట తాము సంతోషంగా సైనికులుగా చేరిన ఈ యువకులే మన స్వతంత్ర భారతసేనకు శిక్షితులైన సైనికులను సమకూర్చి పెట్టారు" అని స్పష్టం చేశారు.

**భారత జాతీయసైన్య పురోగమనం**

1964 ఆగష్టులో ప్రఖ్యాత జపాన్ గ్రంథకర్త శ్రీ జె.జె.సిపావా "జపానులోని ఇద్దరు ప్రఖ్యాత భారతీయులు", అనే ఒక పుస్తకాన్ని ప్రచురించారు. రాస్‌బిహారీ, సుభాస్‌చంద్ర బోసుల అంతర్జాతీయ విప్లవకార్యక్రమాలు ఆ పుస్తకంలో ఉన్నాయి.

ఒక దినచర్య రూపంలోనున్న ఆ పుస్తకంలో గ్రంథకర్త ఇలా రాశారు.

".... ఫిబ్రవరి. సింగపూరు మీద జపానీయుల దాడి ప్రారంభమైంది..." "... బ్రిటిష్‌వారి ఆధ్వర్యంలో భారత సేనల ప్రతిఘటన తీవ్రంగా వుంది. జపాన్ ఇంపీరియల్ గార్డ్సు ప్రధాన కార్యస్థానం చాలా దెబ్బతిన్నది."

".... భారత జాతీయ సైన్యాధిపతి ఒక్కరే ముందుకు నడిచారు. ఎదిరి సైన్యంలోని భారత అధికారులను, బ్రిటిష్‌సేనలో వున్న భారతీయులను ఉద్దేశించి భారతదేశం ఎడ వారి భక్తి ప్రపత్తులను వృథాచేయవద్దని, భారత స్వాతంత్ర్యావశ్యకతను గూర్చి వారికి హృదయాలను కదలించేటట్లు మనసున బాగా నాటేటట్లుద్బోధించారు. అత్యద్భుత కార్యమొకటి సాధ్యమైంది. బ్రిటిష్‌వారి వైపున ఉన్న భారతసేనలు తుపాకులు క్రింద పెట్టాయి. ద్వితీయ ప్రపంచ సంగ్రామానికి గాను సావర్కరు నిర్దేశించిన సైనికీకరణ విధానం రూపొందడం ప్రారంభమైంది."

''ఉత్తేజాత్మకమైన ఆయన ఉపన్యాసం ముగిసింది.

భారత సైనికుల జయజయ ధ్వానాలు మిన్నుముట్టాయి. ద్విగుణీకృతోత్సాహంతో వారందరు భారత జాతీయసేనలో చేరిపోయారు. జపాన్ ఇంపీరియల్ గార్డ్సు గూడా ఈ దృశ్యాన్ని చూస్తూ ఒక్కుమ్మడి నిశ్చేష్టులై పోయారు."

"...సింగపూరు పతనం."

".... 45 వేలమంది బ్రిటిష్ సైనికులు భారతీయులతో సహా స్వాధీనమయ్యారు. ఈ భారతీయ సైనికులను, అధికారులను తనతో కలుపుకుని యాభైవేలకు మించిన సుదృఢ సైనికశక్తిగా భారత జాతీయసైన్యం విజృంభించింది."

ఈ భారత జాతీయసైన్యం మన దేశంపై దండెత్తుతున్నప్పుడే, అహింసా కాంగ్రెసు వాదులు గూడా దేశమందంతటా అహింసా విప్లవాన్ని లేవదీశారు. "భారతదేశాన్నుండి వైదొలగండి, కాని మీ సైన్యాలను మాత్రం ఇక్కడే వుంచండి" ఇదీ వీరి నినాదం.

ప్రజానీకం ఈ వివాదంలో మొదటి భాగం మాత్రమే విన్నారు. అసంబద్ధమైన, అధైర్యాన్ని పురికొల్పే ఆ రెండో భాగాన్ని వారు వినలేదు. పర్యవసానంగా దేశం మొత్తం అట్టుడికినట్టు ఉడికిపోయింది. దేశభక్తులనే కాంగ్రెసువాదులు వందలాదిగా నిర్బంధితులై జైళ్లను నింపివేశారు. కాని భారతదేశానికావల మనవారు విజృంభిస్తున్న తీరు ఈ కాంగ్రెసువాదువల్ల బుద్ధిపూర్వకంగా మరుగున

పడింది. తమ అహింసాత్మక విధానం విఫలం కావడం అనుభవపూర్వకంగా తెలుసుకొని, తమను సాయుధ బలాలతో నిర్దాక్షిణ్యంగా అణచివేసే ప్రభుత్వ నిరంకుశత్వాన్ని ప్రతిఘటించడానికి తుదకువారు సాయుధ విప్లవపంథానే చేపట్టవలసి వచ్చింది.

వారందరు అజ్ఞాతవాసంలో వెళ్లారు. వెంటనే అహింసావాదుల రక్తపిపాసులైన విప్లవవీరులతో కూడిన కాంగ్రెసు రహస్య సంస్థగా పరిణమించింది.

**బ్రిటిష్‌వారు ఎందుకు వైదొలగారు?**

భారతదేశానికి బయట జాతీయసైన్యం తెస్తున్న వత్తిడి, లోపల కాంగ్రెస్ విప్లవవీరుల ప్రతిఘటన ఈ రెండింటి నడుమ ఇరుక్కొని బ్రిటిష్‌వారు సతమతమవుతున్న సందర్భంలో జపాన్‌లో మొట్ట మొదటిసారిగా అణుబాంబు బాంబు పడింది.

మిత్రమండలి వారి దిగ్విజయంతో యుద్ధం అకస్మాత్తుగా ఆగిపోయింది. అయితే ఆ విజయం బ్రిటిష్‌వారికి విజయంగా పరిణమించలేదు. యుద్ధం ముగిసేటప్పటికి భారతదేశానికి ప్రతిగా బ్రిటిష్‌వారి స్థితి ఈ క్రింది విధంగా వుంది.

1. ఉన్న మూడు సైనిక శాఖలలోను దాదాపు భారతీయులందరు విప్లవం లేవదీశారు. ఇంకా ఇతరులు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

2. ప్రత్యేకంగా ప్రజల స్వాతంత్ర్యోద్యమాన్ని అణచివేయడానికే తీసుకొచ్చిన బ్రిటిష్ సేనలతో 1857వ సంవత్సరం ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామాన్ని నిరోధించారు. కాని ఇప్పుడు జపాన్, జర్మనీలు యుద్ధంలో ఓడిపోయినప్పటికీ సోవియట్ రష్యా రూపంలో ఇంకొక నూతన శత్రువు వారి నెదిరిస్తున్నాడు. కాగా అణుబాంబు (అమెరికా ప్రయోగించినది) శత్రువులకే గాకుండా, అమెరికా మిత్రకూటమిలో నున్న బ్రిటన్‌కు కూడా భయభీతులు కల్గించింది. కనుక భారతదేశం వంటి సంపూర్ణ బ్రిటష్ వ్యతిరేకతతో విజృంభించే ప్రజాశక్తిని అణచడానికి, నిరంకుశత్వం చలాయించడానికి బ్రిటిష్ సేనలను పంపడం దుస్సాధ్యమైనది.

3. భారతదేశంలో విజృంభిస్తూన్న ప్రజా విప్లవానికి బ్రిటిష్‌వారు లొంగక తప్పింది గాదు.

బ్రిటిష్ పార్లమెంటులో భారత స్వాతంత్ర్య చట్టాన్ని ఆమోదిస్తూ అప్పటి ప్రధానమంత్రి అట్లీ, మాజీ ప్రధాని చర్చిల్ వేసిన ఒక ప్రశ్నకు సమాధానంగా "మన పోషణలోని సైన్యం ఎంత మాత్రం బ్రిటన్ పట్ల భక్తి విశ్వాసాలు కల్గి ఉండటం లేదు. భారతదేశాన్ని గుప్పిటలో ఉంచుకోవటానికి తగినంత పెద్ద సైన్యం ఇప్పుడు బ్రిటన్‌కు లేదు. కనుకనే బ్రిటన్ భారతదేశానికి అధికారాన్ని అప్పగిస్తున్నది" అన్నాడు.

ఈ ద్వంద్వమైన సైనిక బలహీనత బ్రిటిష్‌వారిని భారతదేశాన్నుండి వైదొలిగే పరిస్థితుల్ని తెచ్చిపెట్టింది. అంతేగాని వారి హృదయ పరివర్తనం మాత్రం దీనికి కారణం కాదు.

భారతదేశంలోనూ, బయటా 1906 నుండి 1947వరకు సాగిన జాతీయ అంతర్జాతీయ సైనిక విప్లవమే బ్రిటిష్‌వారిని లొంగ దీసిందన్న విషయం మన మెన్నటికి మరువవగూడని సత్యం –

దురదృష్టవశాత్తు ఈ క్లిష్ట సమయంలో బ్రిటిష్ వారితో సంప్రదింపులు జరపడానికి ప్రజాప్రతి నిధులుగా ఎన్నికైనవారు మాత్రం మనోధైర్యం లేనివారుగా ఉన్నారు.

ఆ విప్లవవీరులు పదే పదే వీరిని హెచ్చరిస్తూన్న ప్పటికీ –

భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నామని చాటుకొంటున్న యీ దుర్బలుల దుశ్చర్యల వల్ల 'క్విట్ ఇండియా' ఉద్యమం, స్ప్లిట్ ఇండియా'కు అంటే దేశ విభజనకు దారితీసింది.

జరిగిందేదో జరిగిపోయింది. మనమీనాడు సాధించవలసిన దానిని మన తత్వానికి చెందిన శక్తి మీద ఆధారపడి రేపు పూర్తి చేద్దాం. ప్రస్తుతం మనం సాధించినది కూడా ఈ వెయ్యి సంవత్సరాల చరిత్రలో సాటిలేని విజయం – ఈనాడు కనీసం ముప్పాతిక మువ్వీసం భారతవర్షమైనా బ్రిటిష్‌వారి ఘోర శత్రువు నుండి బైటపడింది.

– 18.2.55, జాగృతి సంచిక నుండి



## జాగృతి దీపావళి సంచిక చారిత్రక కరదీపిక!

దేశ విభజన స్వాతంత్ర్య భారత అవతరణ నుండి అత్యవసర పరిస్థితి, నేటి వికసిత అమృత భారతం దాకా ఎన్ని సంఘటనలు, ఎంత సంఘర్షణ, ఎన్ని రాజకీయ, సామాజిక, భాషా, సాంస్కృతిక ఉద్యమాలు! వీటి అన్నిటిని చాలా క్లుప్తంగా అందించటం అంటే నిజంగా కత్తిమీద సాము. కలంతో పోరాటమే! అయినా జాగృతి సంపాదకులు, వ్యాసకర్తలు, రచయితలు ఎంతో కష్టపడి ఈ జాతి చరిత్రను సంక్షిప్తంగా అందించటంలో కృతకృత్యులయ్యారు. స్వతంత్ర భారతంలో జన్మించిన అసంఖ్యాక తెలుగు పాఠకులకు, ముఖ్యంగా చరిత్ర యెడల అభిమానం, జిజ్ఞాస కలవారికి




ఈ సంచిక కరదీపిక, సమగ్ర చరిత్ర అధ్యయనానికి ఒక బ్లూప్రింట్. శత శత ధన్యవాదాలు.

–డా. కాశీవిశ్వేశ్వరశర్మ కల్లూరి, భాగ్యనగర్

## దీపావళి సంచికకు జేజేలు

జాగృతి దీపావళి సంచిక అద్భుతంగా వుంది. కథలు మరింత బావున్నాయి. పాఠకుల్ని ప్రతి వ్యాసం ఆకట్టుకున్నది. జాగృతి పుట్టుక నుంచి వున్న నేను ఇటువంటి సంచికను యెప్పుడు చూడలేదు వ్యాసాలలోని అంశాలు విపులంగా చక్కగా వున్నాయి. అలనాటి జాగృతి మొదలు నేటి జాగృతిలోని విషయాల్ని గుర్తు చేయడం ఆనందంగా వుంది. అట్ట మూడు మడతల్లో వుండడం అంతగా బాగాలేదు. అయోధ్య విషయాల్ని ప్రస్తావించడం ఇంకా బావుంది. సంఘ సారథుల ప్రస్థానాన్ని నేనే చూస్తున్నంత బాగా వుంది. వర్తమాన చరిత్రకు సంబంధించి మూడు ప్రభుత్వాల వివరాలు పాఠకున్ని ముగ్ధుల్ని చేస్తాయి. ప్రథమ స్వయం సేవకుడు వ్యాసం డాక్టర్జీ అద్భుత కల్పన చాలా బావుంది. మంత్రద్రష్ట కథ చాలా బావుంది.

– కె.వి.రమణమూర్తి, కాకినాడ

## పోతుగంటి సేవలు చిరస్మరణీయం



రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సూర్యాపేట జిల్లా జ్యేష్ఠ కార్యకర్త, గతంలో విభాగ్ వ్యవస్థా ప్రముఖ్ పనిచేసిన పోతుగంటి వెంకటేశ్వర్లు(73) జనవరి 9న స్వర్గస్థులయ్యారు. వారు సుమారు 45 సం.లుగా సంఘంలో అనేక బాధ్యతలు నిర్వహించారు. జాగృతి వార్తాపత్రిక ఏజెంట్‌గా విశేషమైన కృషి చేశారు. వెంకటేశ్వర్లు గడిపిన సాధారణ జీవితం, కలిగి ఉన్న మృదుస్వభావం నేటితరం స్వయం సేవకులకు ఆదర్శప్రాయం. వారి ఆత్మకు సద్గతులు కలగాలని భగవంతుని ప్రార్థిద్దాం!

శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అందించిన అక్షింతలు భారతదేశ మంతటా చేరుతున్నాయి. ఈ వితరణలో ఎందరో ప్రముఖులు పాల్గొంటున్నారు. వరంగల్ గ్రామీణ జిల్లాలో గవిచర్ల గ్రామంలో అక్షింతల వితరణ కార్యక్రమంలో బిహార్ హైకోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ లింగాల నరసింహా రెడ్డి పాల్గొన్న ప్పటి చిత్రం.






**భారతీయ కుటుంబ వ్యవస్థలో బాలురకు ప్రాధాన్యమిచ్చే సంస్కృతి ఇప్పటికీ కొన్నిచోట్ల రాజ్యమేలుతుంది. బాలబాలికల మధ్య వివక్ష కనిపిస్తున్నది. వారి మధ్య సామాజిక ఆర్థిక అసమానతలు ఉన్నాయి. కుటుంబ సామాజిక ఆర్థిక స్థితిగతులు కుమారుణ్ణి ఆస్తిగా, కుమార్తెను బాధ్యతగా భావించే సంప్రదాయం కొనసాగుతోంది. కుమార్తెను ఆర్థిక భారంగా భావించే సామాజిక పరిస్థితి వారి పాలిట శాపంగా మారిందని అనేక అధ్యయనాలు వెల్లడించాయి. నేటికీ పుట్టబోయే బిడ్డ ఆడశిశువు అని తెలియగానే గుట్టుచప్పుడు కాకుండా గర్భస్రావానికి పాల్పడుతున్న ఘటనలు కూడా బయటపడుతున్నాయి.**

1870లో బ్రిటిష్ ప్రభుత్వం ఆడశిశువు హత్యా నిరోధక చట్టం తెచ్చినప్పటికి అమలుకు నోచుకోలేదు. 2020 లో ఐరాస జనాభా నిధి సంస్థ విడుదల చేసిన నివేదిక ప్రకారం తల్లి కడుపులో పెరిగేది ఆడపిల్ల అని తెలిసిన మరుక్షణమే 4.58 కోట్లమంది బాలికలు హత్యకు గురైనారు. వాషింగ్టన్ కేంద్రంగా పని చేస్తున్న ప్యూ రీసెర్చ్ సెంటర్ అధ్యయనం ప్రకారం 2009-2019 ఒక దశాబ్ద కాలంలో 90 లక్షల మంది పిల్లలు మరణించారు.

**భ్రూణహత్యలు**

ఆడపిల్లను మైనస్ గా భావించి మగ శిశువును ప్లస్ గా పరిగణించే మానసిక స్థితి సమాజంలో నెలకొనడం వల్ల పుట్టుకతోనే ఆడపిల్లల భ్రూణ హత్యాలకు బలై వివక్షతకుగురౌతున్నారు. 1970 వ దశాబ్దంలో మగ పిల్లవాడు పుట్టే వరకు ఆడపిల్లలను కనేవారు. జనాభా పెరుగుదల సమస్యగా మారడంతో గర్భస్రావం ఒక పరిష్కారంగా ముందుకు వచ్చింది. 1990 దశాబ్దంలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ విధానాలు అందుబాటులోకి రావడం వల్ల భ్రూణహత్యలు ఎక్కువైనాయి. కేంద్ర ప్రభుత్వం గర్భస్థ శిశు లింగ నిర్ధారణ ప్రక్రియ నిషేధ చట్టాన్ని 1994లో ప్రవేశ పెట్టింది. 2004లో దానిని సవరించారు. అయినప్పటికి గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. భ్రూణ హత్యలకు పాల్పడిన వారికి, వారిని ప్రోత్సహించిన వారికి రూ. 50 వేలు జరిమానా, జైలు శిక్ష విధించాలన్న నిబంధనలు పాటించకపోవడం శోచనీయం.

**ఆడపిల్లల పట్ల నిర్లక్ష్యం**

కుటుంబం నుండే ఆడపిల్ల పెంపకంలో నిర్లక్ష్యానికి వివక్షకు గురికావడం విచారకరం. కుటుంబం నుండి మొదలైన వివక్ష, నిర్లక్ష్యం, చిన్నచూపు బాలికల అభివృద్ధికి వారి సాంస్కృతిక సాంఘిక, ఆర్థిక, సామాజిక వికాసానికి గొడ్డలి పెట్టుగా పరిణమించింది. సమస్యల విషవలయంలో చిక్కుకుపోయిన ఆడపిల్లల అభివృద్ధి, సంక్షేమం ఆశించిన మేరకు జరుగలేదు. ఆడపిల్లలను కించ పరచడం సామాజిక రుగ్మతైంది. పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత వల్ల ఆడబిడ్డను పోషించే స్థోమత లేక బడుగు బలహీనవర్గాలు, గిరిజన, కొండజాతి ప్రజలు ఆడ శిశువులను విక్రయింస్తున్న దుర్ఘటనలు కూడా వెలుగు చూస్తున్నాయి. కష్టపడి పెంచి చదువులు చదివించి నప్పటికీ పెళ్లి సమయంలో వరుడికి కట్న కానుకలు ఇవ్వాల్సి వస్తుంది. వరకట్న దురాచార రద్దు కోసం చేసిన చట్టాలు అమలు కావడంలేదు. ఇంకా విషాదం- ఆడబిడ్డ అని తెలిస్తే గర్భస్రావం చేసే వైద్య వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది. భార్యాభర్తల మధ్య గొడవలు, అల్పాదాయాలు ఆడపిల్లను కనటానికి కుటుంబ సభ్యుల మద్దతు లేకపోవడం, ప్రభుత్వం నుండి తగిన చేయూత లభించక పోవడం వంటి కారణాలు ఆడశిశువుల హత్యలను ఆపలేక పోతున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం మన దేశంలో ప్రతి 110 మంది బాలురకు కేవలం 100 మంది బాలికలే ఉన్నారని సర్వేల్లో తేలింది.

**చట్టాల విఫలం**

ప్రపంచం ఎంత ఆధునికమైందని చెబుతున్నా, మహిళల మీద అత్యాచార ఘటనలు జరుగుతున్నాయి. మహిళల అక్రమ రవాణా, దాడులు పెరుగుతున్నాయి. బాలికలకు విద్య, వైద్యం, ఆహారం, ఆరోగ్య సంరక్షణ, సామాజిక, భద్రత బాల్యవివాహాలు నుండి బాలికలకు విముక్తి కల్పించాలని ప్రవేశపెట్టిన అనేక చట్టాలు పథకాలు ఆశించిన ఫలితాలు సాధించలేదు. సమస్యలే ఆడపిల్లల ఆస్తులుగా, అవమానాలు, నిర్లక్ష్యం, అనారోగ్యం, వేతన వివక్ష వారికి ప్రధాన సమస్యలుగా పరిణమించాయి.

**రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం**

కేంద్ర ప్రభుత్వం 2015లో చేపట్టిన బేటీ బచావో బేటి పడావో పథకం ఆడపిల్లల అభివృద్ధికి వారి సాంఘిక ఆర్థిక వికాసం కోసం ప్రవేశపెట్టినదే. కానీ రాష్ట్ర ప్రభుత్వాల అమలులో నిర్లక్ష్యం వల్ల ఆశించిన ఫలితాలు రావడం లేదు. కేంద్ర మహిళా శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2015 ఏప్రిల్ నుండి జాతీయ బాలికా దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించడానికి నేషనల్ గర్ల్స్ డెవలప్‌మెంట్ మిషన్ కార్యక్రమ రూపకల్పన జరిగింది. బాలికల సంరక్షణ కోసం షరతులతో కూడిన ధనలక్ష్మి పథకం, కిశోరి శక్తి యోజన, సుకన్య సమృద్ధి యోజన, పౌష్టికాహార పథకం తదితర పలు పథకాలను ప్రభుత్వం అమలు చేస్తున్నది 1989వ సంవత్సరంలో ఐక్యరాజ్యసమితి బాలల హక్కుల అంతర్జాతీయ ఒడంబడికను రూపొందించి, సభ్య దేశాలలో ఆడపిల్లల సామాజిక, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కుల పరిరక్షణకు పూనుకున్నది.

**స్త్రీలలో నిరక్షరాస్యత**

జనాభాలో నేటికీ 20 కోట్లమంది మహిళలు నిరక్షరాస్యులుగా ఉన్నారు. వీరిని అక్షరాస్యులను చేసినపుడు మాత్రమే మహిళా సాధికారత సాధ్యమవుతుంది. రోజురోజుకీ ఆడపిల్లల సంఖ్య తగ్గడం వల్ల క్షీణిస్తున్న స్త్రీ పురుష నిష్పత్తి ఇలాగే కొనసాగితే చాలా సమస్యలు ఎదుర్కోవలసి వస్తుంది. 2011లో స్త్రీ పురుష నిష్పత్తి ప్రతి 1000 మంది పురుషులకు 940 మంది



**నేదునూరి కనకయ్య**
అధ్యక్షులు, తెలంగాణ ఎకనామిక్ ఫోరం, కరీంనగర్



# లను ఆదరిద్దాం!

స్త్రీలు ఉన్నారు. ఇందులో ఆరు సంవత్సరాలలోపు వయసు కలిగిన బాలికలు ప్రతి వెయ్యి మంది బాలురకు 914 మంది మాత్రమే ఉన్నారు. బాల్యవివాహాలు దేశంలో 26.5 శాతం. బలవంతపు బాల్యవివాహాలు ఇంకా జరుగుతున్నాయి. ప్రపంచంలో జరుగుతున్న 40 శాతం బాల్యవివాహాలు మన దేశంలో జరుగుతున్నాయని యూనిసెఫ్ వెల్లడించింది. మన దేశంలో జరుగుతున్న బలవంతపు బాల్య వివాహాలలో 40 శాతం పశ్చిమ బెంగాల్లో చోటుచేసుకోవడం గమనార్హం.

**బాలికలు - పేదరికం**

బాలికలకు ఉన్నత విద్య సమస్యగా మారింది. నేటికీ 40 శాతం పైగా బాలికలు పదవ తరగతి కంటే ముందే బడి మానేస్తున్నారు. బడి మానుకొని గ్రామాలలో వ్యవసాయ రంగంలో, అసంఘటిత ప్రైవేట్ రంగంలో బాల కార్మికులుగా పనిచేస్తున్నారు. శ్రమ దోపిడీకి, లైంగిక వివక్షకు గురవుతూ తమ అమూల్యమైన బాల్యాన్ని పేదరికం, ఆకలిచావులు, అల్ప పౌష్టికాహారం వల్ల అనారోగ్యానికి గురౌతున్నారని అనేక అధ్యయనాలల్లో తేలింది.

**బాలికల సంరక్షణ చర్యలు**

బాలికల సమగ్ర వికాసానికి సంరక్షణకు అవసరమయ్యే విధానాలను ప్రభుత్వం అమలు చేయాలి. బాలికల భద్రత, లింగ నిష్పత్తి, విద్య, వైద్యం, ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి. బాలికల అభివృద్ధే లక్ష్యంగా జాతీయ విద్యా విధానంలో పలు పథకాలు ప్రవేశపెట్టడం, బాలికలకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించడం సమాన విద్యావకాశాల సాధనకు ప్రతేక నిధిని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం అభినందనీయమైన చర్య. బాలికల హక్కులకు రక్షణ, భద్రతలను సామాజిక బాధ్యతగా గుర్తించాలి. మగపిల్లలతో పోటీపడేలా ప్రోత్సహించాలి. అన్ని రంగాలలో సమాన అవకాశాలు కల్పించాలి. ఆడపిల్లల అభివృద్ధిని దేశాభివృద్ధిగా భావించాలి. ఆడపిల్లలు మానవ వనరులుగా ఎదగడానికి, పురోగతికి తోడ్పడానికి ప్రభుత్వం చేయూతనివ్వాలి. బడుగు బలహీన వర్గాల్లో బాలికలకు ఉచిత విద్య వైద్యం అందించాలి.

బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణా, అత్యాచారాలు, లైంగిక వివక్ష మొదలైన సమస్యల నుండి ఆడపిల్లలను సంరక్షించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి. పౌరసమాజం యువజన సంస్థలు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఆడపిల్లల హక్కుల రక్షణకు పాటుపడాలి. ప్రభుత్వం బాలికలకు ఆధునాతన సాంకేతిక ఉన్నత విద్య, ఉపాధి కల్పన విద్యను ఉచితంగా అందుబాటులోకి తేవాలి. బాలికలకు వృత్తి నైపుణ్య విద్యను అందించాలి. బాలికల సామాజిక ఆర్థిక స్థాయి పెంచే పథకాలను అమలు చేయాలి.

**మహిళా సాధికారత**

ప్రభుత్వం మహిళా సాధికారత సాధనకు ఉద్యమించాలి. శాస్త్ర సాంకేతిక, 'పారిశ్రామిక, వ్యవసాయ, వ్యాపార, వాణిజ్య, రాజకీయ రంగాలలో మహిళా వికాసానికి ప్రభుత్వం పెద్ద పీట వెయ్యాలి. బాలికలకు ప్రత్యేక పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేసి ఇంటర్మీడియెట్ వరకు ఉచిత వొకేషనల్ విద్య అందించాలి. భ్రూణహత్యలకు దారితీసే పరిస్థితులపై పోరాడే చట్టాలను పటిష్టంగా అమలు పరచాలి. వరకట్న నిషేధ చట్టం1961 లైంగిక నేరాల నుండి ఆడ పిల్లలకు రక్షణ కల్పించే చట్టం – 2012ను సమర్థంగా అమలు చేయాలి. మగ పిల్లల కోసం ఎదురుచూస్తున్న దంపతులను ఆశా కార్యకర్తలు అంగన్ వాడి కార్యకర్తలు గుర్తించి గర్భస్రావం వల్ల కలిగే అనారోగ్యం నష్టాల పట్ల కౌన్సెలింగ్ ఇవ్వాలి. ప్రతి గ్రామంలో గ్రామసభ, తల్లుల సంఘాలు, మహిళా సంక్షేమ చట్టాలు భ్రూణహత్యలకు పాల్పడితే వేసే జరిమానాలు, శిక్షల పట్ల చర్చలు జరపాలి. అవగాహన చైతన్యం కలిగించాలి.

ఆడపిల్లలను పుట్టనిద్దాం, బతుకనిద్దాం, చదువనిద్దాం ఎదగనిద్దాం అన్న నినాదం విధానమైనప్పుడే బాలికల సంక్షేమాభివృధి, భద్రత, సమగ్ర అభివృద్ధి సాధ్యం. అమ్మాయి లేనిదే అవని లేదు. స్త్రీ లేకపోతే సృష్టిలో జీవం లేదు. స్త్రీ లేకపోతే అసలు సృష్టి లేదు. అందువల్ల ఆడపిల్లలను రక్షించుదాం. అమ్మాయిలను ఆదరిద్దాం. బాలికల భవితకు బంగారు బాటలు వేద్దాం. ★

బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణా, అత్యాచారాలు, లైంగిక వివక్ష మొదలైన సమస్యల నుండి ఆడపిల్లలను సంరక్షించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి. పౌరసమాజం యువజన సంస్థలు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఆడపిల్లల హక్కుల రక్షణకు పాటుపడాలి. ప్రభుత్వం బాలికలకు ఆధునాతన సాంకేతిక ఉన్నత విద్య, ఉపాధి కల్పన విద్యను ఉచితంగా అందుబాటులోకి తేవాలి. బాలికలకు వృత్తి నైపుణ్య విద్యను అందించాలి. బాలికల సామాజిక ఆర్థిక స్థాయి పెంచే పథకాలను అమలు చేయాలి.



భారతదేశానికి సంబంధించి ఇటీవల రెండు అద్భుత దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. హిందుత్వవాద ప్రభుత్వమని, ఇక్కడ ముస్లిం మైనార్టీలకు రక్షణ లేదంటూ ప్రచారం చేస్తూ, ఊదరగొట్టే ఉదార, వామపక్షవాదుల నోళ్లు మూతవేయించే ఈ రెండు ఘట్టాలూ చారిత్రకమైనవి. మొదటిది, ముస్లిం రాజ్యమైన యుఎఇ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ ఆల్ నహ్యాన్ గుజరాత్‌లో జరుగుతున్న ‘వైబ్రెంట్ గుజరాత్’ సదస్సుకు స్వయంగా హాజరుకావడం. రెండవది మైనార్టీ వ్యవహారాల మంత్రి శ్రీమతి స్మృతి ఇరానీ మదీనాలో పర్యటించడం.



# జంబూద్వీపంలో

ప్రధానమంత్రి తానుగా వెళ్లి యుఎఇ అధ్యక్షుడు జాయెద్‌కు స్వాగతం పలికి, రోడ్‌షో నిర్వహించి ఆయనను ఆదరించడం అందరినీ ఆశ్చర్యపరచింది. ముఖ్యంగా, ముస్లిం మైనార్టీలను ఊచకోత కోశారంటూ ఆ ఘటన జరిగినప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న మోదీని నేటికీ నిందించే సందర్భం ఉన్నప్పటికీ గుజరాత్ ప్రజలు ఈ రోడ్ షోలో పాల్గొన్న తీరుతో మహమ్మద్ బిన్‌కు దాని గురించి ఏమైనా సందేహాలు ఉండి ఉంటే అవి తీరిపోయిఉంటాయి. సదస్సుకు హాజరవడానికి గుజరాత్‌లో అడుగు పెట్టీపెట్టగానే, ప్రధాని మోదీ ‘కొద్దిసేపటి కిందే గుజరాత్‌లో దిగాను. రానున్న రెండురోజుల్లో వైబ్రెంట్ గుజరాత్ సదస్సులోనూ, తత్సంబంధిత కార్యక్రమాల్లోనూ పాల్గొంటాను. ఈ సదస్సు సందర్భంగా ప్రపంచ దేశాలకు చెందిన పలువురు నాయకులు మమ్మల్ని కలుస్తారన్నది ఎంతో సంతోషకరమైన విషయం. నా సోదరుడు హిజ్ హైనెస్ మహమ్మద్ బిన్ జాయెద్ రాక అన్నది ఎంతో ప్రత్యేకమైనది. వైబ్రెంట్ గుజరాత్ సదస్సుతో నాకు సన్నిహిత సంబంధం ఉంది, ఈ వేదిక కేవలం గుజరాత్ వృద్ధికి దోహదం చేయడమే కాదు పలువురికి అవకాశాలను సృష్టించింది,’ అంటూ సుదీర్ఘమైన ట్వీట్‌ను పోస్ట్ చేశారు. అయోధ్యలో నిర్మించిన రామాలయంలో బాలరాముని విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ జరుగనుండగా ఇది జరగడం అత్యంత విశేషమనే చెప్పుకోవాలి.

ఇది జరుగుతున్న సమయంలో మరొక మహత్తర ఘటన దేశం బయటచోటు చేసుకుంది.

**మదీనాలో మైనార్టీ వ్యవహారాల మంత్రి స్మృతి ఇరానీ**

అదే, మహమ్మద్ ప్రవక్త వలస వచ్చినట్టుగా, నివసించినట్టుగా చెప్పే సౌదీ అరేబియా రాజ్యానికి భారత మైనార్టీ వ్యవహారాల మంత్రి స్మృతి జుబిన్ ఇరానీ సందర్శించడమే కాదు, భారతీయ వేషభాషలతో ఆమె అక్కడ మదీనాకు వెళ్లడం సంచలనాన్ని సృష్టిస్తోంది. ముఖ్యంగా, భారత దేశంలో ముస్లింలు, వారికి అనుకూల వర్గాలమని చెప్పుకునే వామపక్ష మేధావులూ కాలం చెల్లిపోయిన ‘హిజాబ్’ సంస్కృతిని, అందుకోసం ఉద్యమాలను సమర్థిస్తుండగా, తనదైన భారతీయ వస్త్రధారణతో (చీర కట్టుతో), కనీసం నెత్తిపై అబాయా లేదా హిజాబ్ వంటివేవీ లేకుండానే చారిత్రిక నగరమైన మదీనాలో కేంద్ర మైనార్టీ వ్యవహారాలు, మహిళా శిశు సంక్షేమశాఖల మంత్రి స్మృతి జుబిన్ ఇరానీ, తన ప్రతినిధి బృందంతో కలిసి పర్యటించడం అతిపెద్ద



యుఎఇ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ ఆల్ నహ్యాన్‌తో ప్రధాని మోదీ




# సమైక్యత

విశేషం. ముస్లింలను విమర్శించే పార్టీకి చెందిన మంత్రిని, అందునా మహిళను, ముఖ్యంగా తలపై ఎటువంటి ఆచ్ఛాదనా లేకుండా అనుమతించడాన్ని బీజేపీని వ్యతిరేకించే వర్గాలు అన్నీ కూడా తప్పు పడుతున్నాయి. సోషల్ మీడియా 'ఎక్స్' వంటివాటిపై ఈ అంశంపై ఆరోపణలు, నిందలు, ప్రత్యారోపణలు ప్రారంభమయ్యాయి. వెళ్లింది మహిళ మాత్రమే కాదు, హిందువు కావడం కూడా ఈ తుపానుకు కారణమైంది. ఈ క్రమంలోనే పాకిస్తానీలు ప్రిన్స్ సల్మాన్ పతనం ప్రారంభమైందంటూ 'ఎక్స్' వంటి సోషల్ మీడియా వేదికలపై తమ అక్కసును వెళ్లగక్కడం ప్రారంభించారు.

ఇందుకు కారణం, నిన్న మొన్నటి వరకూ ముస్లింలకు అత్యంత ప్రాధాన్యత కలిగిన నగరం మదీనాలో ముస్లిమేతరులు ప్రవేశించడమన్నది నిషేధం. ఈ నగరంలోకి ప్రవేశించి, చారిత్రిక ప్రదేశాలను పర్యటించిన తొలి ముస్లిమేతర బృందం ఈ క్రమంలోనే ఇరానీ నేతృత్వంలోనిదే అని చెప్పవచ్చు. తమకు ఆ ప్రాంతంలో పర్యటించేందుకు అనుమతి ఇవ్వాలని మంత్రి కోరిన నేపథ్యంలో సౌదీ అధికారులు వారికి ప్రత్యేక అనుమతి ఇచ్చారు. ఈ బృందంలో విదేశాంగ వ్యవహారాలు, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి వి. మురళీధరన్ కూడా ఉన్నారు. భారత్ నుంచి వార్షిక హజ్ యాత్రకు వెళ్లే యాత్రికుల కోటాను, ఏర్పాట్లను ఖరారు చేసేందుకు ఆయన కూడా ఈ పర్యటనకు వెళ్లారు. ఈ బృందం కూర్పులోనే ప్రత్యేకత ఉంది. ఇరానీతో పాటుగా, కశ్మీరీ పండిట్, ఐఆర్ఎస్ అధికారి అయిన నిరుపమ కొట్రు మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి హోదాలో ఈ బృందంలో భాగమయ్యారు.

మహిళలిద్దరూ–ఒకరు చీరలో, మరొకరు సెల్వార్ కమీజ్‌లో స్వేచ్ఛగా మదీనా పరిసరాలలో సంచరించడం గమనించిన వారికి గతంలో వివాదాలు గుర్తురాక మానవు. గతంలో సౌదీకి అధికారిక పర్యటనలకు వెళ్లినప్పుడు హిజాబ్ ధరించేం దుకు మహిళా ప్రతినిధులు తిరస్కరించి నప్పుడు ఎంతటి వివాదాలో చెలరేగుతుండేవి. అయితే, 2019లోనే తప్పనిసరిగా బహిరంగ ప్రదేశాలలో హిజాబ్ తప్పనిసరిగా ధరించాలనే నిబంధనలో మార్పులు చేయడం వల్ల ఇప్పుడు అటువంటి వివాదాలకు తావు లేకుండా పోయింది.

ఈ క్రమంలోనే తన మదీనా పర్యటనకు సంబంధించిన ఫోటోల కొలాజ్‌ను 'ఎక్స్'లో పోస్టు చేస్తూ, "ఇస్లాంలో అత్యంత పవిత్ర నగరమైన మదీనాకు నేడు చరిత్రాత్మక ప్రయాణం చేపట్టాను. దీనితో పాటుగా ప్రవక్తకు చెందిన మసీదు– అల్ మస్జిద్ అల్ నబ్వీ పరిసరాలను, ఉహుద్ పర్వతం, ఇస్లాంలో తొలి మసీదు అయిన కాబా మసీదు సరిహద్దులలో పర్యటించాము. తొలి ఇస్లామిక్ చరిత్రతో ముడిపడి ఉన్న ఈ పర్యటన సౌదీ అధికారుల సౌజన్యంతో మేం చేయగలగడం అన్నది ఇరు దేశాల సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంబంధాల లోతును పట్టి చూపుతుంది," అని పేర్కొన్నారు.

అంతకు ముందు జెద్దా సచేతన సాంస్కృతిక వైభవాన్ని పరిరక్షించే, యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా ప్రకటించిన, అల్– బలాద్ సాంస్కృతిక వైభవాన్ని ఇరానీ బృందం అన్వేషించింది. కింగ్డమ్ ఆఫ్ సౌదీ అరేబియాకు చెందిన హజ్ మంత్రి డా॥ తౌఫిక్ బిన్ ఫౌజాన్ అల్ రబియాతో 2024లో ఇరానీ ద్వైపాక్షిక హజ్ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం, భారత్‌కు ఈ ఏడాది హజ్ యాత్రికుల కోటా 1,75,025 మందిగా ఉంది. వీరిలో 1,40,020 మంది హజ్ కమిటీ ద్వారా మక్కా వెళ్లనున్నారు. మిగిలినవారు ప్రైవేట్ టూర్ ఆపరేటర్ల ద్వారా తమ హజ్ యాత్రను పూర్తి చేయనున్నారు.

ముస్లిమేతర బృందాన్ని మదీనాకు ఆహ్వానించడమనే సౌదీ చేపట్టిన అసాధారణ చర్య, భారత్ – సౌదీ అరేబియాల మధ్య ఉన్న ద్వైపాక్షిక సంబంధాల బలాన్ని పట్టి చూపుతోంది. ఇరు దేశాలు బలమైన సంబంధాలను కొనసాగించాలనే సంకల్పంతో ఉన్న నేపథ్యంలో ఈ పర్యటన మతపరమైన, సాంస్కృతిక మార్పిడి రంగాలలో



మంత్రి వి. మురళీధరన్, ఇతర అధికారులతో సౌదీ అరేబియాలో మదీనాను సందర్శించిన మంత్రి స్మృతీ ఇరానీ

పరస్పర అవగాహన, సహకారానికి దోహదం చేస్తుంది. ఈ ప్రతినిధి బృందంలో మైనార్టీ వ్యవహారాలు, విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారులుండటం అన్నది ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికే కాదు, రానున్న హజ్ యాత్ర సందర్భంగా చేయవలసిన ఏర్పాట్లకు సంబంధించిన విలువైన అంశాలను తెలుసుకోవడానికి ఉద్దేశించింది.

2024 హజ్ యాత్ర సందర్భంగా భారతీయ యాత్రికులకు సౌకర్యాలు, సంక్షేమం కోసం అవసరమైన సూక్ష్మ, సంక్లిష్ట ఏర్పాట్ల గురించి ప్రత్యక్ష వివరాలు తెలుసుకునే సంభావ్యత ఉండటమే ఈ పర్యటనలో మరొక కీలకాంశం, లక్ష్యం. లక్షల సంఖ్యలో హజ్ యాత్రలో పాల్గొనే భారతీయ ముస్లింలకు సౌకర్యవంతమైన, ఆధ్యాత్మికంగా సఫలీకృతమైన భావనను ఇచ్చేందుకు అవసరమైన సౌకర్యాలను, సేవలు అందచేయాలన్న తన లోతైన నిబద్ధతకు కట్టుబడి ఉంటామని భారతీయ ప్రభుత్వం పునరుద్ఘాటించింది.

ఈ పర్యటనలో భాగంగా, హజ్ వాలంటీర్లు, సంఘ సభ్యులతో, భారతీయ సంతతికి చెందిన వారితో ఇరానీ చర్చలు నిర్వహించారు. ముఖ్యంగా భారత్ నుంచి వచ్చిన ఉమ్రా యాత్రికులతో ముచ్చటించినప్పుడు భారతీయ ముస్లింలు తీర్థయాత్రలకు వెళ్లినప్పుడు వారు వైవిధ్యమైన అవసరాలు, కోరికల గురించి సమగ్ర అవగాహన బృందానికి కలిగింది. అంతేకాకుండా, బలమైన ద్వైపాక్షిక సంబంధాలను పెంచిపోషించడంలో ఆర్థిక సంబంధాలు ఎలా కీలకపాత్ర పోషిస్తాయో నొక్కి చెప్తూ ఆమె సౌదీ, భారతీయ వాణిజ్యవేత్తలతో కూడా చర్చలు జరిపారు.

### మదీనా ప్రాముఖ్యం

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలకు మతపరమైన ప్రాముఖ్యతను కలిగిన, ఇస్లాంలోనే అత్యంత పవిత్ర నగరాలలో ఒకటి మదీనా. సౌదీ అరేబియాలోని హెజాజ్ ప్రాంతంలో ఉన్న మదీనాకు అంత ప్రాముఖ్యం ఉండటానికి కారణం, అది, మహమ్మద్ ప్రవక్త వలస వచ్చిన నగరమనే విశ్వాసం. దీనితోనే ఇస్లామిక్ కేలెండర్ ప్రారంభమవుతుంది. దీనితోపాటుగా, మస్జిద్ నబావీ (ప్రవక్త విశ్రమించిన ప్రదేశం), ఉహుద్ పర్వతం, మహమ్మద్ ప్రవక్త ప్రపంచంలోనే తొలిసారి నిర్మించిన మసీదు అయిన మస్జిద్ కాబా అన్నవి ముస్లింలకు అత్యంత పవిత్ర ప్రదేశాలు.

తన సౌదీ అరేబియా పర్యటన అనుభవాన్ని గురించి మాట్లాడుతూ, ఒక మహిళగా మదీనాలో ఉన్నప్పుడు నాకు సాధికారత ఉంది అనే భావనకు లోనయ్యాను. తలపై ఎటువంటి ఆచ్ఛాదనా లేకుండా స్మృతి ఇరానీ, నేను కలిసి మదీనా అంతా కలియతిరగడం అన్నది అత్యంత అరుదు, ఒక చారిత్రిక సందర్భం. మంత్రి ఇరానీ విజ్ఞప్తి మేరకు, మదీనాలోని గల మూడు ముఖ్యమైన ప్రదేశాలను సందర్శించేందుకు సౌదీ ప్రభుత్వం మాకు ప్రత్యేక అనుమతిని ఇచ్చింది అని నిరుపమ కొట్రు చెప్పడం విశేషం.



యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం జెడ్డాలోని అల్-బలాద్ బయట మన మంత్రులు

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలకు మతపరమైన ప్రాముఖ్యతను కలిగిన, ఇస్లాంలోనే అత్యంత పవిత్ర నగరాలలో ఒకటి మదీనా. సౌదీ అరేబియాలోని హెజాజ్ ప్రాంతంలో ఉన్న మదీనాకు అంత ప్రాముఖ్యత ఉండటానికి కారణం, అది, మహమ్మద్ ప్రవక్త వలస వచ్చిన నగరమనే విశ్వాసం. దీనితోనే ఇస్లామిక్ కేలెండర్ ప్రారంభమవుతుంది.

### ఉలిక్కిపడ్డ ప్రపంచం

ఇటీవలి కాలంలో సౌదీ అరేబియాకు, భారత్‌కు మధ్య సంబంధాలు బలపడుతు న్నాయన్న విషయాన్ని అటు భారత్, ఇటు సౌదీ అరేబియా కూడా బహిరంగంగానే ప్రదర్శిస్తున్నాయి, ప్రకటిస్తున్నాయి. అయితే, ఒక మహిళను తలపై ఆచ్ఛాదన లేకుండా మదీనాకు అనుమతించేతగా బలపడ్డాయని ఎవరూ ఊహించి ఉండరు. పరిమిత వనరు అయిన పెట్రోలు మీదే శాశ్వతంగా ఆధారపడలేమనే విషయాన్నే కాదు, అమెరికా చేతిలో కీలు బొమ్మ అయి వారి పెట్రో డాలర్ల కోసం ఇస్లామిక్ తీవ్రవాదాన్ని రెచ్చగొట్టే ముల్లాలకు, తీవ్రవాద గ్రూపులకు నిధులు సమకూర్చి తాము ఎంతగా నష్టపోతున్నామో సౌదీ అరేబియా యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ గ్రహించిన తర్వాత ఆసియా ప్రాంతంలో బలపడుతున్న భారత్‌తో సంబంధాలను సానుకూలం చేసుకోవడం ప్రారంభించారు.

అంతేకాదు, భారతీయ సంస్కృతిలో ఉన్న యోగ, ఆయుర్వేదంను అనుసరించడంతో పాటుగా రామాయణ, మహాభారతాలను పాఠ్యాంశాలుగా ప్రవేశపెట్టేందుకు అంగీకరించేంతగా భారతీయత పట్ల ఆయన ఆకర్షితులయ్యారు. ఈ క్రమంలోనే ఇస్లాంలో కూడా అనేకానేక సంస్కరణలను తీసుకువచ్చేందుకు సౌదీ అరేబియా, యుఎఇ వంటి దేశాలు ప్రయత్నం చేస్తున్నాయి.

### తస్లీమా నస్రీన్ స్పందన

సౌదీ అరేబియాకు వెళ్లే ఇతర మహిళా పర్యాటకులలాగా తలకు హిజాబ్ చుట్టుకోనందుకు నేను స్మృతి ఇరానీకి శాల్యూట్ చేస్తున్నాను. మహమ్మద్ సమాధి అయిన గ్రీన్ డోమ్‌ను కూడా ఆమె సందర్శించాలి.


#SaudiArabia #BreakingTheTaboo

అంటూ సోషల్ మీడియా ‘ఎక్స్’పై ఆమె అభినందనలు తెలిపారు. దీనితో పాటుగా ఆమె, ఒకవైపు సౌదీ అరేబియా ఇస్లామిక్ సంస్కరణల దిశగా వెడుతుండగా, బంగ్లాదేశ్ ఆ ఆలోచన చేయకపోవడం, మూఢత్వంతో కొట్టుకుపోవడం పట్ల ఆవేదనను వ్యక్తం చేశారు.

తాజాగా, భారత్ నుంచి వెళ్లిన అందరూ హిందువులతో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని, ముఖ్యంగా మహిళ, మంత్రి అయిన స్మృతి ఇరానీని హిజాబ్ లేకుండా మదీనాలోకి అనుమతించడం కూడా అక్కడ చేపట్టిన సంస్కరణల్లో భాగంగానే చూడాలి. పరమత సహనం, ఉదారవాదం గురించి హిందువులకు నిత్యబోధలు చేసే మేధావులకు ఇది నచ్చడం లేదు. అందులోనూ అయోధ్యలో అంత భారీ కార్యక్రమానికి ముందు ఒక హిందువు బృందం సౌదీ అరేబియాకు వెడితే, ఇతర ఇస్లామిక్ దేశాలు నోరు మెదపకపోవడం వారికి నచ్చడంలేదు.

ఈ విషయంపై ఇస్లాం పరిరక్షక దేశమైన పాకిస్తాన్ ఇంకా అధికారికంగా తన అమూల్యమైన అభిప్రాయాన్ని వెల్లడించలేదు. ★

జాగృతి డెస్క్



భారతమాత జన్మనిచ్చిన మేధావులలో ఒకరు డా॥ బీఆర్ అంబేడ్కర్. ఆయన రాజకీయ, సామాజిక భావనలు నాడు భారతదేశంలో సంచలనం రేకెత్తించాయి. ఏకీభావాన్ని కూడగట్టలేకపోయినా రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పాత్ర మహత్తరమైనది. నాడు సమాజానికి దూరంగా ఉన్న దళితులు విదేశీ క్రైస్తవ మిషనరీల కౌగిలిలోకి వెడుతున్న సమయంలో ఆయన తన వర్గాన్ని వారి వలలో చిక్కనివ్వలేదు. తన జీవిత చరమాంకంలో హిందూత్వం కన్నా బౌద్ధం మేలైనదన్న అభిప్రాయంతో ఆయన దానిని స్వీకరించినప్పటికీ, హిందూ సమాజం ఆయనను స్వీకరించింది. సమసమాజాన్ని కోరుకున్న దార్శనికుడిగా గౌరవించింది.

# భారతీయ ఆత్మ డా॥ అంబేడ్కర్

ఆదర్శ సమాజం ఎప్పుడూ చలనశీలంగా, ఒక అంగంలో జరుగుతున్న మార్పు గురించి ఇతర అంగాలకు తెలిపేందుకు పలు మార్గాలతో నిండి ఉం డాలి. ఒక ఆదర్శ సమాజం పలు ప్రయోజనాల గురించి పూర్తి చైతన్యంతో అందరికీ తెలపాలి, వాటిని పంచుకోవాలన్నది డా॥ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆలోచన. అందుకు అనుగుణంగానే ఆయన బడుగు బలహీనవర్గాలు సహా ఎవరి ప్రయోజనాలను విస్మరించకుండా రాజ్యాంగాన్ని రూపొందించారు. స్వతంత్ర భారతదేశంలో న్యాయశాఖ మంత్రిగా ఉన్న ఆయన కుల, జాతి వివక్షలకు తావులేని, చట్టం ముందు ఒకరే భావనను ముందుకు తీసుకువెళ్లారు. ప్రజాస్వామ్యం అంటే కేవలం ప్రభుత్వానికి ఒక రూపం కాదని, అది సౌభ్రాతృ త్వానికి మరొక పేరన్నది ఆయన భావన. అది ప్రాథమికంగా తన తోటివారి పట్ల గౌరవ మర్యాదలతో కూడిన వైఖరి అని ఆయన అంటారు.

అందుకే ఒక నిర్మాణాత్మక సంఘ సంస్కర్తగా, న్యాయ కోవిదుడిగా ఆయన తన కాలంలో చేసిన వాదనలు, ఉపన్యాసాలు నేటికీ ప్రాసంగికతను కలిగి ఉం డటమే కాదు, ప్రతి రాజకీయ నాయకుడి ఆలోచనను మలుస్తున్నాయి. "నన్ను అడిగితే, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంపై ఆధారపడిన సమాజమే ఆదర్శ మైనది" అంటూ ఆయన కులనిర్మూలన గ్రంథంలో రాసిన మాటలు హిందూ జీవన విధానం ప్రతిపాదించినవాటికన్నా భిన్నమైనవి కానప్పటికీ, మధ్య యుగాలలో ఘటనల కారణంగా ఏర్పడిన పరిస్థితుల వల్ల కొత్తగా అనిపిస్తాయి. వాస్తవానికి, నేడు వెనుకబడిన వర్గాలుగా చెప్తున్న సమాజం నుంచి వచ్చిన వాల్మీకి నుంచి వేమన వరకు మహనీయులుగా గుర్తించి, గౌరవించి, ఆదరించిన సమాజం ఇది. ఆ విషయాన్నే డా॥ అంబేడ్కర్ భారతీయ సమాజానికి కాసింత కటువుగానే గుర్తు చేశారని చెప్పాలి. భారతదేశం స్వాతంత్ర్యం సాధించిన అనంతరం కేవలం తొమ్మిది సంవత్సరాలే జీవించిన డా॥ అంబేడ్కర్ ఆధునిక భారతదేశ చరిత్రపై చెరగని ముద్ర వేశారన్నది సుస్పష్టం. ఆయన మధ్యప్రదేశ్‌లోని మావ్ మిలిటరీ కంటోన్మెం ట్‌లో ఒక మహర్ కుటుంబంలో ఏప్రిల్ 14, 1891న జన్మించారు, డిసెంబర్ 6, 1956న మరణించారు. భారత రాజ్యాంగ సభ చైర్మన్‌గా రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పాత్ర అవిస్మరణీయమైంది. "కులాలు అనేవి మొదటగా దేశ వ్యతిరేకమైనవి, ఎందుకంటే అవి సామాజిక జీవితంలో వేర్పాటుకు కారణం అవుతాయి. అవి దేశ వ్యతిరేకమైనవి, ఎందుకంటే, ఒక కులానికి మరొక కులానికి మధ్య అసూయను, విద్వేషాన్ని సృష్టిస్తాయి. మనం వాస్తవ రూపంలో ఒక జాతిగా మారాలని భావిస్తే మనం ఇటువంటి కష్టాలన్నింటినీ అధిగమించాలి. జాతి ఉన్నప్పుడు మాత్రమే సౌభ్రాతృత్వమనేది వాస్తవ రూపం దాల్చగలదు. సౌభ్రాతృత్వం, సమానత్వం, స్వేచ్ఛ లేకుండా లోతైన మెరుగులు ఉండవు," ఇవి రాజ్యాంగాన్ని ఆమోదించడానికి ఒక రోజు ముందు, అంటే నవంబర్ 25, 1949న రాజ్యాంగ సభలో ఇచ్చిన ఆఖరి ఉపన్యాసంలో డా॥ అంబేడ్కర్ చెప్పిన మాటలు ఇవి. ఎంత మాత్రం సత్యదూరమైనవి కానివి.

ఏ దేశానికైనా రాజ్యాంగం రచించడమన్నది సులువైన పని కాదు. ముఖ్యంగా వందలాది కులాలు, జాతులు, మతాలు, సంప్రదాయాలు, విశ్వాసాలు ఉన్న భారత్ వంటి దేశాల్లో ఇది మరింత కష్టం. కనుక, ప్రపంచ రాజ్యాంగాలపై మంచి పట్టు, అద్భుతమైన రాజకీయ పరిజ్ఞానం, గతాన్ని అధ్యయనం చేసి, వర్తమానాన్ని విశ్లేషించి, భవిష్యత్తును దర్శించగల ఒక గొప్ప తాత్వికత అవసరం. అంతేకాదు, వివిధ నాగరికతలు, సమాజాలు, సంస్కృతుల మధ్య ఉన్న బేధాల గురించి అవగాహన కలిగి ఉండటం, ప్రపంచ చరిత్ర, ప్రజాస్వామ్యం, అరాచకత్వం సామ్రాజ్యవాదం గురించి లోతైన అవగాహన, వివిధ పాలనలు, వాటి శాఖల గురించి పరిజ్ఞానం కలిగి ఉండటం అవసరం. అన్ని దేశాల సామాజిక వ్యవస్థల పట్ల, చట్టాల పట్ల లోతైన అవగాహన కలిగి ఉన్న వ్యక్తి మాత్రమే రాజ్యాంగానికి రూపకల్పన చేయగలరని, అటువంటి వ్యక్తి డా॥ బీఆర్ అంబేద్కరేనని నాడు పలువురి నాయకుల మన్ననలు అందుకున్న వ్యక్తి ఆయన. అంటే ప్రభుత్వానికీ, అది పాలించే ప్రజలకు మధ్య ఉండే సామాజిక ఒప్పందమే రాజ్యాంగం. ఒక దేశంలో ప్రభుత్వ చట్రంలో అంతర్లీనంగా ఉండే ప్రాథమిక సూత్రావళి అని కూడా చెప్పవచ్చు. కనుక, రాజ్యాంగం కలిగిన దేశంలో ప్రతి వ్యక్తినీ అతడి హోదా, స్థాయితో సంబంధం లేకుండా సమానంగా పరిగణించడమే కాదు ఉన్నతమైన చట్టానికి కట్టుబడి ఉండాలనే భావన ఉంటుంది. "మనం దేశాన్ని అత్యంత నిజాయతీతో నడపకపోతే, అది భారతదేశానికి మరొక మరణం అవుతుంది. అంతేకాదు, ఒక జాతిగా మనం మన ఉనికి కోల్పోయే ప్రమాదం ఉంటుంది," అంటూ ఆయన రాజ్యాంగ సభ చైర్మన్‌గా చేసిన తొలి ఉపన్యాసంలో అన్న మాటలు నిత్య సత్యాలన్నది కాదనలేం. సమాజంలోని ఏ వర్గాన్నీ విస్మరించకుండా ఆయన కల్పించిన హక్కులే నేటి భారతదేశ ప్రగతికి సోపానులుగా మారాయన్నది వాస్తవం. ★



కవులకు, కళాకారులకు, మేధావులకు, పోరాటవీరులకు జన్మనిచ్చిన భూమి అది... ఒక రవీంద్రనాథ్ టాగూర్‌ను, అరవింద ఘోష్‌ను, నేతాజీ సుభాస్‌చంద్ర బోసును... ఒక శ్యామా ప్రసాద్ ముఖర్జీని తీర్చిదిద్దిన నేల అది! కానీ, నేడు ఆ మట్టిలో ఆ వాసనలు రావడం లేదు... దేశ విభజన సమయంలో బెంగాల్‌కు ప్రధానిగా ఉండి, హిందువులపై ఊచకోతకు నాయకత్వం వహించి, సమర్ధించిన హుస్సేన్ సుహ్రావర్ది వారసత్వమే కొనసాగుతున్నట్టు కనిపిస్తోంది. అవి క్షేత్రస్థాయిలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలైనా, రాష్ట్ర స్థాయి లేక సార్వత్రిక ఎన్నికలు అయినా, లేదా కేంద్ర ఏజెన్సీలు దర్యాప్తులకు వచ్చినా హింస అన్నది సర్వసాధారణ విషయంగా, అక్కడి అధికార పార్టీ నాయకుల హక్కుగా కొనసాగిపోతోంది. మొన్నటికి మొన్న, రేషన్ పంపిణీ దగా కేసులో అనుమానితుడైన బ్లాకు స్థాయి తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు షాజహాన్ షేక్ ఇంట్లో సోదాల కోసం వచ్చిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ (ఇడి) అధికారులపై జరిగిన హింస, ఆ భావనకే అద్దం పడుతోంది.

# పశ్చిమ బెంగాల్‌లో శాంతిభద్రతలు

గత అక్టోబర్‌లో అరెస్టు చేసిన రాష్ట్ర మంత్రి జ్యోతిప్రియొ మాలిక్‌కు, శంకర్ ఆధ్యాకు సన్నిహితుడైన బ్లాకు స్థాయి నాయకుడు షాజహాన్ షేక్ ఇంటిని రేషన్ అక్రమాల ఆరోపణలతో సోదాలు జరిపేందుకు జనవరి 5వ తేదీన ఉత్తర 24 పరగణాల జిల్లాలోని సందేష్‌ఖలి గ్రామానికి ఈడీ అధికారులు వెళ్లారు. అక్కడ రాజమహలు వంటి భవన సముదాయంలో సోదరులతో ఉన్న షాజహాన్ షేక్, వారు బయిట గేటుతీసి ప్రవేశిస్తుండగా, ప్రధాన ద్వారం కూడా తీయకుండా తన అనుచరులకు ఫోన్ చేయడం, అందుకోసమే సిద్ధంగా ఉన్నట్టు వందలాది మంది టీఎంసీ కార్యకర్తలు అక్కడకు చేరుకొని అధికారులపై, సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో కలబడడం, రాళ్లతో దాడి చేయడం జరిగిపోయాయి. ఈ దాడిలో ఈడీ వాహనాలు ధ్వంసం కాగా, రెయిడ్ కోసం వచ్చిన ముగ్గురు అధికారులు తీవ్రంగా గాయపడి, ఆసుపత్రి పాలయ్యారు. చిత్రమైన విషయం ఏమిటంటే, ఇరవై నాలుగు గంటలు తిరగకుండానే, షాజహాన్ షేక్, అతడి ముగ్గురు సోదరులు ఇంటికి తాళం వేసి మాయం అయిపోవడం. ఈ వ్యవహారంలో ఈడీ లుకౌట్ నోటీస్‌ను జారీ చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. వాస్తవానికి ఈడీ బోంగాంవ్ మాజీ మునిసిపల్ ఛైర్మన్ శంకర్ ఆధ్యా నివాసంపై, షేక్ షాజహాన్ నివాసంపై దాడులు నిర్వహిం చేందుకు వచ్చారు. షేక్ షాజహాన్ కేవలం తృణమూల్ కాంగ్రెస్ బ్లాకు స్థాయి నాయకుడే కాదు, ఉత్తర 24 పరగణాల జిల్లా పరిషత్తులో మత్స్య, పశు వనరుల అధికారి. రేషన్ స్కాం కేసుగా చెప్పుకునే ఇందులో కొన్ని వందల కోట్లు చేతులు మారినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే నాటి రాష్ట్ర మంత్రి అరెస్టు అయ్యారు.

దాడి చేయడం, పారిపోవడం వంటి పరిణామాలన్నీ అంత వేగంగా ఎలా జరిగిపోయాయి? ఇందుకు సమాధానం కాంగ్రెస్ నాయకుడు, బెర్హంపూర్ ఎంపీ అధీర్ రంజన్ చౌధరి చాలా బాగా చెప్పారు. "బెంగాల్‌లో అధికారంలో ఉన్న పార్టీ అటువంటి వారి బాగోగులు చూసుకుంటు న్నప్పుడు ఈడీ ఏమి చేయగలదు?' అంటూ 'ఇండి' కూటమిలో తృణమూల్ కాంగ్రెస్ భాగస్వామి అయినప్పటికీ విమర్శలు గుప్పించారు. అంతేకాదు, ఈడీ ఇడియట్ అంటూ ఆయన నిందించారు. ఈడీ అధికారులపై అధికారంలో ఉన్న ప్రభుత్వ గూండాలు దాడి చేయడం అన్నది రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవనే విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఇవాళ వారిని కేవలం గాయపరిచారు, రేపు వారిని హత్య చేయవచ్చు కూడా. అలా జరిగితే, నేను ఏ మాత్రం ఆశ్చర్యపోను" అంటూ ఆయన విమర్శలు గుప్పించారు. పనిలో పనిగా ఆయన భారతీయ జనతా పార్టీపై కూడా సరిహద్దు పోరస్‌గా (కంచె లేకుండా, భద్రతలేని) ఉన్న సమస్యపై విరుచుకు పడ్డారు. 'బీజేపీ ఎప్పుడూ రోహింగ్యాల విషయమై రగడ చేస్తుంటుంది... కానీ ఈ సమయమంతా ఎక్కడు న్నారు? హోం మంత్రిత్వ శాఖ ఎక్కడుంది? ఈ విషయంలో వార్తలు వెలువడిన వెంటనే వారు ధృవీకరణ రాజకీయాలు ప్రారంభించారు. 'బాగోగులు చూసుకునే వారికి వ్యతిరేకంగా వారు ఏదో ఒక చర్య తీసుకోవా'లంటూ అధీర్ రంజన్ కోరారు.

దీనిపై పశ్చిమ బెంగాల్ రాష్ట్ర గవర్నర్ సి.వి. ఆనంద బోస్ కూడా తీవ్రంగా స్పందించారు. నిందితులు ఇప్పటికే సరిహద్దు దాటి ఉంటారనే ఆందోళనను వ్యక్తం చేస్తూ, వారిని తక్షణమే అరెస్టు చేసి, తీవ్రవాదులతో అతడికి సంబంధాలు ఉన్నాయని వస్తున్న ఆరోపణలపై దర్యాప్తు చేయమని అధికారులను ఆదేశించారు. ఒకవేళ షాజహాన్ షేక్‌కు తీవ్రవాదులతో సంబంధాలు ఉన్నా మనం ఆశ్చర్య పోవలసింది ఏమీలేదు. ఎందుకంటే, ఒక బ్లాకు స్థాయి నాయకుడిపై ఈడీ దాడి జరుగుతుంటే, ఎటువంటి రెచ్చగొట్టే మాటలు, చేతలు లేకపోయినా, తమ నాయకుడి నుంచి ఒక్క ఫోన్ కాల్ అందిన వెంటనే వందలాది మంది తక్షణం స్పందించి వచ్చి వారిపై కలబడి గాయపరచడం అన్నది సాధారణ విషయం కాదు. దాదాపు 800 నుంచి 1000 మంది వరకూ అల్లరిమూకలు ఈడీ అధికారులను హత్య చేయాలన్న ఉద్దేశంతో దాడి చేశాయని దర్యాప్తు అధికారులు అంటున్నారు. ఒక వ్యవస్థీకృత సంఘటన అనేది లేకుండా ఇంత పెద్ద ఎత్తున వ్యక్తులు బయిటకు రావడమన్నది జరగదనేది మనకు తెలిసిన విషయమే. వీరిలో ఎంతమంది బాంగ్లాదేశీలు ఉన్నారన్న విషయాన్ని ఇప్పటికైనా అధికారులు తెలుసుకుంటే మంచిది. రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడడంలో మమతా బెనర్జీ నేతృత్వం లోని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం విఫలం అయిందని గవర్నర్ బోస్ విరుచుకుపడ్డారు. ఆయన గుర్తించవలసిన విషయం ఏమిటంటే, రాష్ట్రంలో శాంతి భద్రతలు అనేవి మరీచిక అనే విషయాన్ని. ఎందుకంటే, ఇలాంటి హింసాత్మక సంఘటనలు జరగడం అనేది అక్కడ నిత్యకృత్యంగా మారింది.

కాగా, కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి అభిజిత్ గంగోపాధ్యాయ్ ఈ ఘటనను రాజ్యాంగ సంక్షోభంగా పేర్కొంటూ, గవర్నర్ జోక్యంతో రాష్ట్రపతి పాలనను అమలు చేయాలని వ్యాఖ్యానించారని, అలాగే, సందేష్‌ఖలీలో పారామిలటరీ దళాలను మోహరించాలనే బలమైన అప్పీలు కూడా ఉందని, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సుకాంత మజుందార్ కేంద్ర హోం



# మరీచికేనా?

డి. అరుణ

మంత్రికి లేఖ రాశారు.

**కేంద్ర అధికారులపై దాడులు కొత్త కాదు**

రోజ్‌వాలీ చిట్‌ఫండ్ కేసుకు సంబంధించి చిత్ర నిర్మాత శ్రీకాంత్ మొహతా ఆఫీసుకు సీబీఐ బృందం 2019లో వెడుతున్నప్పుడు, వారిని కోల్‌కతాలోని కస్బా పోలీసు స్టేషన్ వద్దే ఆపేశారు.

అదే సంవత్సరంలో తర్వాత కాలంలో, శారదా చిట్‌ఫండ్ కేసులో అభియో గాలు ఎదుర్కొంటున్న కోల్‌కతా పోలీస్ కమిషనర్ పార్క్ స్ట్రీట్ నివాసానికి వెడు తున్న సీబీఐ బృందాన్ని కూడా అడ్డుకున్నారు. కుమార్ నివాసం బయిట షేక్‌స్పియర్ శరనీ పోలీసు స్టేషన్ బృందం సీబీఐని అడ్డుకుంది. ఈ చర్యకు వ్యతిరేకంగా స్వయంగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీయే స్వయంగా కోల్‌కొతా మైదానంలో 70 గంటలపాటు నిరసన ప్రదర్శన చేపట్టారు. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు పదవికి కుమార్‌ను నియమించారు.

ఇక 2021 అసెంబ్లీ ఎన్నికల అనంతరం, ఎన్నికలలో హింసకు అధికార పార్టీయే కారణ మంటూ బీజేపీ, ఇతర టీఎంసీ వ్యతిరేక పార్టీలు ఆరోపణలు చేశాయి. కలకత్తా హైకోర్టు సీబీఐ, జాతీయ మానవహక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ ఆర్‌సి)ను దర్యాప్తు చేయవలసిందిగా ఆదేశించింది. అయితే, జాతీయ మైనార్టీ కమిషన్ వైస్ చైర్‌పర్సన్, ఎన్‌హెచ్‌ఆర్‌సి బృంద సభ్యుడు అయిన అతీఫ్ రషీద్ కోల్‌కతా దక్షిణ శివారులో ఉన్న జాదవ్‌పూర్ ప్రాంతంలో పర్యటిస్తున్నప్పుడు దాడి జరిగింది.

**బాలల హక్కుల ప్యానెల్‌కూ తప్పని తిప్పలు**

ఏప్రిల్ 2023న బాలలహక్కుల సంరక్షణకు జాతీయ కమిషన్ (ఎన్‌సిపిసిఆర్) కూడా పోలీసు దౌర్జన్యంపై ఆరోపణలు చేశారు. ఒక ఏడేళ్ల బాలికను, పొరుగువారు హత్య చేసిన ఉదంతంలో కోల్‌కొతాలోని తిల్‌జలా పోలీసు స్టేషన్‌లో హత్యకు సంబంధించిన వివరాలు పరీక్షిస్తున్నప్పుడు అక్కడి పోలీసులు తమపై దౌర్జన్యానికి దిగినట్టు బాలల హక్కుల సంస్థ అధిపతి ప్రయాంక్ కానూంగో ఆరోపించారు. తనపై దాడి చేయడమే కాకుండా పోలీసు సిబ్బంది రహస్యంగా ఎన్‌సిపిసిఆర్ దర్యాప్తును వీడియో రికార్డింగ్ చేశారని ఆయన ఆరోపించారు.

గత ఏడాది ఏప్రిల్‌లో ఉత్తర దినాజ్‌పూర్ జిల్లాలో అత్యాచారానికి, అనంతరం హత్యకు గురైన 17 ఏళ్ల యువతి కుటుంబాన్ని కలుసుకునేందుకు వెళ్లినప్పుడు స్థానిక అధికారులు తనను అడ్డుకున్నారని కూడా కానూంగో ఆరోపించారు. ఆ సమయంలో అక్కడ నిషేధ ఉత్తర్వులను విధించామని రాష్ట్ర ప్రభుత్వం సమర్థించు కుంది. పశ్చిమ బెంగాల్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తమ జాతీయ సంస్థపైనే ప్రత్యారోపణలకు దిగింది. ఆ బాలిక హత్యపై జాతీయ సంస్థ రాజకీ యాలు చేస్తోందంటూ రాష్ట్ర సంస్థ విమర్శలకు దిగింది.

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో ఏ రాజకీయ పార్టీ కూడా అధికార పార్టీపై దుమ్మెత్తి పోసేందుకు వచ్చిన ఈ అవకాశాన్ని వదులుకోవా లను కోవడం లేదు. 'తమ్ముడు తమ్ముడే, పేకాట పేకాటే' అన్నట్టుగా 'ఇండి' కూటమిలో మా భాగ స్వామివి అయినా సీట్ల పంపకాల్లో వాటాలు కుదరడం లేదు కనుక నిన్ను వదలం అన్న చందంగా కాంగ్రెస్ తీవ్రంగా దాడికి దిగింది. ఏదో ఒకరకంగా, మమతా బెనర్జీని ఇరుకున పెట్టి ఎన్నికల్లో తాము మరిన్ని సీట్ల నుంచి పోటీ చేయాలన్నది వారి వ్యూహంలా కనిపిస్తోంది.

ఇక బీజేపీ కేవలం రోహింగ్యాలు, శాంతిభద్రతల కార్డుపైనే పోటీ చేయాలనుకుంటున్నట్టు కనిపిస్తోంది. న్యాయవాది సుదీప్త దాస్‌గుప్తా ఈ విషయాన్ని హైకోర్టు న్యాయమూర్తి గంగోపాధ్యాయ దృష్టికి తీసుకువెళ్లినప్పుడు, ఈ ఘటన గురించి తనకు తెలుసునని, ఒకవేళ అది జరిగి ఉంటే ఇడి అధికారులు రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితిపై గవర్నర్ దృష్టి పెట్టేలా చూడాలి అని వ్యాఖ్యానించి నట్టు వార్తలు వచ్చాయి.

ఈడీపై దాడి చేసిన అల్లరి మూకల్లో రోహింగ్యాలు కూడా ఉన్నారని సూచిస్తూ జాతీయ దర్యాప్తు ఏజెన్సీతో దర్యాప్తు మాత్రమే కాక మమతా బెనర్జీ తక్షణమే రాజీనామా చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లో శాంతి భద్రతలు కుప్పకూలిపోయాయి. షాజహాన్ ఇంటిపై దాడి చేసే సమయంలో ఇడి అధికారులు, సిఆర్‌పిఎఫ్ అధికారులపై దారుణంగా దాడి జరిగింది. జాతి వ్యతిరేక అల్లరి మూకల్లో రోహింగ్యాలు కూడా ఉన్నారని నా అనుమానం. కనుక ఈ అరాచకతను అణచివేసేందుకు తగిన చర్య తీసుకో వలసిందిగా కేంద్ర హోం మంత్రికి, బెంగాల్ గవర్నర్‌కు విజ్ఞప్తి చేస్తున్నాను అంటూ సోషల్ మీడియా పోస్ట్ ద్వారా బెంగాల్ ప్రతిపక్ష నాయకుడు, బీజేపీ నేత సువేందు అధికారి డిమాండ్ చేశారు. ఆమెకు ముఖ్యమంత్రిగా కొనసాగే హక్కు లేదు. తమపై ప్రాణాంతక దాడి జరుగుతోందనని సాయం కోసం ఈడీ అధికారులకు ఫోన్ చేశారు. ఎవరి రక్షణలో ఈ హింస సాగుతోంది? మమతా బెనర్జీ సంరక్షణలోనే అంటూ బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా విమర్శలు చేశారు. ఇండి కూటమిలో భాగస్వామి అయినా రాష్ట్రంలో శాంతి భద్రతలు కుప్పకూలిపోయాయని అధీర్ రంజన్ చౌధరి కూడా విమర్శించారన్న విషయాన్ని ఆయన పట్టి చూపారు.

రాష్ట్రంలో పలుమార్లు ఇటువంటి హింసాత్మక ఘటనలు జరిగినా, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్న దాఖలాలు ఎక్కడా కనిపించవు. ఎంత ఎన్నికలు త్వరలోనే జరుగుబోతున్నా, ఇప్పుడు ఈ విషయంలో మమతా బెనర్జీ చర్య తీసుకుంటారని భావించడం అత్యాశే అవుతుందేమో! ★



సార్వత్రిక ఎన్నికల నాటి హింస



అయోధ్య పోరాటం ఐదు వందల ఏళ్లు సాగింది. అందులో నిహంగ్ సిక్కుల పాత్ర కూడా ఉంది. 165 ఏళ్ల క్రితం నిహంగ్ సిక్కు బాబా ఫకీర్ సింగ్ ఖల్సా మసీదుగా చెప్పే నాటి కట్టడంలోకి చొరబడి ‘శ్రీభగవాన్’ ముద్రికను ఉంచాడు. ఈ సంగతి ఆయన వారసుడు బాబా హర్జిత్ సింగ్ ఇటీవలనే చెప్పారు. నిహంగ్ సిక్కులు సిక్కులలోనే యుద్ధ వీరుల వర్గం. వారి యుద్ధ విద్య, ఆహార్యం కూడా ప్రత్యేకమైనవే. దుస్తులన్నీ నీలం రంగులో ఉంటాయి. వాటిని బట్టి వీరిని సులభంగా గుర్తిస్తారు కూడా. ఇనుప గొలుసులతో చేసిన గొడుగులాంటి పరికరాన్ని వీరు తిప్పుతారు. పదో సిక్కు గురువు గోవింద్ సింగ్ కాలంలో వీరి ప్రాబల్యం ఎక్కువ.

అయోధ్య మీద హక్కు గురించి సుప్రీంకోర్టులో తుది వాదనలు జరుగుతున్నప్పుడు హిందువులు నవంబర్ 28,1858 నాటి ఒక పత్రాన్ని ఆధారంగా సమర్పించారు. ఇది అయోధ్యకు ఆనాడు ఠాణేదార్‌గా పనిచేసిన శీతల్ దూబే దాఖలు చేసినది. దీనితో డిసెంబర్ 1,1858న అయోధ్య తహసీల్దార్ తన ముందుకు వచ్చి హాజరుకావలసిందని ఫకీర్‌సింగ్‌కు సమన్స్ పంపాడు. దాని ప్రకారం నిహంగ్ సిక్కు బాబా ఫకీర్ సింగ్ ఖల్సా మసీదు (మసీద్ జన్మస్థాన్) లోపల నివసించి, అర్చనలు చేసినట్టు తెలుస్తుంది. రాముడికి ప్రతీకగా ఒక గుర్తును కూడా అక్కడ ఉంచాడాయన. అప్పుడే మసీదు గోడల మీద ‘రామ్ రామ్’ అన్న అక్షరాలు కూడా రాశాడు. ఆయన ఒక్కడే లోపలికి వెళ్లలేదు. తన అనుచరులుతో కలసి చొరబడ్డాడు. ఫకీర్ సింగ్ లోపల ఉండగా ఎవరూ వెళ్లకుండా మరొక 25 మంది నిహంగులు బయట కాపలా కాశారు. వారే

## బాబోయ్ భావప్రకటనా స్వేచ్ఛ

ఈ దేశంలో ముస్లింలు తమకో ప్రత్యేక దేశం కావాలని అనుకుంటున్నారు. ఐక్య పాకిస్తాన్–బంగ్లాదేశ్ జిందాబాద్... ఇలాంటి వాగుడంతా భావ ప్రకటనా స్వేచ్ఛ ఖాతాలోకి వస్తుందా? అవుననే అంటున్నాడు బిహార్‌లోని జైప్రకాశ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ కుర్షీద్ అల్మా. ఈ మధ్య ఈ ప్రబుద్ధుడు ఈ నినాదాలతో సామాజిక మాధ్యమంలో పోస్టులు పెట్టాడు. ఇదేమిటి అని అడిగితే భారత రాజ్యాంగం పౌరులకి ఇచ్చిన భావ ప్రకటనా స్వేచ్ఛ మేరకు ఈ పోస్టులు పెట్టాను తప్పేమిటి అన్నాడు.

కాబట్టి భావ ప్రకటనా స్వేచ్ఛ దేశద్రోహులకీ, ముస్లిం మతోన్మాదులకీ బాగా ఉపయోగపడుతోందనే చెప్పాలి. కానీ దేశంలో జాతీయ భావాలు బతికే ఉన్నాయి. దేశ సమైక్యత అందులోని వాస్తవికత గుర్తించే విజ్ఞత బాగానే ఉంది. అందుకు నిదర్శనం సోషల్ మీడియాలో ఆ ప్రొఫెసర్ పెట్టిన ఈ చెత్తకి పెద్ద ఎత్తున నిరసనలు మొదలయ్యాయి. ముఖ్యంగా విద్యార్థులు వీడిని తన్ని తగలెయ్యమని గొడవ మొదలు పెట్టారు. అల్మా తోక ముడిచి ఉద్యోగానికి రాజీనామా ఇచ్చాడు. పైగా మళ్లీ ముస్లింలు కోరుకుంటున్న ఆ ప్రత్యేక దేశం పాకిస్తాన్‌కీ, బంగ్లాదేశ్‌కీ అనుకునే ఉండాలట. ఇవన్నీ జిన్నా వాదనలు. సయ్యద్ రహమ్మత్ అలీ ప్రతిపాదనలు. వాళ్లంతా అత్యంత విషాదంగా కాలగర్భంలో కలసి పోయారు. భారతదేశాన్ని రక్తపాతంలో ముంచిన, దారుణ విషాదాన్ని మిగిల్చిన పరిణామాలను పునరావృతం చేయాలని చూస్తున్న వాళ్లు మాత్రం ఇప్పటికీ ఈ దేశంలో మిగిలే ఉన్నారు. వాళ్లకి భావప్రకటనా స్వేచ్ఛ కవచంలా ఉపయోగపడుతోంది. అల్మాకి మొదట యూనివర్సిటీ యాజమాన్యం ఈ దేశద్రోహ రాతలకు సంజాయిషీ ఇమ్మని నోటీసులు ఇచ్చారు. మన పోలీసులు కూడా అయోధ్యకు వెళ్లే కరసేవకులనీ, భక్తులనీ చావగొట్టగలరు కానీ, అల్మా లాంటివాళ్లని బాగానే చూసుకుంటున్నారు. అందుకు సివాన్ పోలీసు సూపరింటెండెంట్ శైలేష్ కుమార్ సిన్హా అన్నమాటలే నిదర్శనం. అల్మా ఆ పోస్టులు భావ ప్రకటనా స్వేచ్ఛనతోనే పెట్టాడని, అయినా దర్యాప్తు చేస్తామని

## ప్రాణప్రతిష్ఠ రోజు కర్ణాటక ఆలయాలలో పూజలు



జనవరి 22న అయోధ్యలో విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరుగుతున్న సందర్భంగా రాష్ట్రంలోని దేవాలయాలన్నింటిలోను ప్రత్యేక పూజలు నిర్వహించాలని కర్ణాటక ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయోధ్యలో నూతనంగా నిర్మించిన మందిరంలో రాముడి విగ్రహాలు ప్రతిష్ఠిస్తున్న సందర్భంగా దేవాదాయ శాఖ అధీనంలో ఉన్న ఆలయాలలో ఈ ప్రత్యేక పూజలు నిర్వహించాలని ఆ ఆదేశంలో పేర్కొన్నారు. అయితే కరసేవ నేపథ్యంలో 1992 నాటి అల్లర్లకు బాధ్యుడంటూ కర్ణాటక ప్రభుత్వం పూజారి అనే హిందూ కార్యకర్తను అరెస్టు చేసి వివాదంలో పడిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆదేశాలు జారీ చేసింది. పూజారికి తరువాత బెయిల్ వచ్చింది. ★




కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టు పార్టీ, ఇతర సెక్యులరిస్టు పార్టీల గోల ఎలా ఉన్నా సాధారణ ప్రజలు మాత్రం అయోధ్య విగ్రహ ప్రతిష్ఠ పట్ల గౌరవ భావంతోనే వ్యవహరిస్తున్నారు. పలువురు ఈ సమయంలో చూపవలసిన మత సహనాన్ని

# నిహంగ్ సిక్కులు-అయోధ్య రామయ్య

మసీదు ప్రాంగణంలో ఒక అరుగు నిర్మించి దాని మీద రాముని ప్రతిమను ప్రతిష్ఠించారు. ఈ ఆధారం ప్రకారం బాబా ఫకీర్‌సింగ్ మసీదు లోపల నివసించాడని అభిప్రాయ పడింది. ఈ ఫిర్యాదులో నమోదైన ఎఫ్ఐఆర్ అయోధ్య కేసు విజయంలో హిందువులకు కీలకంగా ఉపయోగపడింది.

నిహంగుల ప్రవేశం నాటి పరిణామాల ప్రకారం ఆనాడు అయోధ్య మసీదు ముయెజ్జిన్ (ప్రార్థన సమయాలను గుర్తు చేసే ఉద్యోగి) సయిద్ మహమ్మద్ ఖాతీబ్ కూడా అధికారులకు ఒక ఫిర్యాదు చేశాడు. 'ఇది (నిహంగుల చొరబాటు) దారుణం, ముస్లింల మీద హిందువుల, సిక్కుల ఆధిపత్య ధోరణి' అని కూడా ముయెజ్జిన్ ఆరోపించాడు. ఫకీర్‌సింగ్ లోపల 'హవన్' (పూజ) చేశారడని కూడా ఇతడి ఆరోపణ. అయోధ్య ఠాణేదార్ శివ్ గులాం కుట్రతోనే ఫకీర్‌సింగ్ చబుత్ర (అరుగు) నిర్మించాడని కూడా ముయెజ్జిన్ ఆరోపణ. తాను అజాన్ (ప్రార్థనలకు పిలుపు) ప్రారంభించగానే బయట హిందువులు శంఖాలు పూరిస్తూ, భజనలు చేస్తున్నారని, ఇది గతంలో లేదని కూడా ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇలాంటి ఫిర్యాదు మరొకటి నవంబర్, 1860లో కూడా అధికారులకు వెళ్లింది. నిజానికి నిహంగులు తరువాత మసీదును ఖాళీ చేసి వెళ్లిపోయినా, ఆ సంగతిని అధికారులు నమోదు చేయలేదు.

వాస్తవానికి నిహంగులకే కాదు, సిక్కుల ప్రథమ గురువు బాబా నానక్‌దేవ్ కూడా అయోధ్యను సందర్శించారు. ఇందుకు సంబంధించిన ఆధారం కూడా హిందువులు సుప్రీంకోర్టులో హిందువులు ప్రవేశపెట్టారు. నానక్ దేవ్ 1510-11 ప్రాంతంలో ఆలయాన్ని సందర్శించారు. అప్పటికి అది ఆలయమేనని ఈ ఆధారం రుజువు చేసింది.

ఇప్పుడు నిహంగులు అయోధ్యతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ప్రాణప్రతిష్ఠ వేళ సేవలు చేయాలని అనుకుంటున్నారు. జనవరి 22వ తేదీన అయోధ్యలో అన్నదానం చేయబోతున్నట్టు ఫకీర్‌సింగ్ వంశీకులలో ఎనిమిదో తరం వాడైన హర్జిత్‌సింగ్ రసూల్‌పూర్ చెప్పారు. ఆ విధంగా తాము మత సామరస్యాన్ని వ్యక్తం చేయదలుచు కున్నామని అన్నారాయన. గురు తేజ్ బహదూర్ ఢిల్లీలోని చాందినీ చౌక్‌లో ప్రాణత్యాగం చేసినది సనాతన ధర్మణ కోసమేనని హర్జిత్‌సింగ్ గుర్తు చేసుకున్నారు. ★



అన్నాడాయన. ఎంతయినా బిహార్. అందునా లాలూ కుటుంబం అండతో సాగుతున్న నితీశ్ కుమార్ పాలన. అందుకే ఈ తమాషాలన్నీ: ఏమైనా దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛ వెదజల్లుతున్న కాలుష్యం గురించి కాస్త గట్టిగా ఆలోచించక తప్పదు. ★

# అది పాండవుల శివలింగం



**భా**రతదేశంలో ఏ మూల వెతికినా హిందూ ధర్మానికి సంబంధించిన ఆరాధనా చిహ్నాలు, ప్రతీకలు దర్శనమిస్తూనే ఉంటాయి. ఈ మధ్య కర్ణాటకలోని కొడుగు జిల్లాలో పురాతన శివలింగం ఒకటి బయటపడింది. ఇది సాక్షాత్తు పాండువులు అరణ్యవాసానికి వెళుతూ ఇక్కడ ఆగినప్పుడు ప్రతిష్ఠించినదని స్థల పురాణం చెబుతోంది. ఇది భారీ శివలింగం. కుందా కొండ మీద కిలన్ గణపతి ఆలయం వద్ద ఒక మహా వృక్షం మొదళ్లలో ఇది దొరికింది. అయితే చాలా లోతున ఉండిపోయింది. దర్శన్ నంజప్ప తోట అని పిలిచే ప్రదేశంలో ఈ చెట్టు ఉంది. నిజానికి ఈ ప్రదేశం మొత్తం గుమ్మతీర కుటుంబీకుల అధీనంలో ఉండేది. వారు 800 సంవత్సరాల క్రితం వారు. భారీ యంత్ర పరికరాలతో మాత్రమే ఈ లింగాని బయటకు తీయగలిగారు. దాని కింద ఇంకొన్ని వస్తువులు కూడా దొరికాయి. ★

# వారణాసికి ముస్లిం మహిళల రామజ్యోతి

కూడా చూపుతున్నారు. హిందువుల మహా పుణ్యక్షేత్రం కాశీకి చెందిన ముస్లిం మహిళలు అయోధ్య వెళ్లి రామజ్యోతిని వెంటపెట్టుకుని జనవరి 7వ తేదీన తిరిగి కాశీకి చేరుకున్నారు. మధ్యలో వారికి జౌన్‌పూర్ వంటి చోట్ల ఘనస్వాగతం కూడా లభించింది. ముస్లిం ఉమెన్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షురాలు నజీన్ అన్సారీ నాయకత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. రామమందిర్ మహంత శంభు దేవాచార్య అందించిన రామజ్యోతితో నజీన్, డాక్టర్ నజ్మా పర్వీన్ కాశీ చేరుకున్నారు. కాశీలో వారికి సాదర స్వాగతం లభించింది. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి రామజ్యోతిని దర్శించుకున్నారు. సంఘర్షణలు, హింసకు దూరంగా ఉండే విధంగా అయోధ్య రామాలయం అందరికి స్ఫూర్తిదాయకంగా ఉంటుందని నజీన్ చెప్పారు. ముస్లిం దేశాల నేతలు కూడా అయోధ్య వచ్చి శ్రీరాముడిని దర్శించు కోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మీ దేశాలు చల్లగా ఉండాలంటే మీమీ దేశాలలో కూడా రామ మందిరాలు నిర్మించుకోవాలని ఆమె అన్నారు. రాముని దర్శించుకున్న తరువాత దివ్య అనుభూతి మిగులుతుందని భారతీయులు తెలుసుకోవాలని కూడా ఆమె చెప్పారు.

వారణాసి జిల్లా హిందూ ముస్లిం చర్చావేదిక సమన్వయకర్త అల్లావుద్దీన్ భుల్లాన్ మరొక మాట అన్నారు. 'మా పూర్వీకుల రక్తంలో రామభక్తి ఉన్నందువల్ల మేము కూడా రాముని వారసత్వంతో మమేకమై ఉన్నాం. అయితే భారతీయ నాగరికత అనేది అందులో మమేకం కావడం వల్లనే అనుభవానికి వస్తుంది' అని చెప్పారాయన. రామజ్యోతి జౌన్‌పూర్ జిల్లాలో ప్రవేశించగానే భల్లాన్, విశాల్ భారత్ సంస్థాన్ అధ్యక్షుడు నౌషాద్ అహ్మద్ స్వాగతం పలికారు. వారణాసి సరిహద్దులకు చేరగానే విశాల్ భారత్ సంస్థాన్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి ఊరేగింపుగా రామజ్యోతిని సుభాశ్‌భవన్‌కు తీసుకుని వెళ్లారు. ఆ భవన్ ప్రాంగణం జైశ్రీరామ్ నినాదంతో మారుమోగింది. జ్యోతిని తెచ్చినవారందరికి హారతులు ఇచ్చి, తిలకం దిద్ది స్వాగతించారు స్థానికులు. ★

# క్రీడావని

**దివ్యకృతి. ఎలా ఉంది పేరు?**

**దివ్య అంటే దీపిక, అగ్నిశిఖ.**

**అందం, ప్రకాశం, శపథం – మరెన్నో అర్థాలు.**

**తల్లిదండ్రులు ఏ సుముహూర్తంలో ఆ పేరు పెట్టారో కానీ, సార్థకం చేసుకుంది.**

**అపూర్వ, అపురూప ఘన విజయాన్ని సొంతం చేసేసుకుందంటే... అదీ ఆమె పట్టుదల. ఆత్మవిశ్వాసం! అఖండ దివ్య తేజం, ఈక్వెస్ట్రియన్ క్రీడల్లో అర్జున అవార్డు సాధించింది. ఇంతటి మహా ఘనతను వశం చేసుకున్న భారతీయ తొలి వనిత దివ్యకృతి. ఉడుంపట్టు వంటి తత్వం, ఎంత శ్రమనైనా భరించి బయటపడగలిగే శక్తీ యుక్తీ.**

'దివ్యాకృతి' అనీ పిలుచుకోవచ్చు మనం!

అందులోనూ పేరుకు తగిన వనిత.

ఇప్పటికీ ఆసియా సంబంధిత క్రీడారంగంలో నంబర్ వన్. ప్రపంచ స్థాయిలోనే (గ్లోబల్) ర్యాంకింగ్స్‌లో, నిర్ణీత అంశానికి చెందినంత వరకు నంబర్ 14. రికార్డుల సృష్టి తనకు కొత్తేమీ కాదు.

అత్యంత ప్రతిష్ఠాత్మక అవార్డును ఇప్పుడిలా చేజిక్కించుకోవడమంటే రికార్డులకీ రికార్డు! రాష్ట్రపతి భవన్‌లో ఇటీవలనే ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా పురస్కృతి స్వీకరణ ప్రక్రియా పూర్తయింది. ఆసియన్ క్రీడోత్సవాల స్వర్ణపతక విజేత, ఈక్వెస్ట్రియన్‌లో ఏకైక వనిత అంటుంటే చప్పట్లు మారుమ్రోగాయి.



ఇంతకూ ఎవరీ దివ్యకృతి? ఈక్వెస్ట్రియన్ విలక్షణత ఇంకా ఏమిటి? సవివరంగా తెలుసుకుందాం. ఇంతకన్నా ముందు, గత ఐదేళ్ల తన 'సూపర్ పవర్'నూ తలచుకుంటే....

ప్రతి భారతీయ హృదయమూ ఉప్పొంగిపోతుంది!

క్రీడ అనేది శారీరక శ్రమ. అంతకుమించి మానసికపటుత్వం. అందులో పోటీలంటే ఎంతెంతో ఒత్తిడి.

దృఢత్వం చూపితేనేం, అన్నింటినీ తట్టుకుంటేనే విజయం వరిస్తుంది.

వ్యక్తిగతంగా, జట్టుపరంగా.

నియమాలు, నిబంధనలు ఉండనే ఉంటాయి. వాటిని అనుసరిస్తూనే, సకాలంలో స్పందించి విజృంభిస్తేనే గెలుపు పిలుపు లభిస్తుంది.

దివ్యకృతి తలపులన్నీ... బాల్యం నుంచీ విజయసాధన కోసమే.

ఆమెకి ఇప్పుడు 24 ఏళ్లు. స్వరాష్ట్రం రాజస్థాన్. స్వస్థలం జైపూర్ ప్రాంతం. చిన్నపుడు బడి చదువంతా అజ్మీర్‌లో అయింది. బాలికల పాఠశాలలో విద్యాభ్యాసం. డిగ్రీ చేసింది. ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన కళాశాల నుంచి.

తల్లిదండ్రుల నుంచి పట్టుదల నేర్చుకుంది. తోబుట్టువు నుంచి సహనశక్తి అలవరచుకుంది. ఈ రెండూ 'ఈక్వెస్ట్రియన్'కి మూలాధారాలు. ఉడుంపట్టు వంటి తత్వం, ఎంత శ్రమనైనా భరించి బయటపడగలిగే శక్తీ యుక్తీ.

గుర్రపు స్వారీ. ఈ క్రీడ సమస్తం దూకుడుమయం. ఎంతో వేగం ఉండాలి. కచ్చిత అంచనా కావాలి. సవారీలో చాకచక్యం కనబరచాలి. యుద్ధ విద్య, శారీరక విన్యాసం....ఈ రెండు కలగలిసిన సాహసోపేత చర్య. ఈ అంశానికి ఎంత పూర్వచరిత్ర ఉందో, అంతకుమించిన ఆధునికతా నెలకొంది. పోటీలు/ పందేలలో నరాలు తెగి ఊడిపడేంత ఉత్కంఠ.

వీటన్నింటినీ మొదటి నుంచీ అలవాటు చేసుకుంది దివ్యకృతీ సింగ్. తండ్రి తేజ్‌సింగ్. సాహసక్రీడల గురించిన మక్కువ పెంచారు. తల్లి అల్కా. ఎటువంటి అనూహ్య స్థితినైనా ఎదుర్కోగలిగిన స్థిరచిత్తాన్ని కలిగించారు.

దివ్యకృతి ఉన్నత పాఠశాల దశ నుంచే గుర్రపు స్వారీ మీద ఆసక్తి ప్రదర్శించింది. అదే క్రీడాంశంలో పాల్గొంటూ ఉండేది. కాలక్రమంలో జూనియర్ నేషనల్స్‌కి ఆడింది. ఆలిండియా స్థాయి ఈవెంట్లు, ఇతర దశల ఉత్సవాల్లోనూ తరుచుగా పాల్గొనేది. ఛాంపియన్‌షిప్ గురించి కలలు కంటుండేది. వాటి సాకారానికి తనవంతు ప్రయత్నమూ ముమ్మరంగా చేస్తుండేది. ఈక్వెస్ట్రియన్ స్పోర్ట్స్‌కి ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఉందని మనందరికీ తెలుసు. అథ్లెట్ల డ్రెస్సేజ్ వరల్డ్ ర్యాంకింగుల గురించి కూడా తెలియాల్సి ఉంది.

ఫెడరేషన్ అంటేనే ఆ క్రీడాంశాల అంతర్జాతీయ పాలక సంస్థ. ప్రధాన కార్యాలయం స్విస్‌లో ఉంటుందనేదీ అందరికీ తెలిసిన విషయమే. స్థూలంగా ఫెడరేషన్ ఈక్వెస్ట్రీ ఇంటర్నేషనల్ (ఎఫ్ఈఐ). దీనికి శతాధిక సంవత్సరాల చరిత్ర ఉండటం మరెంతో విశేషం, వందనీయం. అనుబంధం అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీలో.

ఆసియన్ గేమ్స్. ఆసియాడ్, నాలుగేళ్లకు ఒకసారి జరిగే క్రీడోత్సవం. ఆసియా నలుమూలల నుంచీ జట్లు వస్తాయి. తదుపరి పరిస్థితుల ప్రభావంతో, ఖండాంతర ఖ్యాతి సంపాదించుకుంది. బహుళత్వ క్రీడ అన్న

# బహూ'కృతి'




రాష్ట్రపతి నుంచి అర్జున అవార్డును అందుకుంటున్న దివ్య

మాట. నిరుడు చైనాలో జరిగిన పోటీల్లో భారత్ విశ్వరూపం చాటి చెప్పింది. శతాధిక సంఖ్యలో పతకాలు గెలుచుకుంది. వీటిల్లో స్వర్ణాలు ఎన్నో ఉన్నాయి. దివ్యకృతి సింగ్ వీర విజృంభణతో ఈక్వెస్ట్రియన్ స్వర్ణం భారత్‌కు లభించింది. ఒకటీ రెండూ మూడూ కాదు, నాలుగు దశాబ్దాల తర్వాత!

సువర్ణ పతకధారి దివ్య ప్రత్యేకించి డ్రెస్సేజ్ ఈవెంట్‌లో 'గోల్డ్' స్వాధీన పరచుకుంది. చరిత్రాత్మకం. ఇదంతా బృంద ప్రాతినిధ్యం. ఇందులో ప్రతీ దేశం నుంచీ ముగ్గురు లేదా నలుగురు రైడర్లు పోటీపడితే, వారి వ్యక్తిగత స్కోర్లతో జట్టు మొత్తం స్కోరునీ రూపొందించారు. అంటే, ఉమ్మడి భాగస్వామ్యం ఉంటేనే విజయ ప్రాప్తి. ఈ రీత్యా దివ్య తానేమిటో చాటి చెప్పింది. నాటి నుంచి నేటివరకు భారత్ సాధించిన పతకాల సంఖ్యను 14కి చేర్చింది. అదివరకటి మూడు స్వర్ణపతకాలూ 1982లో వచ్చినవే. మళ్లీ ఇన్నేళ్లకి టీమ్ స్పిరిట్‌ని విను వీధి పతాకంగా ఎగురవేసింది దివ్యకృతి. అనూష్, హృదయ్, సుదీప్తలతో కలిసి, గుర్రపు స్వారీని ఫలప్రదం చేసిందామె. అప్పట్లోనే ప్రధాని మోదీ అన్నట్లు, 'దివ్యాకృతి టీమ్‌ది అద్భుత ప్రదర్శన!

ఆమెది అసాధారణ నిపుణత్వం. అసామాన్య ప్రవీణతత్వం. బృందంలో జతకూడితే – ఎంతెంతో పోరాటపటిమ. డ్రెస్సేజ్ అనేది ఫ్రెంచి పదబంధం. సుశిక్షిత అని స్థూలమైన అర్థం. ఆ రీత్యా దివ్యాకృతి మహత్తర, బృహత్తర సుశిక్షణపరురాలు. తన గుర్రానికి ముందస్తు సూచనలివ్వడం, పరిపూర్ణంగా అదుపులోకి తెచ్చుకోవడం ద్వారా పాయింట్లు సంపాదించడం – అదీ ఆ క్రీడాకారిణి అందించిన శిక్షణ సామర్థ్యం. తానుగా ఫలప్రదం చేయగలిగిన సమన్వయ కార్యక్రమం. సుదీర్ఘ విరామం తర్వాత తిరిగి భారత్ మళ్లీ కీర్తి కిరీటం పొందిందంటే, అంతా ప్రధానంగా దివ్య నిర్వహణ చాతుర్యమే! ఈక్వెస్ట్రియన్ అథ్లెట్లందరికీ తనే తలమానికం.

దివ్య జీవితమంతా అవార్డుల పరంపరలే! విమెన్ సమ్మిట్ పురస్కారం గత అక్టోబరులోనే లభించింది. సవాయి జైపూర్ అవార్డునీ అప్పట్లనే పొందింది. పదేళ్ల కిందట జూనియర్స్ విభాగంలో పోలోకి సంబంధించి, నేషనల్ ఛాంప్ కాగలిగింది. మరు సంవత్సరం సైతం అదే రీతిన విజేతగా నిలిచింది. దేశ రాజధాని నగరంలో జూనియర్స్ స్థాయిలో కూడా శభాష్ అనిపించుకుంది. కోల్‌కతాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లోనూ, జూనియర్స్ విభాగాన మెరుపులు మెరిపించిందీమె. బెంగళూరులో సైతం ఛాంపియన్‌షిప్ తన ఖాతాలోకి చేరుకుంది.




**జంధ్యాల శరత్‌బాబు**

**సీనియర్ జర్నలిస్ట్**


ఇంటర్నేషనల్ డ్రెస్సేజ్ పోటీల్లో గతంలోనూ విజయబావుటా ఎగురవేసి, శంఖం పూరించిందామె.

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని యువజన వ్యవహారాల మంత్రిత్వశాఖ నిరుడే ఆమెకు పురస్కృతిని ప్రకటించింది.

**'ఉదయించిన సూర్యునిలా**
**ప్రతి మనిషీ కదలాలి!**
**నినదించిన దుందుభిలా**
**ప్రతీ హృదయం పలకాలి!**
**పదవే పదవే**
**పదవే పంచ కల్యాణి'**

పాట మనలో కొందరికైనా గుర్తుండే ఉంటుంది. ఇది సినీ గీతిక. గుర్రం, హయం, తురగం, అశ్వం– ఏ పేరు ఉన్నా ఒకటే.

'పంచకల్యాణి' అనేది ఉత్తమ జాతి అశ్వం.

'అశ్విక క్రీడ' అనగానే మనందరికీ గుర్తొచ్చేది ఇక దివ్యకృతి వేరే! 2023లో ఆమెను గుర్తించి గౌరవించి 'అర్జున'ను బహూకరించింది కేంద్రం.

'అర్జున' పురస్కృతి – ఆటల్లో అత్యుత్తమ ప్రతిభా ప్రదర్శనకు లభించే గౌరవం. అత్యున్నత క్రీడా పురస్కారం. మహాభారతంలో అర్జునుడు ఎంత దీక్షాదక్షత గలవాడో మనందరికీ విదితమే. అందుకనే, ఆ పేరుమీదనే అవార్డు ప్రకటన!

**కృషి, అంకిత భావం**
**చిత్తశుద్ధి, లక్ష్య సిద్ధి**
**ఏకాగ్రత, తదేక దృష్టి**
**నాయకత్వం, క్రీడాస్ఫూర్తి**
**క్రమశిక్షణ, దృఢవర్తన**

వీటన్నింటి సమాహారమే 'అర్జున' ప్రదానోత్సవ అంతరార్థం.

ప్రభుత్వ గుర్తింపు కలిగిన అన్ని క్రీడా సమాఖ్యల, సంస్థల నుంచి నామినేషన్లు కోరతారు. ఫెడరేషన్లు, అసోసియేషన్లు, కంట్రోల్ బోర్డులు, అనేకానేక ప్రభుత్వాల నుంచీ ప్రతిపాదనలు స్వీకరిస్తారు. వాటి నుంచీ అర్జున బహూకృతికి ఎంపిక. భారీ మొత్తంలో నగదు పారితోషికం, అర్జునుడి విగ్రహం, ప్రశంసాపత్రంతో సత్కరిస్తారు పురస్కార విజేతను! ఈ అన్నింటి దృష్ట్యా, దివ్యకృతి సింగ్‌కు అద్భుత సత్కారమే ఏర్పాటైంది. ★

కథ

సుభద్రకి దుఃఖం పొంగుకు వస్తోంది. ఒక గంటలో కొడుకును, కోడల్ని, ఇద్దరు మనుమరాళ్లను వదలి వేల కిలోమీటర్ల దూరం, తమ దేశం వెళ్లిపోతుంది. ఈ ఆరునెలలుగా మనుమరాళ్లు ఇద్దరూ మరీ దగ్గర అయిపోయారు. మళ్లీ తనకి వేల కిలోమీటర్లు ప్రయాణం చేసి వచ్చే ఓపిక లేదు. తనకి తెలుసు. ఒంట్లో తేడా వచ్చేసింది. రక్తపోటు, చక్కెర వ్యాధి రెండూ తన ఒంటిని గుల్ల చేసేసాయి. అరవై ఏళ్లకే ఇక శాశ్వతంగా వెళ్లిపోయే రోజులు దగ్గరపడ్డాయి అని అర్థం అయిపోతోంది. ఇక ఈ జీవితంలో కొడుకు కుటుంబాన్ని చూసే అవకాశం లేనట్లే!

"నాన్నమ్మ, మళ్లీ ఎప్పుడు వస్తారు మీరు? తాతయ్య అమెరికాలో తనకి తోచదు అన్నా, నువ్వే బలవంతంగా తీసుకుని మా వేసవి సెలవులు మొదలవగానే వచ్చేయండి!" అంది ఎనిమిదేళ్ల పెద్ద మనుమరాలు స్వీటీ.

సుభద్ర పెదవుల మీద జీవం లేని నవ్వు. "ఇక మీదట మేము రాలేము స్వీటీ, మా పని అయి పోయింది. ఇక మీదట మమ్మల్ని చూడటానికి మీరే రావాలి" తల్లి కంఠంలో జీర కనిపెట్టేశాడు శ్రీరామ్.

"అదేమిటమ్మా, అలా అంటావు? నాన్నకి డెబ్బై, నీకు మరో నాలుగేళ్లు తక్కువ. అప్పుడే పని అయి పోయిందని అంటావేమిటి? మన విజయ అత్తయ్యకు ఎనభై ఏళ్లు దగ్గిర పడుతున్నాయి, ఇప్పటికీ దాదాపు ప్రతి ఏడాదీ వచ్చి, రామం బావను చూసి వెళ్లడం లేదూ!" కారు అద్దంలో నుంచి తల్లి మొహంలోకి చూస్తున్నాడు శ్రీరామ్

"అలా చెప్పరా, రోజుకోసారి ఇక నా పని అయి పోయింది అంటుంది" భార్య మీద ఫిర్యాదు చేసినట్లుగా అన్నాడు జానకిరామ్.

"మీరు ఎన్నయినా చెప్పండి, మరో ఏడాదికి మించి నేను వుండను." భోరున ఏడ్చేసింది సుభద్ర "ఇదే వీళ్లను చూడటం ఆఖరిసారి"

నాన్నమ్మ ఏడ్పు చూసి బిత్తర పోయారు స్వీటీ, పింకీ.

"ఊరుకోండి అత్తయ్య గారు, మిమ్మల్ని అలా చూసి, పిల్లలు బెంబేలు పడి పోతున్నారు. మీకు ఏ రోగం లేదు. ఉన్నదల్లా బెంగ, భయం అంతే! మీ ఆరోగ్యం బ్రహ్మాండంగా ఉంది. చూస్తూ ఉండండి. ఏడాది తిరగకుండా మీరే మళ్లీ వస్తారు. మేము వచ్చినా రెండు వారాలకు మించి ఉండలేం కదా, అదే కొంచెం ఓపిక చేసుకుని మీరు వచ్చారు అనుకోండి, ఆరు నెలల పాటు అందరం సరదాగా ఉండొచ్చు" నచ్చ చెబుతోంది కోడలు శృతి.

వాషింగ్టన్ విమానాశ్రయంకి చాలా దగ్గరలోనే కారు ఆపు చేశాడు శ్రీరామ్.

ఆరుగురు ఏర్‌పోర్ట్‌లోకి వెళ్లారు. శ్రీరామ్ దగ్గరుండి నాలుగు పెట్టెలు, చెక్ ఇన్‌లో ఇచ్చేశాడు. మందులు, తినుబండారాలు సర్దిన లాప్‌టాప్‌బాగ్ జానకిరామ్ దగ్గర ఉంది. డబ్బు, పాస్‌పోర్ట్‌లు జాగ్రత్తగా తన దగ్గర బ్యాగ్‌లో ఉంచుకుంది సుభద్ర.

"జాగ్రత్త రా! మీరు తిరిగి వెళ్లేసరికి రాత్రి పది దాటి పోతుంది" కొడుకు భుజం మీద, చేయి వేస్తూ, కంటనీరు కనబడకుండా మొహం పక్కకు తిప్పుకొని, రుమాలుతో కళ్లు అద్దుకున్నాడు జానకిరామ్. తండ్రి కళ్లు ఎర్రబడటం గమనించి, "ఎందుకు నాన్నా, బాధ పడటం. రోజూ ఫోన్‌లో చూసుకుంటాం కదా" ధైర్యం చెబుతున్నట్లుగా అన్నాడు శ్రీరామ్

"ఫోన్‌లో చూసుకున్నా, కలసి ఉన్నట్లుగా ఉండదు కదరా కన్నా! నాకు ఏదైనా అయితే సమయానికి మీరు రాగలరో లేదో అనే నా బెంగ" చంకలో పింకీని కోడలు చేతికి ఇస్తూ, మళ్లీ భోరు మంది సుభద్ర. "ఏ జన్మలో ఏ పాపం చేసుకున్నానో, కొడుకు కుటుంబం అమెరికాలో కూతురి కుటుంబం ఆస్ట్రేలియా లో. ఎవరూ దగ్గరలో లేరు. పైగా ఎవరికి వారే బిజీ."

రోదిస్తున్న తల్లి భుజం రాస్తూ, చాలా సేపు మౌనంగా ఉండిపోయాడు శ్రీరామ్. కొడుకు గుండెల్లో సుభద్ర తల! సుభద్ర కన్నీటికి శ్రీరామ్ చొక్కా తడిసి పోతోంది.

"సెక్యూరిటీ చెక్‌కి వెళ్లాలేమో?" జానకిరామ్ మాటలకు అందరిలో చలనం వచ్చింది.

స్వీటీ , పింకీలను వదలలేక వదలలేక భారంగా కదిలింది సుభద్ర.



# తక్షణ కర్తవ్యం

మాచిరాజు కామేశ్వరరావు



వీల్ చైర్‌లో నుంచి వెనక్కి తిరిగి దూరంగా ఉన్న కొడుకు కుటుంబాన్ని కంటి నిండుగా చూసుకోవాలి అనుకుంది సుభద్ర. అయితే ఆ ఆశ తీరే అవకాశం లేకుండా, కళ్ల నిండా నీళ్లే.

విమానంలో ఉలుకూ పలుకూ లేకుండా కూర్చుని ఉన్న, సుభద్ర భుజం తడుతూ, " ఎంత సేపని బాధ పడతావు? ఆరు నెలల పాటు అందరం సంతోషంగా గడిపాం కదా! వాళ్లు మనం ఎప్పుడు వస్తామన్నా సుస్వాగతం అంటారు .నీకు ఎప్పుడు బెంగగా అనిపిస్తే అప్పుడు వచ్చేదాం.!"ఊరడింపుగా అన్నాడు జానకిరామ్.

భర్త చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని, చాలా సేపు మౌనంగ ఉండిపోయింది సుభద్ర" మీకు చెప్పినా అర్థం కావడం లేదు. నాకు అస్సలు ఓపిక ఉండటం లేదు. ఇక ఎంతో కాలం నేను ఉండను"

"అదిగో, మళ్లీ అవే పిచ్చి మాటలు. నీకేమీ కాదు. కోడలు అన్నట్లు బెంగ రోగమే నీది. మనసు మళ్లించుకోవాలి. ఒక నెల పోయాక ఒకసారి తిరుపతి వెళ్లివద్దాం.నీకు కొంచం మనశ్శాంతిగా ఉంటుంది"

ఇద్దరూ విమానంలో ఎయిర్ హోస్టెస్ తెచ్చిన వేమీ తినలేదు. కోడలు సర్ది ఇచ్చిన పూరి, కూర తిని సీటులో వెనక్కి వాలారు.

అనంతమైన ఆకాశంలో విమానం దూసుకు పోతోంది. కిటికీ లోంచి చీకట్లోకి చూస్తున్నాడు జానకిరామ్. ఉండండి మెరుపులు. కాసేపట్లోనే క్షణం ఆగకుండా ఏకధాటిగా మెరుపులు మొదల య్యాయి. అవతల జోరుగా వర్షం పడుతున్నట్లు ఉంది. విమానం పైకి, కిందకు ఊగి పోతోంది. బయట వాతావరణం అస్సలు బాగా లేదని, సీట్‌బెల్ట్‌లు అందరూ పెట్టుకోవాలని పైలట్ పదేపదే హెచ్చరిస్తున్నాడు. విమానం వెళుతుంటే వింత శబ్దాలు, గరగరమంటూ. విపరీతమైన కుదుపు. అప్పుడే నిద్రలోకి జారుకుంటున్న సుభద్ర ఉలిక్కి పడి లేచింది. "ఏమిటి, విమానం ఇలా ఊగి పోతోంది?" అంది భయంగా.

"బయట వాతావరణం బాగు లేదట. తుఫాన్‌లా వుంది"

కిటికీ అవతలి మెరుపుల్ని చూపిస్తూ అన్నాడు జానకిరామ్.

విమానం హఠాత్తుగా కిందకు జారి పోతోంది. అందరూ హాహాకారాలు చేస్తున్నారు.

జానకిరామ్ వెన్నులో ఒణుకు మొదలు అయింది. "ఈ విమానం కూలిపోయేలా ఉంది సుభద్ర, ఇదే మనకి ఆఖరి. రోజు అయ్యేలా ఉంది"

కాసేపటికే విమానం విపరీతంగా ఊగి పోతోంది. పెద్దగా శబ్దాలు. చాలామంది గట్టిగా అరుస్తున్నారు, కొందరు పెద్దగా ఏడుస్తున్నారు.

**వాకాటి పాండురంగరావు స్మారక దీపావళి కథల పోటీకి ఎంపికైనది**

"భయపడకండి, ఏమీ కాదు. ఆ అమ్మవారే మనని చూసుకుంటుంది" భర్తకి ధైర్యం చెబుతోంది సుభద్ర

భార్య చేతిని గట్టిగా పట్టుకొని, "పెళ్లయిన కొత్తల్లో చిన్న జీతం వల్ల నిన్ను సుఖ పెట్టలేక పోయాను. నీ చిన్న చిన్న కోరికలు కూడా తీర్చ లేకపోయాను. నా కోపాన్ని కూడా భరిస్తూ, పిల్లల్ని చక్కగా పెంచుకు వచ్చావు. నా వల్ల నీకు ఎటువంటి సుఖం లేకపోయింది. నన్ను క్షమించు!" మనసులో ఉన్నదంతా గబగబ చెప్పేయాలని చూసాడు జానకిరామ్

"మీతో నా కాపురం సుఖంగానే గడిచింది. రత్నాల్లాంటి ఇద్దరు పిల్లల్ని ఇచ్చారు. అంతకంటే ఏం కావాలి నాకు? నేనే నోటి దురుసు మాటలతో మీ మనసు నొప్పించి ఉంటాను. నన్ను క్షమించండి. ఇక మీరు కళ్లు మూసుకుని శివ నామస్మరణ చేసుకోండి. ఏ భయమూ ఉండదు" భర్తకు దగ్గరగా జరుగుతూ అంది సుభద్ర.. ఒణుకుతున్న పెదాలతో జానకిరామ్ "ఓం నమశ్శివాయ" అనడం మొదలు పెట్టాడు. కాసేపటికే జానకిరామ్ కళ్ళు బరువుగా మూతలు పడ్డాయి.

* * *

"ఆంటీ, మా వాటా తాళం మీ దగ్గర వుందా?" గుమ్మంలో అలికిడి విని లోపల నుంచి వచ్చిన పరిమళను అడిగింది శ్రీలత.

"లేదమ్మా, మీ అమ్మగారు, నాన్నగారు మీ అన్నయ్య దగ్గరకు అమెరికా వెళ్లారు కదా! తాళం ఏమీ మాకు ఇవ్వలేదు" ఎదురు వాటా పరిమళ

"నేను కూడా వచ్చాను ఆంటీ" శ్రీలత వెనక వున్న శ్రీరామ్ ముందుకు వచ్చాడు.

"మరి మీ అమ్మగారు, నాన్నగారు?" ఆశ్చర్యంగా అడిగింది ఆవిడ.

"ఇద్దరూ విమాన ప్రమాదంలో ఒకేసారి పోయారు ఆంటీ!" శక్తి లేని దానిలా, రెండు అడుగులు ముందుకు వేసి, గుమ్మం పక్కనే ఉన్న సోఫాలో కూలబడి రెండు చేతుల్లో మొహం దాచుకుంది శ్రీలత.

పక్క నే బాంబ్ పడినట్లు అదిరి పడింది పరిమళ. "ఏమంటున్నావు, నువ్వు?"

"మీకు తెలియదా ఆంటీ. పదిహేను రోజుల క్రితం వాషింగ్టన్‌లో బయలు దేరిన విమానం తుఫాన్‌లో చిక్కు కుని, అట్లాంటిక్ సముద్రంలో కూలిపోయి మొత్తం మూడు వందల మంది దాకా పోయారని! అందులోనే అమ్మా, నాన్న ఉన్నారు. పిల్లలతో అందరం రాలేక అమెరికా నుంచి నేను, ఆస్ట్రేలియా నుంచి చెల్లి బయలు దేరి వచ్చాం. తిన్నగా కాశీకి వెళ్లి, పన్నెండు రోజుల కర్మకాండ జరిపించి వస్తున్నాం" తను కూడా చెల్లెలి పక్కన కూర్చుంటూ అన్నాడు శ్రీరామ్.

"ఎంత ఘోరం జరిగిపోయింది. అసలు నమ్మలేక పోతున్నాను. చాలా, చాలా బాధగా ఉంది. ఏం మాట్లాడాలో తెలియడం లేదు" ఇద్దరికీ రెండు గ్లాసుల్లో మంచి నీళ్లు తెచ్చి ఇచ్చింది పరిమళ.

పరిమళ కూతురు వెళ్లి చెప్పిందేమో, అపార్ట్‌మెంట్‌లో ఒక్కొక్కరే వచ్చి, అన్నా చెల్లెళ్లను పలకరించి పోతున్నారు. అందరూ పలకరిస్తూ ఉంటే, ఇద్దరికీ దుఃఖం పొంగుకు వస్తోంది.

పరిమళ తెచ్చిన కాఫీ తాగక ఇద్దరూ కాస్త తేరు కున్నారు.

"ఐతే వీధి తాళం బద్దలు కొట్టక తప్పదు!" అన్నాడు శ్రీరామ్.

"తాళం బద్దలు కొట్టాక కూడా మీరు ఇంట్లోకి అడుగు పెట్టేలా ఉండదు.ఆరు నెలలుగా మూసి ఉన్న ఇల్లు, దుమ్ము కొట్టుకుపోయి ఉంటుంది. మేం వెళ్లి నప్పుడు తాళాలు మీ అమ్మగారికి ఇచ్చి వెళ్లాం. పనిమనిషికి సగం జీతం ఇస్తే, పది రోజులకోసారి వచ్చి, ఇల్లంతా తుడిచి, పోచా చేసేది. అందుకే మేం తిరిగి వచ్చిన రోజు ఇల్లు ఎప్పటిలా శుభ్రంగా ఉంది. మీ అమ్మగారు తాళం ఇవ్వమంటే ఇవ్వలేదు. ఆవిడ ఎవరినీ త్వరగా నమ్మరు కదా! మేం వచ్చాక దగ్గర ఉండి శుభ్రం చేయించుకుంటాం అన్నారు" పరిమళ చెప్పుకుంటూపోతోంది. ఇంతలో వాచ్‌మన్ వచ్చాడు.

వాడిని చూస్తూనే, 'విన్నావుగా! జానకిరామ్ అయ్యగారు, అమ్మగారు విమానం కూలిపోయి చనిపోయారట. ఇంటి తాళం బద్దలు కొట్టాలి, ఎవరినైనా తీసుకురా!" అని పురమాయించి, "మీరు మొహమాట పడకుండా ఈ రోజుకి మా ఇంట్లోనే ఉండి, మీ పని చూసుకోండి, కూరా, పప్పు ఉన్నాయి, కొద్దిగా అన్నం పడేసి వస్తాను" అంటూ వంటింట్లోకి వెళ్లిపోయింది పరిమళ.

ఉండుండి దుఖం పొంగుకు వస్తోంది శ్రీలతకి.

"కొంచం మనసు దిటవు చేసుకో శ్రీ. మనకు ఇప్పుడు బోలెడు పని వుంది" చెల్లెలి భుజం తడుతూ అన్నాడు శ్రీరామ్.

ఒక గంట కష్టపడ్డాక వీధి తాళం బద్దలు అయింది. అయితే పరిమళ చెప్పినట్లుగా ఇంట్లో కి అడుగు పెట్టే వీలే లేదు. ఇల్లంతా, దుమ్ము, బూజులు. రాత్రి పది అయ్యేదాకా పని మనిషి ఇల్లంతా శుభ్రం చేస్తూనే ఉంది.

"ఈ రాత్రికి మా ఇంట్లోనే పడుకోండి. రేపు పక్కలు దులిపి, దుప్పట్లు మార్చుకుందురుగానీ!" అంది పరిమళ.

ఆ రాత్రికి వాళ్లింట్లోనే పడుకున్నారు శ్రీరామ్, శ్రీలత.

మర్నాడు కాఫీ తాగుతూనే తమ ఇంట్లోకి వెళ్లారు. అది మూడు పడక గదుల ఫ్లాట్, ఎంతో విశాలంగా వుంది.

"మీరు ఇద్దరే కదా, రెండు పడక గదుల ఫ్లాట్ తీసుకోమని అంటే నాన్న వినలేదు" మూడు గదుల్లో నిండి పోయివున్న సామాను చూస్తూ అన్నాడు శ్రీరామ్. "గదులు ఖాళీగా పెట్టలేక అక్కరలేని సామాను అంతా ఇంట్లో నింపేశారు"


"ఇంట్లో ఏది ఎక్కడుందో తెలియడం లేదు" చుట్టూ చూస్తూ అయోమయంగా అంది శ్రీలత.

"ముందు బీరువాలో కాగితాలు చూడాలి" తల్లి తండ్రుల పడక గదిలోకి నడిచాడు శ్రీరామ్.

గోద్రెజ్ బీరువా లాక్ చేసి ఉంది. ఎక్కడా తాళం చెవి కనిపించలేదు.

"అమ్మ తాళం చెవి తనతో తీసికెళ్లి ఉంటుంది" అంది శ్రీలత అల్మారాలు అన్నీ వెతికేసాక .

మనిషికి కబురు వెళ్లి, వాడు మళ్లీ వచ్చి, బీరువా



తాళం బద్దలు అయ్యేసరికి మధ్యాహ్నం అయింది. బీరువా నిండా పట్టు చీరలు. చీరల క్రింద కొన్ని ఆస్తి పత్రాలు, బాంక్ డిపాజిట్ రసీదులు వున్నాయి.

ఆ పత్రాలు అన్నీ తీసి ఒకటొకటే చూసాడు శ్రీరామ్

"నాన్న నలుగురు మనుమరాళ్ల కోసం పదిహేను లక్షల చొప్పున నాలుగు ఫ్లాట్లు తీసుకున్నానని అన్నారు కదా! ఆ నాలుగు ఇక్కడికి అరవై కిలోమీటర్ల దూరంలో నాలుగు పక్కలా ఉన్నాయి. ఇప్పుడు అవి అసలు అమ్ముడు పోతాయో లేదో? ఇంత కంటే ఆ పదిహేను లక్షలు బాంక్ డిపాజిట్‌గా ఉంచ వలసింది" తల పట్టుకున్నాడు శ్రీరామ్.

"ఇంతకీ విల్లు రాశారో, లేదో ఆ స్థలాలు అన్నీ అమ్మ పేరున ఉన్నాయి. అసలు ఎన్ని డిపాజిట్లు ఉన్నాయి, అవి ఎక్కడ ఉన్నాయి, వాటి మీద అప్పులు ఉన్నాయా వంటి వివరాలు కూడా ఎక్కడా పుస్తకంలో రాసి పెట్ట లేదు. అంతా అగమ్యగోచరంగా ఉంది"

"నాన్న నలుగురు మనుమరాళ్ల కోసం పదిహేను లక్షల చొప్పున నాలుగు ఫ్లాట్లు తీసుకున్నానని అన్నారు కదా! ఆ నాలుగు ఇక్కడికి అరవై కిలోమీటర్ల దూరంలో నాలుగు పక్కలా ఉన్నాయి. ఇప్పుడు అవి అసలు అమ్ముడు పోతాయో లేదో? ఇంత కంటే ఆ పదిహేను లక్షలు బాంక్ డిపాజిట్‌గా ఉంచవలసింది" తల పట్టుకున్నాడు శ్రీరామ్. "ఇంతకీ విల్లు రాశారో, లేదో ఆ స్థలాలు అన్నీ అమ్మ పేరున ఉన్నాయి. అసలు ఎన్ని డిపాజిట్లు ఉన్నాయి, అవి ఎక్కడ ఉన్నాయి, వాటి మీద అప్పులు ఉన్నాయా వంటి వివరాలు కూడా ఎక్కడా పుస్తకంలో రాసి పెట్ట లేదు. అంతా అగమ్యగోచరంగా ఉంది"



ఇద్దరూ బీరువా అంతా వెతికారు. ఎక్కడా విల్లు లేదు. ఆస్తి, అప్పుల వివరాలు రాసిన పుస్తకం లేదు.

"ఇక్కడ దొరికిన డిపాజిట్లన్నీ నాన్న పేరున ఉన్నాయి, అమ్మ వాటికి నామినీ. విల్లు లేనప్పుడు ఇవన్నీ మనకి రావాలంటే తల క్రిందులుగా తపస్సు చేయాలి" చిరాకు పడి పోయాడు శ్రీరామ్.

'నేను మరో పది రోజులకు మించి ఇక్కడ ఉండలేను"

"నేను నాలుగు రోజులు మించి ఉండలేను, అవతల మీ బావగారు ఇద్దరు ఆడపిల్లలతో నానా అవస్తా పడుతున్నారు" కుండబద్దలు కొట్టినట్లుగా అంది శ్రీలత.

చేసేదేమీ లేక బీరువా మూసి, ఇల్లంతా తిరిగి చూసారు.రెండు అల్మారాల నిండా జానకిరామ్ బట్టలు. మూడు అల్మారాల లో సుభద్ర చీరలు.

"ఈ వయసులో వీళ్లకు ఇన్ని బట్టలు ఎందుకు? ఇద్దరూ చెరో పాతిక ఉంచుకుంటే సరిపోదా? ఇప్పుడీ బట్టలన్నీ ఏంచేస్తాం?" చిరాకుపడ్డాడు శ్రీరామ్.

"పనిమనిషిని తీసుకుపొమ్మందాం" సలహా చెప్పింది శ్రీలత.

అయితే పనిమనిషిని పిలిచి అడిగితే అది" పోయిన వాళ్ల బట్టలు మాకు వద్దు సార్. మేం తీసుకోం!" అనేసింది నిర్మొహమాటంగా.

"ఇంతకు ముందే వాళ్లు ఎక్కువగా ఉన్న బట్టలు కావలసిన వాళ్లనందరినీ పిలిచి ఇచ్చేసి ఉంటే, వాళ్లు సంతోషంగా తీసుకు పోయి ఉండేవారు. ఇప్పుడు ఎవరూ తీసుకోం అంటే, వీటిని మనమేం చేసుకుంటాం? "ఉసూరు మన్నాడు శ్రీరామ్.

"ఇలారా అన్నయ్యా!" వంటింట్లో నుంచి కేక వేసింది శ్రీలత "చూడు, ఈ వంటింట్లో అడుగడుగునా స్టీలు సామాన్లు ఉన్నాయి. స్టీలు గుండిగలు, బకెట్లు, పెద్ద పెద్ద కంచాలు, గిన్నెలు ఒకటేమిటి స్టీలు దుకాణం ఉంది ఇక్కడ! అసలు అమ్మ ఇంత సామాను ఎందుకు పోగుచేసినట్లు? ఇప్పుడు ఇవన్నీ మనం ఎవరికీ ఇవ్వాలి? ఇవన్నీ చూస్తుంటే నాకు జడుపు జ్వరం వచ్చేలా ఉంది"

"నా తల బద్దలయి పోతోంది" తల బాదు కున్నాడు శ్రీరామ్.

"ముందు ఎవరినైనా బ్రోకర్‌ను చూసి, ఇల్లు బేరం పెడదాం. స్థలాల సంగతి మళ్లీ వచ్చినప్పుడు చూద్దాం" సలహా చెప్పింది శ్రీలత.

బ్రోకర్ ఇల్లంతా తిరిగి చూసి, విల్లు, ఇంటి కాగితాలు చూపించమన్నాడు

"ఇంటి పత్రాలు ఉన్నాయి. విల్లు లేదు. అయితే నాన్న, అమ్మ పోయాక ఇల్లు నాదే కదా" అన్నాడు శ్రీరామ్

"వీలునామా మీ పేరు మీద ఉంటేనే మీరు ఇల్లు అమ్మ గలరు. లేకపోతే ఈ ఆస్తికి మీరే వారసులంటూ ధ్రువపత్రం కోర్టు నుంచి తెచ్చు కోవాలి. అది రావ డానికి ఎంతో తిరగాలి, చాలా సమయం పడుతుంది. బ్యాంక్ డిపాజిట్‌లకి కూడా ఆ ధ్రువపత్రం కావలసి ఉంటుంది. వాళ్ల డెత్ సర్టిఫికెట్ కూడా కావాలి. అవన్నీ వచ్చాక కబురు చేస్తే వస్తా" వెళ్లి పోయాడు బ్రోకర్.

అయితే వెళ్లిన వాడే మళ్లీ వెనక్కు వచ్చి, "అమ్మడానికి ఇల్లు ఖాళీగా ఉండాలి. సామాను అంతా తీయించెయ్యండి" అన్నాడు.

"సామానుతో సహా బేరం పెట్టండి" అన్నాడు శ్రీరామ్

" ఇంటి యజమానులిద్దరూ ఇద్దరూ ప్రమాదంలో పోయారంటేనే ఎవరూ ఇల్లు కొనడానికి ముందుకు రారు. అటువంటప్పుడు వాళ్ల సామాను ఎవరు తీసుకుంటారు? సామాను తీసేసి ఇల్లు ఖాళీగా ఉంచండి" వెళ్లి పోయాడు బ్రోకర్.

"ఇది లాకర్ తాళం చెవిలా ఉంది!" పోపుల డబ్బాలో నుంచి ఏదో తాళం చెవి బయటకు తీసింది శ్రీలత

"అది ఏ బాంక్ లాకరో, లాకర్ నంబర్ ఏదో మనకి తెలియదు కదా! ఇక్కడి పరిస్థితి చూస్తూంటే నాకు పిచ్చిపట్టేలా వుంది" జుట్టు పీక్కున్నాడు శ్రీకాంత్.

"నాకు తల తిరిగిపోతోంది. ఈ ఆస్తి వద్దు, ఈ డబ్బులు వద్దు, ఈ తల నొప్పులు వద్దు. నేను వెళ్లి పోతాను" తన పెట్టె చేతిలోకి తీసుకుంది శ్రీలత.

"నాకు అంత కన్నా వద్దు. అవతల వదిన, పిల్లలు ఎప్పుడు వస్తావంటూ గోల పెట్టేస్తున్నారు!" తానూ చేతి లో పెట్టెతో ఇంట్లోంచి బయటకు వచ్చేసాడు శ్రీరామ్.

పరిమళ ఆంటీకి కూడా చెప్పకుండా, ఇద్దరూ లిఫ్ట్ బటన్ నొక్కి కిందకు దిగిపోతున్నారు.

"అయ్యో, ఇంటి తలుపు తాళం వేయలేదు, ఒరేయ్ శ్రీరామ్, ఒసేయ్ శ్రీలతా" గట్టిగా అరుస్తు న్నాడు జానకిరామ్.

"నిద్రలో ఏమిటి పిల్లల్ని కలవరిస్తున్నారు? అప్పుడే బెంగా, మళ్లీ నన్నంటారు!" భర్తను కుదుపు తోంది సుభద్ర.

"ఏమిటి! మనం బతికే ఉన్నామా? విమానానికి ఏమీ కాలేదా?" నమ్మ లేనట్లుగా చుట్టూ చూస్తున్నాడు జానకిరామ్. "ఇదంతా కలా?" .

"మీరు కళ్లు మూసుకున్న కాసేపటికే, శివనామ స్మరణ చేస్తూ మంచి నిద్ర లోకి జారుకున్నారు తొందరలోనే విమానం కూడా తుఫాన్‌ను దాటేసింది. మీరు చేసిన నామ స్మరణ మనని బతికేలా చేసింది.. ఇంతకీ ఎందుకా అరుపులు?"

"ఏమీ లేదు. మనం ఇంటికి వెళ్లగానే చేయ వలసిన ముఖ్యమైన పనులు చాలా ఉన్నాయి. మన తక్షణ కర్తవ్యం ఏమిటో తెలియజేయడానికి దేవుడు మనని చావనీయ లేదు.! అంత తుఫాన్‌లో నిద్ర పట్టేలా, అందులో కలగనేలా, ఆ కల ద్వారా కనువిప్పు కలిగేలా చేశాడు"

"మీ మాటలు నాకు కొంచం కూడా అర్థం కావడంలా. అయినా మనకి ఇంటికి వెళ్లి వెంటనే చేయవలసిన పనులేం ఉన్నాయి? ఆశ్చర్య పోయింది సుభద్ర.

"ఇంటికి వెళ్లాక చెబుతాను. అప్పటి దాకా ఓపిక పట్టు!" అన్నాడు జానకిరామ్. ★


SURYA
MARCHING
—AHEAD WITH—
INDIA
SURYA
Integrating India with state-of-the-art products. Adding bright colours to every Indian's life.
Spearheading the league of bringing a change. Setting new landmarks. Understanding global trends in business.
Anticipating challenges. Adopting faster. Upgrading business processes. And delivering.
Just like India, an ever-growing, ever-emerging nation, Surya has been scripting an awe-inspiring growth story for the last 5 decades. No wonder, it has come a long way since its incorporation back in 1973.
I am SURYA
CELEBRATING 50 YEARS OF TRUST
DURABLE PRODUCTS
FOR ALL SEGMENTS
ASSURED QUALITY
CONSUMER LIGHTING
PROFESSIONAL LIGHTING
APPLIANCES
FANS
PVC PIPES
STEEL PIPES
SURYA ROSHNI LIMITED
E-mail: consumercare@surya.in I www.surya.co.in I Tel.: +91-1147108000
Toll Free No.: 1800 102 5657
/suryalighting I /surya_roshni

క్రీడలకూ రాజకీయాలకు అసలు సంబంధమే లేదు. అయితే..భారత కుస్తీ సమాఖ్యను రాజకీయ నాయకులు తమ గుప్పిట్లో పెట్టుకొని రోజుకో నాటకం ఆడుతూ కుస్తీ క్రీడనే ఓ 'పట్టు' పడుతున్నారు. అంతర్జాతీయ క్రీడల్లో దేశానికి ఎన్నో పతకాలు, ఎనలేని గౌరవం సంపాదించి పెట్టిన భారత కుస్తీ సమాఖ్య పరిస్థితి కుక్కలు చింపిన విస్తరిలా తయారయ్యింది. క్రీడలతో ఏ మాత్రం సంబంధంలేని రాజకీయ నాయకుల చెరలో కుస్తీ సమాఖ్య కునారిల్లిపోతోంది.




# భారత కుస్తీకి మహాసుస్తీ!

భారత కుస్తీ ప్రస్తుతం వింతరోగంతో విలవిల లాడిపోతోంది. ప్రస్తుత కుస్తీ సమాఖ్య కార్యవర్గ సభ్యులు భారత ఒలింపిక్స్ సంఘాన్ని, కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖను సైతం ధిక్కరించే స్థితికి వచ్చారు. అంతర్జాతీయ ఒలింపిక్స్ సమాఖ్య నిబంధనల ప్రకారం దేశంలోని వివిధ క్రీడాసంఘాల కార్యకలాపాలను క్రీడాకారులే నిర్వర్తించుకోవాలి. అయితే.. కొన్ని దశాబ్దాలుగా అధికార పార్టీలకు చెందిన ప్రముఖులే క్రీడాసంఘాలపై పెత్తనం చెలాయిస్తూ వస్తున్నారు. చివరకు భారత కుస్తీ సంఘంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

**రావణ కాష్టంలా కుస్తీ సమాఖ్య...**

భారత కుస్తీ సమాఖ్య అధ్యక్షుడిగా గత పుష్కర కాలంగా చక్రం తిప్పిన అధికార పార్టీ గంజ్ ఎంపీ (ఉత్తరప్రదేశ్ లోని కేసరి) బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్, ఆయన అనుచరులు... ఏడుగురు మహిళా వస్తాదులను లైంగికంగా వేధిస్తున్నారంటూ మొదలైన వివాదం చినికిచినికి గాలివానలా మారింది. గత ఏడాది న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారత అంతర్జాతీయ వస్తాదులు 30 మంది నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ క్రీడల పతక విజేతలు వినేశ్ పోగట్, సాక్షీమాలిక్, భజరంగ్ పూనియా ఆధ్వర్యంలో వస్తాదులు పలు రూపాలలో తమ నిరసనను కొనసాగిస్తూ వచ్చారు. పద్మశ్రీ, అర్జున, ఖేల్‌రత్న పురస్కారాలను వెనక్కు ఇచ్చే సాహసమే చేశారు. కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ, జాతీయ ఒలింపిక్స్ సంఘం పరిస్థితి చక్కదిద్దటానికి ప్రయత్నించినా ప్రయోజనం లేకపోగా సమస్య పీటముడి పడింది.

**వివాదం వెనుక రాజకీయమా?**

కుస్తీ సమాఖ్య రాజకీయం రోజుకో మలుపు తిరుగుతోంది. తన ఇంటినే కుస్తీ సమాఖ్య ప్రధాన కేంద్రంగా చేసుకొని కొద్దిరోజుల క్రితం వరకూ అరాచకం సృష్టించిన బ్రిజ్ భూషణ్.. అధికారానికి దూరమైనా ఇంకా తమ దౌర్జన్యాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. తీవ్ర ఒత్తిడి నడుమ కుస్తీ సమాఖ్య నుంచి తాను శాశ్వతంగా తప్పుకొంటున్నట్లు, ఇక నుంచి తనకూ.. కుస్తీ సమాఖ్యకు ఏవిధమైన సంబంధం ఉండబోదని ప్రకటించారు. అయితే కార్యవర్గ ఎన్నికల్లో తన జేబు బొమ్మ సంజయ్ సింగ్‌ను పోటీకి నిలిపి 40-7 ఓట్ల తేడాతో గెలిపించుకోవడం, భారత కుస్తీ సమాఖ్య వ్యవహారాలను తన ఇంటి నుంచే నడిపించడంతో పరిస్థితి మరింత జటిలంగా మారింది.

సంజయ్ సింగ్ ఎన్నికైన తీరుకు నిరసనగా తాను కుస్తీ నుంచి రిటైరవుతున్నట్లు అంతర్జాతీయ రెజ్లర్ సాక్షీమాలిక్ ప్రకటించారు. మరో రెజ్లర్ వినేశ్ పోగట్ అర్జున, ఖేల్‌రత్న పురస్కారాలను, భజరంగ్ పూనియా తన పద్మశ్రీ పురస్కారాన్ని వెనక్కి ఇస్తున్నట్లు ప్రకటించారు. పరిస్థితి చేయి దాటిపోతూ ఉండడంతో... భారత క్రీడామంత్రిత్వశాఖ సంజయ్ సింగ్ నేతృత్వంలోని కుస్తీ సమాఖ్యపై సస్పెన్షన్ విధించి కార్యకలాపాలు నిర్వహించడానికి అడహాక్ కమిటీని ఏర్పాటు చేసింది.

**సంజయ్ సింగ్ ధిక్కార స్వరం..**

నిబంధనలకు అనుగుణంగా ఎన్నికైన తన కార్యవర్గాన్ని సస్పెండ్ చేయటాన్ని ఆమోదించేదే లేదంటూ మరోవైపు కుస్తీ సమాఖ్య సంజయ్ సింగ్ ధిక్కారస్వరం వినిపించారు. తమ కార్యవర్గమే త్వరలో జాతీయ కుస్తీ పోటీలు నిర్వహిస్తుందంటూ ప్రకటించి మరో వివాదం సృష్టించారు. అంతేకాదు..తమపై తిరుగుబాటు చేసిన సీనియర్ వస్తాదులకు వ్యతిరేకంగా జూనియర్ వస్తాదులను ఎగదోశారు. సాక్షి మాలిక్, వినేశ్ పోగట్, భజరంగ్ పూనియాలకు వ్యతిరేకంగా న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పిల్లవస్తాదులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీనియర్ వస్తాదుల కారణంగా తమకు అన్యాయం జరుగుతోందంటూ జూనియర్లు గళం విప్పారు.

**ఏడాది కాలంగా వేదన...**

ఒలింపిక్స్, కామన్వెల్త్ గేమ్స్, ఆసియాక్రీడల్లో దేశానికి పతకాలు సాధించి పెట్టిన తాము గత ఏడాది కాలంగా మానసికంగా అంతులేని వేదన అనుభ విస్తున్నామని, లైంగిక వేధింపుల బారినపడిన తమ బాధను ఎవరు తీరుస్తారని సాక్షీ మాలిక్ ప్రశ్నించింది. సోషల్ మీడియాలో తమను విమర్శించే వారి ఇంట్లో అక్కాచెల్లెళ్లు లేరా అంటూ నిలదీసింది. ప్రభుత్వం తమకు తల్లితండ్రిలాంటిదని, తమకు జరిగిన అన్యాయాన్ని రానున్న తరాలకు ఎదురు కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరింది.

రెండు దశాబ్దాల కాలాన్ని కుస్తీ క్రీడ కోసం అంకితం చేశానని, చివరకు లైంగిక వేధింపులు మిగిలాయని వాపోయింది. అభంశుభం తెలియని సబ్-జూనియర్ వస్తాదులను భయపెట్టి, ఆశపెట్టి తమపైకే ఎగదోశారని ఆరోపించింది.

సాక్షీ మాలిక్ 2016 రియో ఒలింపిక్స్‌లో భారత్‌కు కాంస్య పతకం, కామన్వెల్త్ గేమ్స్‌లో బంగారు పతకం సాధించిన సంగతి తెలిసిందే.

**అడహాక్ కమిటీ ఆధ్వర్యంలో జూనియర్ కుస్తీ పోటీలు...**

భారత కుస్తీ సమాఖ్యకు ఏర్పాటైన అడహాక్ కమిటీ ఆధ్వర్యంలో 2024 జూనియర్, సబ్ - జూనియర్ కుస్తీ పోటీలు నిర్వహించడానికి రంగం సిద్ధమయ్యింది. అయితే ఈ కమిటీని రద్దు చేయాలంటూ జంతర్ మంతర్ వద్ద జూనియర్ వస్తాదుల బృందం నిరసన ప్రదర్శన నిర్వహించిన కొద్దిగంటల్లోనే జాతీయ అండర్ -15, అండర్ - 20 కుస్తీ పోటీలను నిర్వహించనున్నట్లు అడహాక్ కమిటీ ప్రకటించింది.

కుస్తీ సమాఖ్యలో గొడవల కారణంగా తమ భవిష్యత్ నాశనమైపోతోందని, జూనియర్ వస్తాదులు వాపోతున్నారు. అంతర్జాతీయ వేదికలపై ప్రత్యర్థి వస్తాదులతో మల్లయుద్ధం చేయాల్సిన భారత వస్తాదులు కుస్తీ సమాఖ్య పెద్దలు, ఢిల్లీ పోలీసులతోనే కుస్తీ పట్టాల్సి రావడాన్ని మించిన విషాదం మరొకటి లేదు. తమ సమస్యకు ప్రధాని నరేంద్ర మోదీ మాత్రమే తగిన పరిష్కారం చూపగలరని నిరసనకు దిగిన వస్తాదులు భావిస్తున్నారు. రానున్న రోజుల్లో కుస్తీ సమాఖ్య వివాదం మరెన్ని మలుపులు తిరుగుతుందో మరి.! ★



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూ కశ్మీర్‌లో క్రమంగా ప్రశాంత వాతావరణం ఏర్పడుతోంది. ఉగ్రవాద కార్యకలాపాలు తగ్గుముఖం పట్టి, అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఇటీవలే శ్రీనగర్‌లో జీ-20 అంతర్జాతీయ సదస్సు విజయ వంతంగా జరిగింది. దేశ విదేశాల నాయకులు, ప్రతినిధులు కూడా వచ్చారు. పర్యాటక రంగం క్రమంగా పూర్వ వైభవం పొందుతోంది. కశ్మీర్ ప్రజలకు విద్యా ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవలే నియోజకవర్గాల పునర్విభజన కూడా జరిగింది. మొదటి నుంచి జమ్ముకశ్మీర్‌లో అమలులోలేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా రిజర్వేషన్లు అందుబాటులోకి వచ్చాయి. ఈ పరిస్థితులలో జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూఖ్ అబ్దుల్లా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి.

# ప్రశాంత వాతావరణంలో 'ఫరూఖ్' వ్యాఖ్యల

త్వరలో లోక్‌సభ ఎన్నికలు రాబోతున్నాయి. జమ్మూ కశ్మీర్‌లో కూడా ఎన్నికల నిర్వహణే తర్వాయి అన్న క్రమంలో ఇక్కడి ప్రశాంతతను చెడగొట్టే పనులు ప్రారంభమయ్యాయి. ఉగ్రవాదులు తిరిగి పుంజు కునేందుకు ప్రయత్నిస్తున్నారు. తమ ఉనికిని చాటు కునేందుకు తరచూ భద్రతా దళాల మీద దాడులు చేస్తున్నారు. మన సైన్యం వీటిని ఎప్పటి కప్పుడు తిప్పి కొడుతూ ధీటుగా సమాధానం ఇస్తోంది. ఇదే సమయంలో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ తమ రాజకీయ ప్రయోజనాల కోసం మరోసారి తన కుటిల స్వభావాన్ని బయట పెట్టుకుంటోంది.

జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూఖ్ అబ్దుల్లా ప్రస్తుతం శ్రీనగర్ నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లో ఉండాలని చూస్తుంటారు.. తాజాగా మరోసారి తన దుర్బుద్ధిని బయట పెట్టుకున్నారు.


**కశ్మీర్‌కు గాజాకు పోలికా?**

భారత్, పాకిస్థాన్ దేశాలు చర్చల ద్వారా పరిష్కారానికి రాకపోతే కశ్మీర్ పరిస్థితి 'గాజా' లా మారుతుందని, కశ్మీర్ సమస్య పరిష్కారానికి చర్చలే సరైన పరిష్కారమని జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూఖ్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. కశ్మీర్‌కు ఒకవైపు పాకిస్థాన్, మరోవైపు చైనా ఉన్నాయని.. ఒకవేళ యుద్ధం జరిగితే తీవ్రంగా నష్టపోయేది కశ్మీర్ ప్రజలేనని అబ్దుల్లా ఆందోళన వ్యక్తం చేశారు. పొరుగు దేశాలతో సత్సంబంధాలే క్షేమకరమని పేర్కొన్నారు. 'మనం స్నేహితులను మార్చగలమేమో గానీ ఇరుగుపొరుగును మార్చలేం' అని గతంలో మాజీ ప్రధాని వాజ్‌పేయి అన్నారని ఫరూక్ అబ్దుల్లా గుర్తుచేశారు. పాకిస్థాన్‌కు త్వరలో నవాజ్ షరీఫ్ ప్రధాని అయ్యే అవకాశాలు ఉన్నాయని, ఇండియాతో చర్చలు జరపడానికి తాము సిద్ధమేనని ఇప్పటికే ఆయన స్పష్టం చేశారని, కానీ మనమే అందుకు సిద్ధంగా లేమన్నారు. ఆర్టికల్ 370 రద్దుతో జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదం అంతమైనట్లు కేంద్రం చెబుతున్నా.. అది ఇంకా అంతం కాలేదని వ్యాఖ్యానించడం వెనుక ఆంతర్యం ఏమిటి? అసలు జమ్ముకశ్మీర్‌కు, గాజాకు పోలిక ఏమిటి? ఈ రెండు సమస్యల స్వరూప స్వభావాలు వేరన్న విషయం బహిరంగ సత్యం.

**నరకంగా మార్చింది ఎవరు?**

ఆర్టికల్ 370 రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించడంపై ఫరూక్ అబ్దుల్లా స్పందిస్తూ.. ఈ తీర్పును స్వాగతిస్తున్నాం అంటూనే దీనిపై తాము మరోసారి కోర్టుకు వెళ్తామని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఏం జరుగుతుందో చెప్పలేమని అన్నారు. 'ఆర్టికల్ 370ని రద్దు చేసేందుకు 70 ఏండ్లు పట్టింది. ఏమో మరో 200 ఏండ్లలో అది మళ్లీ రావొచ్చేమో! అని కూడా వ్యాఖ్యానించి, కశ్మీర్‌ను రావణకాష్టంగా కొనసాగించడానికే తన ఇష్టాన్ని వ్యక్తం చేశారు.

పూర్వపు జమ్ముకశ్మీర్ రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చడంపై స్పందిస్తూ 'కశ్మీర్‌ను నరకానికి వెళ్లనివ్వండి' అని గతంలో అసహనాన్ని వ్యక్తం చేయడం వివాదానికి దారితీసింది. జమ్ము కశ్మీర్‌ని భూతల నరకంగా మార్చింది గతంలో ఆ రాష్ట్రాన్ని పాలించిన అబ్దుల్లాల కుటుంబమే అని బీజేపీ స్పష్టం చేసింది. పరివార్‌వాద్ రాజ్ (బంధుప్రీతి), పాకిస్తాన్ పరస్తీ (మద్దతు) పత్తర్ బాజీ (రాళ్లతో కొట్టడం) రాజకీయాలకు ముగింపు పలికిన 370 రద్దు చేయడం సహజంగానే వారికి నచ్చదని



ఫరూక్ అబ్దుల్లా

# కలకలం

బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా అన్నారు. జమ్ముకశ్మీర్ స్వర్గంగా ఉండేది. దాన్ని నరకంగా మార్చింది ఎవరు?

తండ్రిని మించిన ఘనుడు ఒమర్ అబ్దుల్లా. ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తమకు నిరాశ కలిగించిందని, న్యాయం కోసం సుదీర్ఘ పోరాటానికి తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా. ఈ తీర్పు జమ్మూ కశ్మీర్ ప్రజల పాలిట మరణశాసనం అంటారు పీడీపీ నాయకురాలు, మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ. రాష్ట్రంలో రాజకీయంగా పైచేయి సాధించడమే అజెండాగా పరస్పరం పోటీపడుతున్న నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీల వంటి పార్టీలూ తమదైన వాదనలతో కశ్మీర్ ప్రజల మనసుల్ని విషకలుషితం చేస్తున్నాయి.

**వివాదాస్పద వ్యాఖ్యలు కొత్తేం కాదు**

గతంలో అలీగఢ్ విశ్వవిద్యాలయం నిర్వహించిన ఓ సమావేశంలో ఫరూక్ అబ్దుల్లా ఒక మతోన్మాదిలా మాట్లాడారని సీనియర్ పాత్రికేయుడు, దివంగత కులదీప్ నయ్యర్ ఒక వ్యాసంలో ప్రస్తావించారు. హిందూ ముస్లింలు ఒకే దేశంలో మనలేరని, వారికోసం రెండు వేర్వేరు రాజ్యాలు ఏర్పాటు చేయాల్సిందేనంటూ భారత్ విభజనకు ముందు ముస్లింలీగ్ నాయకుడు మహమ్మదాలీ జిన్నా చేసిన తరహా వ్యాఖ్యలను– ఫరూక్ ప్రసంగం గుర్తుకు తెచ్చిందని అయన అన్నారు. అలాగే శ్రీనగర్ నుంచి వెలువడే ఓ పత్రికలో ఫరూక్ అబ్దుల్లా రాసిన వ్యాసంలో.. భారత్‌పట్ల విషం కక్కారు. 'కశ్మీర్ స్వాతంత్ర్యం కోసం రాష్ట్ర యువత తుపాకులు చేతపట్టి ఉంటే తన తండ్రి షేక్ మహమ్మద్ అబ్దుల్లా ఎంతగానో సంతోషించి ఉండేవార'ని ఆయన అందులో వ్యాఖ్యానించారు.

ఆర్టికల్ 370 విషయంలో కేంద్రం తన విధానాన్ని మార్చుకోకపోతే 2008 నాటి అమర్‌నాథ్ తరహా ఘటనలు పునరావృతమవుతాయని 2015 ప్రాంతంలో ఫరూక్ అబ్దుల్లా హెచ్చరించారు.

ఫరూక్ అబ్దుల్లా తరచూ చేస్తున్న ప్రకటనలు చూస్తుంటే ఆయన నిబద్ధతపట్ల అనుమానాలు ముసురుకుంటున్నాయి. రాజ్యాంగంపై ప్రమాణం చేసి రాజ్యసభ సభ్యుడిగా నియమితుడైన ఈ నాయకుడు ఒక రహస్య ఎజెండా ప్రకారం పని చేస్తుంటారనేది బహిరంగ రహస్యం.. పాకిస్తాన్ నాయకులతో, వేర్పాటువాద హురియత్ నాయకులతో కూడా ఆయనకు మంచి బంధం ఉంది.

ఆర్టికల్ 370 రద్దుకు ముందు జమ్మూ కశ్మీర్‌లో జిహాద్ నిర్వహిస్తున్న ఉగ్రవాదులకు మద్దతుగా గతంలో ప్రతి శుక్రవారం కొన్ని అల్లరి మూకలు భద్రతా దళాలపై రాళ్లు రువ్వేవి.. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదానికి దన్నుగా నిలిచిన ఈ మూకల వారు భారత రాజ్యాంగం పట్ల విధేయతను, భారత జాతీయ సమైక్య సర్వ సత్తాక అధికారం పట్ల నిబద్ధతను, దేశ భౌగోళిక సమగ్రత పట్ల నిష్ఠను ప్రకటించడానికి బహిరంగంగానే నిరాకరించేవి.. ఈ చర్యలను



ఒమర్ అబ్దుల్లా



మెహబూబా ముఫ్తీ

అబ్దుల్లా ఎప్పుడూ ఖండించలేదు. పైగా వారికి బహిరంగంగా వత్తాసు పలికేవారు.

**కశ్మీర్ సంక్షోభంలో అబ్దుల్లా కుటుంబ పాత్ర**

జమ్ముకశ్మీర్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సంక్షోభానికి, సమస్యలకు కారణం ఎవరు? అబ్దుల్లా కుటుంబమే సమస్యకు బీజం వేయడం నిజం కాదా? నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందిన షేక్ అబ్దుల్లా, ఫరూక్ అబ్దుల్లా, ఉమర్ అబ్దుల్లా అనేక ఏళ్ల పాటు కశ్మీర్ ముఖ్యమంత్రులుగా పని చేశారు. తాత, తండ్రి, ఇప్పుడు కొడుకు ఈ పార్టీకి నాయకత్వం వహిస్తున్నారు. 1947 నుంచి ఈ సంక్షోభాన్ని కొనసాగిస్తూ వచ్చారు. ఇప్పుడు అది అంతం కావడం వారికి రుచించడం లేదు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జమ్మూ కశ్మీర్ విలీన సమయంలో జరిగిన కుట్రలు కుతంత్రాల్లో షేక్ అబ్దుల్లాదే కీలక పాత్ర. మన ప్రథమ ప్రధాని నెహ్రూకు ప్రియమిత్రులు ఆయన.. రాష్ట్రంలో మొదటి నుంచి రాజకీయ అధికారాన్ని గుప్పిట్లో పెట్టుకున్నారు. రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి ఈయనే. ఇందుకు నెహ్రూతో పాటు తదుపరి ప్రధాని ఇందిరా గాంధీ కూడా సహకరించారు. షేక్ అబ్దుల్లా తన పార్టీ ముస్లిం కాన్ఫరెన్స్‌ను నేషనల్ కాన్ఫరెన్స్‌గా మార్చారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని ఇచ్చే ఆర్టికల్ 370 సహా, అక్కడ ఉగ్రవాద కార్యకలాపాలు విజృంభించడం షేక్ అబ్దుల్లా హయంలోనే జరిగింది.

షేక్ అబ్దుల్లా తర్వాత ఆయన తనయుడు ఫరూక్ అబ్దుల్లా నేషనల్ కాన్ఫరెన్స్ పగ్గాలు స్వీకరించారు. ఈయన కాలంలో వేర్పాటువాదం మరింత వెర్రితలలు వేసింది. కశ్మీర్ లోయలో మారణకాండ, పండిట్ కుటుంబాలపై అకృత్యాలు, వారిని లోయ నుంచి తరిమేయడం వరకూ ఫరూక్ అబ్దుల్లా సమయంలోనే జరిగాయి. ఆ తర్వాత రాష్ట్రంలో సుదీర్ఘంగా రాష్ట్రపతి పాలన కొనసాగింది. ఈ సమయంలో దేశంలో ఉంచి కశ్మీర్‌లో పరిస్థితులను చక్కదిద్దడంతో కేంద్ర ప్రభుత్వానికి సహకరించాల్సిన ఫరూక్ అబ్దుల్లా ఈ విషయాన్ని పక్కన పెట్టి విదేశాల్లో విలాసంగా గడిపారు.

ప్రస్తుతం ఫరూక్ అబ్దుల్లా పాలనా పగ్గాలను తన కుమారునికి అప్పగించి పరోక్ష పెత్తనం చేస్తున్నారు. ఆయన కుమారుడు ఒమర్ అబ్దుల్లా కూడా జమ్ముకశ్మీర్‌కు ముఖ్యమంత్రిగా పని చేశారు. భారత రాజ్యాంగానికి విధేయత చూపిస్తూ ఇక్కడి రాజకీయ వ్యవస్థలో భాగస్వామిగా ఉన్న పార్టీ నేషనల్ కాన్ఫరెన్స్.. కానీ ఆ పార్టీ పరోక్షంగా వేర్పాటు వాదులను, పాకిస్తాన్ వాదనను సమర్థిస్తుంటుంది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఇటు నేషనల్ కాన్ఫరెన్స్‌కు, అటు పీడీపీకి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. ఉనికిని చాటుకునేందుకు ఫరూక్ అబ్దుల్లా తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. మన రాజ్యాంగం పట్ల నిబద్ధతను ప్రకటించిన జమ్ముకశ్మీర్ భారత్‌లో భాగమన్న వాస్తవాన్ని అంగీకరించిన నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు చేయడం ఏ మాత్రం క్షమార్హం కాదు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్



# బాల జాగృతి

## తెలుసుకుందాం

## పెదవాల్తేరులోని పోలమాంబ దేవాలయం



విశాఖపట్టణంలోని పెద్దవాల్తేరులో ఈ ఆలయం కొలువుదీరింది. ఈ ఆలయానికే కరకచెట్టు పోలమాంబ ఆలయం అని కూడా పేరు. ఈ అమ్మవారిని జీడిపళ్ల అమ్మవారు, సర్పదేవత, సముద్ర దేవత అని కూడా పిలుస్తారు. ఉత్తరాంధ్రవాసులు, విశాఖపట్నం చుట్టుపక్కల ప్రజలు పోలమాంబ దేవతను పిలిస్తే పలికే దైవంగా కొలుస్తారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో భక్తులు అమ్మవారి దర్శనానికి భారీగా తరలివస్తారు.

## కథ — వజ్రాల మూట



ఒకసారి వివేకవర్మ మహారాజు దగ్గరకు ఒక వ్యక్తి న్యాయం కోసం వచ్చాడు.

అతడు మహారాజుకు వందనం చేసి, "మహారాజా! నా పేరు గోపాలుడు. మా యజమాని పేరు నీలంకంఠం. ఆయన నాకు వజ్రాలు ఇస్తానని చెప్పి మోసం చేశారు. మీరే నాకు న్యాయం చేయాలి" అని వేడుకున్నాడు.

"నీకు జరిగిన అన్యాయాన్ని వివరంగా చెప్పు" అన్నాడు మహారాజు. "

" ప్రభూ! ఒకరోజు నేను, మా యజమాని వేరే రాజ్యం నుండి ఇంటికి తిరిగి వస్తున్నాం. కుండపోతగా వర్షం కురుస్తుండటంతో దగ్గరలో ఉన్న ఒక పురాతన ఆలయం లోపలికి వెళ్లి తలదాచుకున్నాం. ఆ ఆలయంలో మాకు వజ్రాలు కనిపించాయి. మా యజమాని వెంటనే వాటిని తీసుకొని మూట కట్టాడు. 'ఈ ఆలయంలో మనకు వజ్రాలు దొరికాయని ఎవరితోనూ చెప్పకు. ఇంటికి చేరాక నీకు వీటిలో సగం వాటా ఇస్తాను' అని చెప్పాడు. నా వాటాగా వచ్చే వజ్రాలను అమ్ముకుని ఏదైనా వ్యాపారం చేసుకోవచ్చని నేను అప్పుడు ఏమీ అనలేదు. కానీ ఇప్పుడు నా వాటా అడిగితే ఇవ్వడం లేదు"అని వివరించాడు గోపాలుడు.

గోపాలుడి యజమాని నీలకంఠుడిని పిలిపించాడు రాజు.

"మహాప్రభూ! ఇతడు చెప్పే మాటలు పచ్చి అబద్ధాలు. ఆ వజ్రాలు దొరికినమాట నిజమే. ఏ వస్తువు దొరికినా అది మీకే చెందుతుందని

## పద్యము

**మిరెము గింజ చూడ మీద నల్లగనుండు**
**కొఱికి చూడ లోనంజుఱు మనును**
**సజ్జనులగువారి సార మిట్లుండురా**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**భావం :** మిరియము గింజ పైకి చూచినచో నల్లగా యున్ననూ, కొరికి చూచినచో కారంగా మంటగా ఉండును. ఆ విధంగానే మంచివాడు పైకి చూచుటకు అలంకారములు లేకపోయిననూ, లోపల హృదయమునందు మేధాసంపత్తి నిండియుండును అని భావం.

## శ్లోకము

'ఉదారస్య తృణం విత్తం

**'ఉదారస్య తృణం విత్తం**
**శూరస్యమరణంతృణం**
**విరక్తస్య తృణం భార్యా**
**నిస్పృహస్య తృణం జగత్'**

**భావం :** దాతకు తన వద్ద ఉన్న ధనం గడ్డిపరకతో సమానం. వీరునికి మృత్యువంటే లెక్కలేదు. విరక్తులకు సంసారం(భార్య)తో, కోరికలు లేనివాడికి లోకంతో పనిలేదు.

## జతపరచండి

**ఎవరు, ఎవరికి సోదరుడు?**


| | |
|---|---|
| కుంభుడు | సుబాహుడు |
| సంపాతి | కుశధ్వజుడు |
| మారీచుడు | నికుంభుడు |
| జనకుడు | జటాయువు |

జవాబులు : కుంభుడు–నికుంభుడు, సంపాతి–జటాయువు, మారీచుడు–సుబాహుడు, జనకుడు–కుశధ్వజుడు

నిర్వహణ : నయనశ్రీ

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### యమునా ప్రసాద్ శాస్త్రి



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, రాజకీయ నాయకుడు. **1927, జూన్ 16న** మధ్యప్రదేశ్‌లో జన్మించారు. **1955లో** వింధ్య ప్రాంతంలో భూస్వామ్య అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన కిసాన్ ఉద్యమంలో, గోవా లిబరేషన్ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని లాఠీ దెబ్బలు తిన్నారు. ఉద్యమంలో తన కుడి కంటిచూపును కూడా కోల్పోయారు. **1997లో** తుదిశ్వాస విడిచారు.



భావించి, వజ్రాలను నేనే స్వయంగా మూటకట్టి ఇతనితో మీ వద్దకే పంపించాను” అని చెప్పాడు.

“దీనికి సాక్షులు ఎవరైనా ఉన్నారా?” అని అడిగాడు మహారాజు.

“లేకేం, నా భార్య, అత్తగారు చూశారు ప్రభూ” అన్నాడు నీలకంఠుడు.

మహారాజు వారిద్దరినీ పిలిపించాడు. వారు వచ్చాక, వారిద్దరినీ వజ్రాలు కట్టిన మూట ఏ రంగులో ఉంటుందో చెప్పమని విడివిడిగా అడిగాడు.

ఇద్దరూ వేరువేరు సమాధానాలు చెప్పారు. దీంతో నీలకంఠుడి మోసం బయటప డింది.

“నీలకంఠా! వెంటనే వజ్రాలు నాకు అప్పగించు, గోపాలుడిని మోసం చేసినందుకు అతనికి వేయి బంగారు నాణాలు పరిహారంగా ఇవ్వు” అని తీర్పు ఇచ్చాడు. ★

## జనరల్ నాలెడ్జ్

1. అయోధ్యలో రామాలయ ప్రాణప్రతిష్ఠ ఎప్పుడు?
2. జాతీయ యువజన దినోత్సవం ఎప్పుడు జరుపుకుంటారు?
3. ప్రపంచంలోనే అతిపెద్ద జంతువు ఏది?

సమాధానాలు :1. జనవరి 22, 2024 2. జనవరి 12 (స్వామి వివేకానంద జయంతి సందర్భంగా) 3. తిమింగలం.

## మెదడుకు మేత

ఒక్కటే కడుపు కానీ రెండు గుడ్లు.. ఏమిటది?

జవాబు : వేరుశనగ

## మంచిమాట

**మాటను మించిన మహా ఔషధం లేదు..**
**మాటను మించిన మహాయుద్ధమూ లేదు..**




# వారఫలాలు

22 - 28 జనవరి 2024

### మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

ముఖ్యమైన కార్యక్రమాలు కొన్ని వాయిదా వేస్తారు. స్నేహితులు, బంధువులతో విభేదాలు. స్వల్పశారీరక రుగ్మతలు. కష్టపడ్డా ఫలితం కనిపించదు. ఒక సమాచారం నిరాశపరుస్తుంది. గృహ నిర్మాణాల్లో కొంత జాప్యం. వ్యాపారులకు పెట్టుబడులు ఆలస్యమవుతాయి. కళాకారులకు కొన్ని చికాకులు తప్పవు. రాజకీయవేత్తలు, క్రీడాకారులకు అంచనాలలో పొరపాట్లు. 24,25 తేదీల్లో శుభవార్తలు. ఉద్యోగయోగం. విష్ణుధ్యానం చేయండి.

### వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

కొత్త కార్యక్రమాలు ప్రారంభించి సజావుగా పూర్తి చేస్తారు. రాబడి సంతృప్తికరంగా ఉంటుంది. వాహనాలు, భూములు కొనుగోలు చేస్తారు. వ్యాపారులు పెట్టుబడులకు తోడు అనుకున్న లాభాలు అందుతాయి. ఉద్యోగులకు మరింత ఉత్సాహవంతంగా ఉంటుంది. కళాకారులకు కొత్త అవకాశాలు. రచయితలు, క్రీడాకారులు లక్ష్యాలు సాధిస్తారు. 27,28 తేదీల్లో అనుకోని ఖర్చులు. బంధువులతో వివాదాలు. హనుమాన్ ఛాలీసా పఠించండి.

### మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

రాబడి మరింత ఉత్సాహాన్నిస్తుంది. కొత్త కార్యక్రమాలు చేపడతారు. ఆస్తి వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి. వ్యాపారులు తగినంత లాభాలు అందుకుంటారు. కొత్త పెట్టుబడులు అందుతాయి. కళాకారులు, రచయితలు పట్టుదలతో అవకాశాలు సాధి స్తారు. 22,23 తేదీలలో స్నేహితులతో వివాదాలు. అనుకోని ఖర్చులు. ప్రయాణాలు. శ్రీ నృసింహస్తోత్రాలు పఠించండి.

### కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

ఆదాయం ఊరటనిస్తుంది. అప్పుల బాధలు తొలగుతాయి. కొన్ని కార్యక్రమాలు సాఫీగా పూర్తి చేస్తారు. ఆస్తి వివాదాల నుంచి బయటపడతారు. వాహనసౌఖ్యం. ఉద్యోగయత్నాలు ఫలిస్తాయి. వ్యాపారులు ఆశించిన లాభాలు పొందుతారు. ఉద్యోగులకు మరింత అనుకూలస్థితి. రాజకీయ వర్గాలకు ఒత్తిడులు తొలగుతాయి. కళాకారులు, క్రీడాకారులకు పరిస్థితులు అనుకూలిస్తాయి. 26,27 తేదీల్లో ఖర్చులు అధికం. గణేశాష్టకం పఠించండి.

### సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

ముఖ్య కార్యక్రమాలు విజయవంతంగా సాగుతాయి. విద్యార్థులకు నూతనోత్సాహం. రాబడి గతంకంటే మెరుగ్గా ఉంటుంది. రుణబాధలు తొలగుతాయి. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులకు లాభాలు దక్కుతాయి. ఉద్యోగులకు విధుల్లో అవాంతరాలు తొలగుతాయి. కళాకారులకు విశేషంగా కలిసివస్తుంది. 25,26 తేదీల్లో బంధువులతో విభేదాలు. శారీరక రుగ్మతలు. శివపంచాక్షరి పఠించండి.

### కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

చేపట్టిన కార్యక్రమాలు కొన్ని విజయవంతంగా సాగుతాయి. శ్రేయోభిలాషుల సూచనలు అమలు చేస్తారు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. అనుకోని విధంగా కాంట్రాక్టులు దక్కుతాయి. వాహన సౌఖ్యం. వ్యాపారులకు అనుకోని విధంగా లాభాలు కళాకారులు, క్రీడాకారులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. 22,23 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

### తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు


ముఖ్యమైన కొన్ని కార్యక్రమాలు నిదానించినా చివరికి పూర్తి కాగలవు. అదనపు ఆదాయం సమకూరి అవసరాలు తీరతాయి. సుదీర్ఘ విరామం తర్వాత బంధువులను కలుసుకుంటారు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులకు పెట్టుబడులు అందుతాయి. 23.24 తేదీల్లో వృథా ఖర్చులు. కుటుంబంలో ఒత్తిడులు. శారీరక రుగ్మతలు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

### వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

అనుకున్న కార్యక్రమాలు ఎటువంటి జాప్యం లేకుండా పూర్తి చేస్తారు. రాబడి సంతృప్తినిస్తుంది. విద్యార్థులు కొత్త అవకాశాలు దక్కించుకుంటారు. దేవాలయాలు సందర్శిస్తారు. అనుకోని సంఘటనలు ఎదురవుతాయి. వ్యాపారులకు లాభాలు.ఉద్యోగులకు ఒక సమాచారం ఊరట నిస్తుంది. రాజకీయవేత్తల యత్నాలు సఫలం. 24,25 తేదీల్లో వ్యయ ప్రయాసలు. శ్రీ లక్ష్మీస్తోత్రాలు పఠించండి.

### ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

నమాజసేవలో చురుగ్గా పాల్గొంటారు.




సింహంభట్ల సుబ్బారావు
6300674054


ఆదాయం మరింత మెరుగుపడుతుంది. విద్యార్థులకు కొత్త అవకాశాలు దగ్గరకు వస్తాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులు లాభాల బాటలో నడుస్తారు. కళాకారులకు కొన్ని అవకాశాలు దక్కుతాయి. రచయితలు, క్రీడాకారులు అనుకున్నది సాధిస్తారు. 27,28 తేదీల్లో బంధువులతో తగాదాలు. శారీరక రుగ్మతలు. దుర్గాస్తోత్రాలు పఠించండి.

### మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

మీ అంచనాలు, ఊహలు ఫలిస్తాయి. నిరుద్యోగులు, విద్యార్థులకు అనుకూల పరిస్థితులు. చేపట్టిన కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి చేస్తారు. దేవాలయాలు సందర్శిస్తారు. కొన్ని సమస్యలు నేర్పుగా పరిష్కరించుకుంటారు. పారిశ్రామికవేత్తల యత్నాలలో కొంత పురోగతి. 22,23 తేదీల్లో స్నేహితులు, బంధువులతో తగాదాలు. వృథా ఖర్చులు. ఆంజనేయ దండకం పఠించండి.

### కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

స్నేహితులతో విభేదాలు పరిష్కారమవుతాయి. మీ సమర్థతను చాటుకుని ముందడుగు వేస్తారు. ఆదాయంలో పెరుగుదల, కొన్ని రుణాలు తీరే అవకాశం. సేవాభావాన్ని చాటుకుంటారు. వివాహ, ఉద్యోగా యత్నాలలో పురోగతి. వ్యాపారులు విస్తరణ కార్యక్రమాలు పూర్తిచేస్తారు. కళాకారులు, రచయితలు లక్ష్యాలుసాధిస్తారు. 24,25తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. శ్రీరామరక్షాస్తోత్రాలు పఠించండి.

### మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

అదనపు ఆదాయం సమకూరి ఎటువంటి అవసరాలైనా తీరతాయి. బంధువుల నుంచి శుభవర్తమానాలు. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. కొత్త కాంట్రాక్టులు లభిస్తాయి. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగులకు పరిస్థితులు అనుకూలిస్తాయి. రాజకీయవేత్తలకు ఊహించని అవకాశాలు. కళాకారులు, రచయితలకు ముఖ్య సమాచారం. 25,26 తేదీల్లో స్నేహితుల నుంచి ఒత్తిళ్లు. వృథాఖర్చులు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

# పదరసం-448

### ఆధారాలు

**అడ్డం**

1) యోగసూత్రాలనందించిన మహర్షి (4)
3) ఈ దుంప నుంచి సగ్గుబియ్యం తయారు చేస్తారు (5)
5) మెత్తని పొడి (2)
6) ప్రవరాఖ్యుని వరించిన గంధర్వ స్త్రీ (4)
8) తిరగబడ్డ సహనం (3)
11) దీనినిచూసి బలుపు అనుకోకూడదట (2)
12) జవాబు సవ్యంగా లేదు (4)
15) మన్మథుడు (3)
16) ఇవి విచారించడమంటే మంచి చెడులు అడగడం (5)
17) అసలే వంట్లో బాలేదు. ఆపై చెదిరింది కూడా (4)
19) సాధారణంగా వారానికోసారి జరిగే అంగళ్ల వ్యాపారం (2)
20) మహా మొండివానిని ఇలా అంటారు (4)
22) అటునించి పెద్దగా పిలిచే అరుపులాంటి పిలుపు (4)
25) నిజంకాదు, తప్పు (2)
26) శ్రీకృష్ణదేవరాయల మహామంత్రి (4)

**నిలువు**

1) సమాప్తి, ఒకపని ప్రభావం (5)
2) కడలి (3)
3) కలిగియుండుట, సంపద (3)
4) ధనం (2)
7) ఉండటానికి అనుకూలం (5)
9) అక్షరాభ్యాసం అంటే వీటిని దిద్దించడం (వాడుక భాషలో) (4)
10) కళ్లకు గంతలు కట్టుకుని ఆడే ఆట (6)
13) మరోలా (పైకి) (3)
14) అభ్యంతరం, అసమ్మతి (4)
17) విరిగిన చూపుడు వేలు (4)
18) రోటికి నేస్తం (3)
21) పైకి అడుక్కోవడం (3)
23) వక్క (2)
24) అంతులేని కాటకం (2)

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | ■ | 3 | | | 4 | |
| | ■ | | ■ | 5 | | ■ | ■ | | ■ |
| 6 | | | 7 | ■ | 8 | | 9 | ■ | 10 |
| | ■ | ■ | 11 | | ■ | ■ | | ■ | |
| 12 | 13 | | | ■ | 14 | ■ | 15 | | |
| ■ | | ■ | 16 | | | | | ■ | |
| 17 | | 18 | | ■ | | ■ | ■ | 19 | |
| | ■ | | ■ | 20 | | 21 | | ■ | |
| 22 | | | 23 | ■ | ■ | | ■ | 24 | ■ |
| | ■ | ■ | 25 | | ■ | 26 | | | |

### పదరసం - 444 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| పె[1] | ద్ద | బా[2] | ల | శి[3] | క్ష | ■ | ర్తి[4] | ■ | ల[5] |
| త్త | ■ | సి | ■ | ఖం | ■ | ఆ[6] | భ | ర | ణం |
| నం[7] | ద[8] | కం | ■ | డి[9] | బ[10] | రా | ■ | ■ | వ |
| ■ | ర | ■ | అ[11] | ■ | లి | ■ | దు[12] | ■ | ■ |
| మ[13] | హా | భా | ర | తం | ■ | స[14] | మా | వే | శం[15] |
| ■ | సం | ■ | మ | ■ | ■ | ■ | రం | ■ | క |
| బా[16] | ■ | ప[17] | రి | మ | ళం[18] | ■ | ■ | సి[19] | రా |
| ణా | ■ | ■ | క | ■ | యా[20] | చ | న[21] | ■ | భ |
| సం[22] | త | కా[23] | లు | ■ | ళ | ■ | త | ■ | ర |
| చా | ■ | డు | ■ | స[24] | మ | స్యా | పూ | ర | ణం |

సి ని మా

అరుణ



ఈసారి సంక్రాంతి యమా రంజుగా మొదలైంది. అనువాద చిత్రాలతో కలిపి ఏడెనిమిది సినిమాలు విడుదల కావాల్సింది. కానీ చివరి నిమిషంలో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, తెలుగు నిర్మాతల మండలి, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ నిర్మాతలతో చర్చోపచర్చలు జరిపి వాటిని నాలుగుకు కుదించాయి. దాంతో జనవరి 12 మహేశ్ బాబు 'గుంటూరు కారం', తేజ సజ్జ 'హనుమాన్'; 13వ తేదీ వెంకటేశ్ 'సైంథవ్'; 14వ తేదీ నాగార్జున 'నా సామిరంగ' చిత్రాలు పండగ కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. ఈ నాలుగు సినిమాలతో పాటే రావాల్సిన 'ఈగల్' మూవీ ఫిబ్రవరి 9కి వాయిదా పడగా, తమిళ అనువాద చిత్రాలు 'అయలాన్' ఈ నెల 19కి, 'కెప్టెన్ మిల్లర్' మూవీ 25కి వాయిదా పడ్డాయి.

# సంక్రాంతి విజేత 'హనుమాన్'

ఈ సంక్రాంతికి చిన్న చిత్రంగా విడుదలై పెద్ద విజయాన్ని నమోదు చేసుకుంది 'హనుమాన్'. విశేషం ఏమంటే... ఈ సినిమా విడుదలకు ఒకరోజు ముందే పెయిడ్ ప్రీమియర్ షోస్‌ను వేశారు. వాటికి చక్కని ఆదరణ లభించింది. ఇక 'హనుమాన్' కథ విషయానికి వస్తే... అంజనాద్రి అనే ఊరికి చెందిన హనుమంతు సాదాసీదా కుర్రాడు. అక్క అంజమ్మకి అతనంటే ప్రాణం. అదే ఊరికి చెందిన మీనాక్షిని చిన్నప్పట్నుంచి ప్రేమిస్తుంటాడు హనుమంతు. అయితే, మీనాక్షి మాత్రం అతణ్ణి ఎప్పటికప్పుడు







తప్పుగానే అర్థం చేసుకుంటూ ఉంటుంది. ఒకనొక సందర్భంలో ప్రమాదంలో చిక్కుకున్న మీనాక్షిని కాపాడే క్రమంలో.. సముద్రంలో పడిపోతాడు హనుమంతు. అక్కడ అతనికి రుధిరమణి దొరుకుతుంది. అక్కడ నుండి హనుమంతు జీవితం మారిపోతుంది. అదే మణిని పొందడానికి సౌరాష్ట్రకు చెందిన మైఖేల్ అంజనాద్రికి వస్తాడు? రుధిర మణిలోని గొప్పదనం ఏమిటీ? దానికి హనుమంతుడికి సంబంధం ఏమిటీ? మైఖేల్ ఎందుకు రుధిరమణిని అపహరించాలని అను కున్నాడు? అనేది మిగతా కథ. నిజానికి ఈ కథలో పెద్దంత కొత్తదనం లేకపోయినా... ఎక్కడా బోర్ కొట్టకుండా దర్శకుడు ప్రశాంత్ వర్మ 'హనుమాన్' మూవీని తెరకెక్కించాడు. ముఖ్యంగా ఆయా పాత్రలలో నటీనటులు చక్కగా ఒదిగిపోయారు.

అన్నింటినీ మించి గ్రాఫిక్స్ వర్క్, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్, సినిమాటోగ్రఫీ ఈ మూవీని నిలబెట్టాయి. పైగా ఈ నెల 22న అయోధ్య రామమందిర ప్రతిష్ఠాపన జరుగబోతున్న నేపథ్యంలో అందరి మదిలో రాముడు కొలివై ఉన్నాడు. 'హనుమన్' మూవీ ఆ రకంగా సరైన సమయంలో రావడంతో అందరూ ఈ చిత్రంతో కనెక్ట్ అవుతున్నారు. ఆ రకంగా ఈ సినిమా సంక్రాంతి బరిలో నిలిచిన ఇతర స్టార్ హీరోల చిత్రాలను అధిగమించి, అగ్రస్థానంలోకి చేరుకోబోతోంది. పైగా ఇది దేశ వ్యాప్తంగా వివిధ భాషల్లో విడుదల కావడం... అన్ని చోట్ల పాజిటివ్ ఫీడ్ బ్యాక్ రావడం మరో విశేషం.

ఇక మహేశ్ బాబు, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వచ్చిన మూడో సినిమా 'గుంటూరు కారం' బలహీనమైన కథ, కథనాల కారణంగా మహేశ్ బాబు అభిమానులను సైతం నిరాశకు గురిచేసింది. చిన్నప్పుడే తల్లికి దూరమైన రమణ అనే గుంటూరు కుర్రాడి కథ ఇది. భర్త, కొడుకును వదిలి తండ్రి దగ్గరకు వెళ్లిపోయి, రాజకీయాలలో రాణిస్తూ న్యాయశాఖా మంత్రి అయిన వసుంధర దేవి తిరిగి తన వాళ్లకు ఎలా చేరువైందన్నదే ఈ సినిమా. తల్లీ కొడుకుల సెంటిమెంట్‌కు త్రివిక్రమ్ ఇందులో ప్రాధాన్యమిచ్చారు. తన మార్కు సంభాషణలతో ఆకట్టుకునే ప్రయత్నం చేశాడు. మహేశ్ బాబు ఓ మెట్టుదిగి ఈ సినిమాలో మాస్‌ను ఆకట్టుకోవడానికి ధూమపానం, మద్యపానం చేశాడు. వేరే సినిమాల్లోని ఐటమ్ సాంగ్స్‌కు నర్తించాడు... అయినా ఇవేవీ 'గుంటూరు కారం' మూవీని ప్రేక్షకులకు చేరువ చేయలేకపోయాయి. కలెక్షన్స్ పరంగా 'గుంటూరు కారం' ఓపెనింగ్స్ ను బాగానే సాధించినా... ప్రేక్షకుల అభిమానాన్ని మాత్రం పొందలేకపోయింది.

అలానే వెంకటేశ్ నటించిన 75వ చిత్రం 'సైంథవ్' కూడా సంక్రాంతి కానుకగా 13న జనం ముందుకు వచ్చింది. తండ్రీ, కూతుళ్ల సెంటిమెంట్‌తో వచ్చిన ఈ సినిమా నిండి భరించలేని యాక్షన్ పార్ట్ చోటుచేసుకుంది. కమల్ హాసన్ 'విక్రమ్', రజనీకాంత్ 'జైలర్' ఛాయల్లో ఈ సినిమా సాగింది. సీనియర్ స్టార్ హీరోలు అవుట్ అండ్ అవుట్ మాస్ సినిమా చేస్తే జనం చూస్తారనే భ్రమలోనే ఇంకా మన దర్శక నిర్మాతలు ఉన్నారనిపిస్తోంది. కానీ అందులో వాస్తవం లేదని 'సైంథవ్' నిరూపించింది. సహజంగా వెంకటేశ్ నుండి ఇలాంటి పండగ సీజన్స్‌లో ఫ్యామిలీ ఎంటర్ టైనర్స్‌ను ప్రేక్షకులు కోరుకుంటారు. కానీ అందుకు పూర్తి భిన్నంగా 'సైంథవ్' ఉండటంతో దానిని తిరస్కరించారు. ఇక ఈ సీజన్‌లో వచ్చిన నాలుగో సినిమా 'నా సామిరంగ'. నాగార్జున, 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా మలయాళ చిత్రం 'పోరింజు మరియం జోస్'కు రీమేక్. మాతృక కథ క్రిస్మస్ రోజుల్లో జరిగేది కాగా తెలుగు వర్షన్ దగ్గరకు వచ్చే సరికి నేటివిటీని దృష్టిలో పెట్టుకుని సంక్రాంతి సీజన్‌కు మార్చారు. స్నేహం, ప్రేమ, త్యాగం నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాతో కొరియోగ్రాఫర్ విజయ్ బిన్ని దర్శకుడిగా పరిచయం అయ్యాడు. ఈ సినిమా కూడా ఫ్యామిలీ ఆడియెన్స్‌ను మెప్పించడంలో ఫెయిల్ అయ్యింది. ఆ రకంగా ఈ యేడాది సంక్రాంతి బరిలో నిలిచి గెలిచిన చిత్రం 'హనుమాన్'!

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# పతంగుల పండుగ

సూర్యుడు మకరరాశిలో ప్రవేశించిన రోజును మకర సంక్రాంతిగా, ఉత్తరాయణ ప్రారంభ దినంగా మనం జరుపుకుంటాం. ఈ పండుగ గురించిన ప్రస్తావనలు ఐదువేల ఏళ్లకు పైబడినదిగా చెప్పే రుగ్వేదంలో మనకు కనిపిస్తాయి. దేవతలు నిద్ర నుంచి లేచే రోజు ఇది అని హిందువుల విశ్వాసం. వారు లేవగానే మనోహరమైన దృశ్యం కనిపించేలా దేశంలోని ప్రజలు రంగు రంగుల గాలిపటాలను ఎగురవేసి, సంబరాలు జరుపుకుంటారు. ఆధునిక కాలంలో దానినే 'కైట్ ఫెస్టివల్'గా జరుపుకుంటున్నాం. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ప్రతి ఏడాదీ జరుగుతున్న అంతర్జాతీయ పతంగుల పండుగలో కనిపించే నయనానందకరమైన దృశ్యాలు, వర్ణాలు.





From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 76 Issue : 11

*With best compliments from:*

Estd : 1994-95

# G.PULLA REDDY COLLEGE OF PHARMACY

Affiliated to Osmania University and Approved by PCI & AICTE
Accredited by NAAC, ISO 9001-2015 Certification
G.Pulla Reddy Educational Campus, Mehdipatnam, Hyderabad-500028
Phone : 040-23517222, +91 8297511177
Email: gprcphyd@gmail.com I website : gprcp.ac.in

EAMCET Code : GPRP

PGECET Code : GPRP1



## COURSES OFFERED

**B.Pharm**

**M.Pharm**

1. M.Pharm (Pharma. Chemistry)
2. M.Pharm (Pharmaceutics)
3. M.Pharm (Pharmacology)
4. M.Pharm (Pharma. Analysis)
5. M.Pharm (Pharma. Regulatory Affairs)

**Pharm D**

Founder Chairman
**Late G. Pulla Reddy**

Chairman
**P.Subba Reddy**

Managing Trustee
**G.Raghava Reddy**